మార్క్సిస్టు

మే
2022

193

సంపుటి : 16 సంచిక : 10 వెల రు. 15/-

## ఈ సంచికలో........

రిజర్వేషన్ల అవసరం - పరిమితులు

ప్రజాపునాది ఎందుకు చెదిరింది?

వైవిధ్యాన్ని పెంపొందించిన అశోకుని పాలన

దాడులను తీవ్రం చేసిన సంఘ్ పరివార్

ఎల్.ఐ.సి ఐ.పి.ఓ భారీ కుంభకోణం

తీవ్రమౌతున్న సామాజిక వైరుధ్యాలు

శత్రువుల ముట్టడిని ఎదుర్కొని సోషలిజం గెలుస్తుంది?

తెనాలి సదస్సు - విప్లవ పార్టీ ఏర్పాటుకు సన్నాహాలు



epaper.prajasakti.com

# తెనాలి సదస్సు - విప్లవపార్టీ ఏర్పాటుకు సన్నాహాలు

దశాబ్దం పాటు రివిజనిజానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం 1964 నాటికి తిరిగి వెనక్కు మళ్లలేని దశకు చేరుకుంది. జాతీయ కౌన్సిల్ సభ్యుల నాయకత్వ ధోరణికి, వారు అనుసరిస్తున్న కమ్యూనిస్టు వ్యతిరేక పద్ధతులు, విధానాలు, కౌన్సిల్ అంగీకరించిన నిర్ణయాలను అమలు చేయకుండా పార్టీని రివిజనిస్టు పంథాలో నడిపిస్తున్న తీరుకు వ్యతిరేకంగా ఏప్రిల్ 11వ తేదీన 32 మంది కౌన్సిల్ సభ్యులు సమావేశాన్ని బహిష్కరించి బయటికి వచ్చారు. ఈ 32 మంది 1964 ఏప్రిల్ 14 న పార్టీ సభ్యులందరికి ఉమ్మడిగా ఒక విజ్ఞప్తి చేశారు. బలమైన కమ్యూనిస్టు పార్టీని నిర్మించే విధానాన్ని ఈ ప్రకటన స్పష్టపరిచింది.

1.పి.సుందరయ్య 2. ఎం. బసవపున్నయ్య 3.టి.నాగిరెడ్డి 4. ఎం.హనుమంతరావు 5. డి.వెంకటేశ్వర రావు 6. ఎన్.ప్రసాద రావు 7. జి.బాపనయ్య 8. ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్ 9. ఏ.కె.గోపాలన్ 10. ఏ.వి.కున్హామ్బు 11. సి.ఎచ్. కనరన్ 12.ఇ.కె.నయనార్ 13.వి.ఎస్. అచుతానందన్ 14.ఇ.కె.ఇంబిచిబావ 15. ప్రమోద్‌దాస్ గుప్త 16.ముజఫర్ అహ్మద్ 17. జ్యోతిబసు 18. అబ్దుల్ హలీమ్ 19. హరేకృష్ణ కోనార్ 20. సరోజ్ ముఖర్జీ 21.పి.రామమూర్తి 22. ఎం.ఆర్.వెంకట్రామన్ 23.ఎన్.శంకరయ్య 24.కె.రమణి 25. హరికిషన్ సింగ్ సూర్జిత్ 26.జగజిత్ సింగ్ ల్యాల్‌పురి 27. డి.ఎస్.తాపియాలా 28. డాక్టర్ భాగ్‌సింగ్ 29 షియో కుమార్ మిశ్రా 30.ఆర్.ఎన్.ఉపాధ్యాయ 31. మోహన్ పునామియా 32. ఆర్.పి.సరాఫ్ ఉమ్మడి ప్రకటనపై సంతకాలు చేశారు.

ఎస్.ఏ డాంగే నాయకత్వంలోని సెక్రెటేరియట్ పార్టీ వ్యతిరేక, ముఠాతత్వ కార్యకలాపాలకు పాల్పడుతున్నదని, అందువలన వాటి పై పోరాటాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలి అనే విషయంపై తాము పరస్పరం చర్చించుకున్నామని, ఈ పోరాటం సంస్కరణవాద రాజకీయ పంథా వ్యతిరేక పోరాటంతో ముడిపడి ఉన్నదనే నిర్ణయానికి వచ్చామని ప్రకటించారు. కాంగ్రెస్‌తో కలిసి ఐక్య సంఘటనను ఏర్పాటు చేసే సంస్కరణవాద రాజకీయ పంథాను పార్టీ సభ్యులు, శాఖలు



తిరస్కరించాలని పిలుపునిచ్చారు. 1961లో జరిగిన పార్టీ ఆరవ మహాసభలో కూడా సంస్కరణవాదులు ఈ పంథానే ప్రవేశ పెట్టారని, అయితే దానిని ప్రతినిధులు గట్టిగా వ్యతిరేకించారని, పార్టీ మహాసభ ఆ పంథాని వ్యతిరేకిస్తూ తీర్మానాన్ని ఆమోదించిందని తెలిపారు. ఈ పచ్చి సంస్కరణవాద రాజకీయ పంథాని బలపరచిన కామ్రేడ్లు ఆఖరికి మహాసభలో తమ ఓటమిని ఒప్పుకోవలసి వచ్చింది. అయితే పార్టీ మహాసభ తర్వాత కూడా వారు ఆ పంథానే ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారు.” అని ప్రకటనలో పేర్కొన్నారు.

డాంగే నాయకత్వంలోని సెక్రెటేరియట్ అనుసరిస్తున్న సంస్కరణవాద రాజకీయాల విషయంలో, పార్టీ నిర్మాణంలోని ముఠా తత్వాన్ని ప్రతిఘటించే పద్ధతులతో పాటు, దేశ ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై అంచనాల విషయంలో తమ మధ్య విభేదాలు ఉన్నాయనే విషయాన్ని ఈ ప్రకటనలో బహిరంగంగా ఒప్పుకున్నారు. అయితే పార్టీ సభ్యులకు తామందరూ ఐక్యంగా విజ్ఞప్తి చేయడం, పార్టీ మహాసభను ఏర్పాటు చేయడం ద్వారా మాత్రమే పార్టీలో ఏర్పడిన ఈ అంతర్గత సమస్యలు పరిష్కరించబడతాయి” అని పేర్కొన్నారు. “ముసాయిదా కార్యక్రమం” పై ఏకాభిప్రాయం ఉన్నా, సైద్ధాంతిక సమస్యలపై తమలో తమకు విభేదాలు ఉన్నాయని, ముసాయిదా కార్యక్రమాన్ని తాత్కాలికంగా ఏకగ్రీవంగా ఆమోదించామని తెలిపారు.

“(మాలోమాకు) విభేదాలు ఉన్నప్పటికీ సంస్కరణవాద రాజకీయ పంథాను ప్రతిఘటించడానికి, పార్టీకి వ్యతిరేకంగా ముఠాలు కట్టటాన్ని, బ్రిటీష్ వారికి డాంగే సేవ చేసేందుకు సిద్ధపడటం, దానిని కప్పిపెట్టేందుకు నిస్సిగ్గుగా చేసే ప్రయత్నాలను మేమందరం వ్యతిరేకిస్తున్నాం. “తమను వేరుచేస్తున్న సైద్ధాంతిక, రాజకీయ సమస్యలపై మరింత ఎక్కువగా పరస్పరం చర్చించుకోవాలని, మొత్తం పార్టీ సభ్యులందరూ ఈ చర్చలలో భాగస్వాములు కావాలని వారు ప్రతిపాదించారు.

ఈ చర్చలకు సహకరించడానికి పార్టీ సభ్యులకు, సానుభూతిపరులకు ఈ కింది పత్రాలను పంపిణి చేశారు. 1. తాము ఆమోదించిన తాత్కాలిక పార్టీ కార్యక్రమం ముసాయిదా. 2. కామ్రేడ్ ఇ.ఎం.ఎస్ తయారు చేసిన పార్టీ కార్యక్రమం ముసాయిదా 3.సైద్ధాంతిక సమస్య పై ఇతరులతో కలిసి కామ్రేడ్ ఎం.బసవపున్నయ్య తయారు చేసిన ముసాయిదా 4. ఈ సమస్యలపై ఇతరులతో కలిసి కామ్రేడ్ జ్యోతిబసు తయారు చేసిన ముసాయిదా. కార్యక్రమం ముసాయిదాపై కామ్రేడ్ ఇ.ఎం.ఎస్ తయారు చేసిన విమర్శను, ఇఎంఎస్ రూపొందించిన ముసాయిదా కార్యక్రమంపై ఇతరుల విమర్శను కూడా తరువాత పంపిణి చేస్తామని ప్రకటించారు. ‘ఈ రకమైన చర్చలు, క్రియాశీల రాజకీయ కార్యకలాపాలు, ప్రజా సమస్యలపై చేసే కృషి ద్వారా డాంగే, ఆయన అనుయాయుల విధానాలను సమర్ధవంతంగా ప్రతిఘటించడంతో పాటు పార్టీ సభ్యులు, సానుభూతిపరులలో ఎక్కువ మంది మద్దతు పొందగలమన్న విశ్వాసం తమకు ఉందని’ ప్రకటించారు; ఆ విధంగా పార్టీ ఏడవ మహాసభను ఏర్పాటు చేయడానికి అవసరమైన రాజకీయ, సంస్థాగత సన్నాహాలు జరుగుతాయని ప్రకటించారు. ‘పార్టీ సెక్రటేరియట్, వారి మద్దతుదారులు అనుసరిస్తున్న విధానాలను వెనక్కు తీసుకోనేటట్టు వత్తిడి చేయాలని’ పార్టీ క్షేమాన్ని కోరేవారందరికీ విజ్ఞప్తి చేస్తూ ప్రకటనను ముగించారు. సెక్రటేరియట్ తన పంథాను

(మిగతా 35వ పేజీలో)



epaper.prajasakti.com

## ఈ సంచికలో...

1. తెనాలి సదస్సు -విప్లవ పార్టీ ఏర్పాటుకు సన్నాహాలు ....... 2

2. సామాజిక సమానత్వ సాధనలో రిజర్వేషన్ల అవసరం - పరిమితులు
బి.వి.రాఘవులు ..... 4

3. ప్రజాపునాది ఎందుకు చెదిరింది?
ఎస్.వీరయ్య ..... 7

4. వైవిధ్యాన్ని పెంపొందించిన అశోకుని పాలన
యం.వి.ఎస్.శర్మ ...... 10

5. మైనారిటీలపై దాడులను తీవ్రం చేసిన సంఘ్ పరివార్
ఎ.కోటిరెడ్డి ...... 13

6. ఎల్ఐసి ఐపిఓ భారీ కుంభకోణం
వి.శ్రీధర్ .....17

7. తీవ్రమౌతున్న సామాజిక వైరుధ్యాలు
బి.టి.రణదివె ...... 20

8. శత్రువుల ముట్టడిని ఎదుర్కొని సోషలిజం గెలుస్తుంది?
మిగుఎల్ డియజ్ కానెల్ ..... 26

9. బిజెపిని ఒంటరిపాటు చేసి ఓడించాలి
బి.వి.రాఘవులు. 32

సంపాదకుడు:
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం:
**పాటూరు రామయ్య**
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
ఫోన్: ఎడిటర్ : 94900 99333

ముద్రణ: ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org

# పోరాట సాధనం

"పెట్టుబడిదారీ వర్గంపై జరిపే పోరాటంలో కార్మికవర్గానికి ఉన్న ఏకైక ఆయుధం ట్రేడ్ యూనియన్" అని కామ్రేడ్ లెనిన్ అన్నారు. పెట్టుబడిదారీ సమాజాన్ని కూల్చి దాని స్థానంలో సోషలిస్టు సమాజాన్ని నిర్మించడం, అక్కడితో ఆగకుండా సంపూర్ణ మానవ వికాసానికి దారి తీసే వర్గ రహిత కమ్యూనిస్టు సమాజం వైపు సాగిపోవడం – ఇది కార్మిక వర్గం ముందు చరిత్ర ఉంచిన ప్రధాన కర్తవ్యం. సమస్త సంపదలనీ సృష్టించే శ్రామిక వర్గమే ఆ సంపద మీద సకల అధికారాలనూ కలిగివుంటుందని, ఆ అధికారాన్ని సాధించుకోవడం కోసం కార్మికవర్గం అవసరమైన రాజకీయ, సైద్ధాంతిక, నిర్మాణ సామర్థ్యాన్ని, దక్షతను సంతరించుకోవాల్సివుంటుందని మార్క్స్, ఎంగెల్స్ ఉద్బోధించారు. మానవజాతి చరిత్ర మొత్తం మీద చూసుకుంటే గతంలో ఎప్పటికన్నా ప్రస్తుత సమయంలో కార్మికవర్గం ఈ కర్తవ్య సాధన పట్ల దృష్టిని సారించాల్సిన అవసరం కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది. ఇందులో అన్నింటికన్నా అత్యంత ప్రధానమైనది కార్మికవర్గం తన పోరాట సాధనాన్ని, అంటే ట్రేడ్ యూనియన్‌ను– ఎప్పటికన్నా బలంగా, దృఢంగా నిర్మించుకోవడం. ఈ స్పృహ కలిగివున్నందునే లాటిన్ అమెరికా దేశాల్లో కార్మికవర్గం ఆయా దేశాల పరిణామాల్లో శక్తివంతంగా జోక్యం చేసుకోగలుగుతున్నది. అంతేగాక పలు చోట్ల రాజ్యాధికారంలో సైతం భాగస్వామిగా, ముఖ్య నాయకత్వ పాత్రలో సైతం నిలవగలుగుతోంది.

ప్రపంచ పెట్టుబడిదారీ విధానం మూడు దశాబ్దాల పైబడి విచక్షణా రహితంగా, అత్యంత అమానవీయంగా నయా ఉదారవాద విధానాలను అమలు చేసింది. ఇంకా ఆ విధానాలనే కొనసాగిస్తోంది. ఐతే ఆ విధానాలు పెట్టుబడిదారీ వ్యవస్థను మొత్తంగానే తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయి. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యం, అవిద్య, పేదరికం, అసమానతలు, పర్యావరణం, అన్నీ అదుపు తప్పిపోయి పెను సవాలుగా పరిణమించాయి. ఐనా కార్పొరేట్‌ల అత్యాశ ఫలితంగా ఇంకా ఆ వినాశకర ఉదారవాద విధానాలనే మరింత ఉధృతంగా కొనసాగిస్తున్నారు. పైగా సంక్షోభ భారాలను అంతకంతకూ శ్రామికవర్గం మీదకు నెట్టివేస్తున్నారు. కష్టజీవుల బతుకులను దుర్భరం చేస్తున్నారు.

ఈ అవ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిజమే తప్ప వేరొకటి కాదు. కాని ఈ వాస్తవాన్ని అంగీకరించడానికి పెట్టుబడిదారీవర్గం సిద్ధంగా లేదు. ఎప్పటికీ ఉండదు కూడా. అందుకే సమాజ మార్పును శాయశక్తులా ప్రతిఘటిస్తోంది. నూతన సమాజాన్ని నిర్మించగల కార్మికవర్గాన్ని ఆ వైపుగా ముందడుగు వేయనీయడం లేదు సరికదా పనిగట్టుకుని కార్మికవర్గాన్ని నిరాయుధం చేస్తోంది. అంటే ట్రేడ్‌యూనియన్లను శక్తిహీనంగా దిగజార్చడానికి అన్ని ప్రయత్నాలనూ చేస్తోంది. మనదేశంలో మోడీ ప్రభుత్వం కార్మికవర్గం మీద రుద్దిన లేబర్ కోడ్లు అందులో భాగమే.


మనదేశంలోని కార్మికవర్గంలో గత మూడు దశాబ్దాల కాలంలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. సంఘటిత కార్మికవర్గం పట్టుమని పది శాతం కూడా లేదు. అత్యధిక భాగం అసంఘటితంగానే ఉంది. అంతకన్నా ముఖ్యమైనది కార్మికవర్గంలో తాము సంఘటితం కావాలన్న కాంక్ష బలహీనం కావడం. వ్యక్తివాదం, వినిమయ తత్వం, రాజకీయ రాహిత్యం కార్మికవర్గాన్ని ఆవరించివున్నాయి. ఇది చాలదన్నట్టు హిందూత్వ–కార్పొరేట్ శక్తుల విద్వేష రాజకీయాలు కార్మికవర్గాన్ని ఒక వర్గంగా కాకుండా మతం, కులం, ప్రాంతం, జెండర్ ప్రాతిపతికల మీద చీలికలు, పేలికలు చేస్తున్నాయి. వలస కార్మికుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. గ్రామీణ కార్మికుల సంఖ్య కూడా పెరుగుతోంది. వారిలో అత్యధికులు అసంఘటితంగానే ఉన్నారు. కార్మికవర్గం అన్ని రకాలుగా పరాయీకరణకు లోనవుతోంది.

ఇవన్నీ మానవసమాజ విముక్తి ప్రదాత అయిన కార్మికవర్గం ముందు ఉన్న సవాళ్ళు. ఎన్ని సవాళ్ళు ఎదురైనా, ప్రస్తుతం ఎంత బలహీనంగా ఉన్నట్టు కనిపించినా, వాటన్నింటినీ అధిగమించి ముందుకు సాగిపోవాల్సిందే. సోషలిజాన్ని సాధించాల్సిందే. ప్రస్తుతానికి చాలా బలంగా ఉన్నట్టు కనిపించే పెట్టుబడిదారీ వర్గం రోజురోజుకూ అంతిమ దశకు చేరువౌతోందనేది చారిత్రిక సత్యం. అదే విధంగా ప్రస్తుతానికి ఎంత బలహీనంగా ఉన్నట్టు కనిపించినా, బలపడేదీ, పురోగమించగలిగేదీ, నూతన చరిత్రను ఆవిష్కరించగలిగేదీ కార్మికవర్గమే. అందుకే "సంఘం పెడదాము, సంగతేదో చూద్దాము" అంటూ చేయి చేయి కలిపి కార్మికులంతా ముందుకు కదలాలి. హిందూత్వ–కార్పొరేట్ కుట్రలను ఓడించాలి. 2022 మేడే నిర్దేశిస్తున్న కర్తవ్యం ఇది.



epaper.prajasakti.com

# సామాజిక సమానత్వ సాధనలో రిజర్వేషన్ల అవసరం - పరిమితులు



***సిపిఐ(ఎం) 23వ మహాసభలు ఏప్రిల్ 6 నుండి 10వ తేదీ వరకు కేరళలోని కన్నూర్‌లో జరిగిన సందర్భంగా మార్చి 20 తేదీన జరిగిన సదస్సులో “సామాజిక సమానత్వ సాధనలో రిజర్వేషన్ల అవసరం-పరిమితులు” అంశంపై పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు గారు చేసిన ప్రసంగాన్ని పాఠకులకు అందిస్తున్నాం-సంపాదకుడు.***

దేశంలోని వివిధ ప్రాంతాలలో రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలపై తరచుగా చర్చలు జరుగుతున్నాయి. వివిధరాష్ట్రాలలో తమకు సంబంధించిన డిమాండ్లపై ఆయా గ్రూపులు ఆందోళనలు చేస్తున్నాయి. వివిధ కులాలు, తరగతులలోకి హిందుత్వ భావజాలాన్ని చొప్పించటం, విభిన్నమైన సామాజిక తరగతుల మధ్య సమన్వయం సాధించి, తమ వ్యూహాన్ని ముందుకు తీసుకుపోవటం కోసం ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు ఈ అంశాలను నిరంతరం వినియోగించుకుంటున్నాయి మినహా బలహీన వర్గాలు, వెనుకబడిన తరగతులపై వారికి ఏ మాత్రం ప్రేమలేదు. ఇందుకు సంబంధించిన సమస్యలపై జోక్యం చేసుకొనేటపుడు న్యాయవ్యవస్థ కొత్త సమస్యలు, వివాదాలను సృష్టిస్తున్నది. మొత్తంగా చూసినపుడు నయా ఉదారవాద విధానాలను ప్రవేశపెట్టిన తర్వాత రిజర్వేషన్ల ఉపయోగం తగ్గిపోతుండగా, మరోవైపున రిజర్వేషన్లను మరింతగా పెంచాలని ఆందోళనలు పెరుగుతున్నాయి. రిజర్వేషన్లపై జరుగుతున్న ప్రచారంలోని అసంబద్ధతలను ఇవి వెల్లడిస్తున్నాయి.

## 1

దళితులు, గిరిజనులు, సమాజంలోని బలహీనవర్గాలకు సామాజిక సమానత్వాన్ని, సామాజిక న్యాయాన్ని అందించటం కోసం భారత రాజ్యాంగంలో అనేక నిబంధనలు పొందుపరిచారు. ఆర్టికల్స్ 330, 332, 243డి, 243టి రాజకీయ రిజర్వేషన్లు కల్పించాయి. ఆర్టికల్స్ 15(4), 16(4), 29(2), 335 విద్య, ఉద్యోగాలు, పదోన్నతులలో రిజర్వేషన్లు కల్పించాయి. ఆర్టికల్ 17 అంటరానితనాన్ని రద్దుచేసింది. ఆర్టికల్ 338 దళితులు, గిరిజనుల కోసం జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేయటానికి అవకాశం కల్పించింది. సామాజిక న్యాయాన్ని అందించటం కోసం రాజ్యాంగంలో పొందుపరిచిన స్ఫూర్తిని ముందుకు తీసుకుపోవటానికి 1989లో ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం చేశారు. 1975 తర్వాత ఎస్‌సి, ఎస్‌టిల కోసం బడ్జెట్‌లో సబ్‌ప్లాన్‌ను ప్రవేశపెట్టారు.

రాజ్యాంగంలో అనేక సానుకూలమైన నిబంధనలు ఉన్నప్పటికీ భారత పాలకవర్గాలకు రాజకీయ సంకల్పం లేకపోవటంతో బలహీనవర్గాలకు సామాజిక న్యాయం లక్ష్యసాధన సుదూరస్వప్నంగానే ఉన్నది. మతోన్మాద, మనువాద బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చటానికి రాజ్యాంగంపై బహిరంగంగా దాడులను ప్రారంభించింది. ఈ మతోన్మాదశక్తులు రిజర్వేషన్ల ప్రయోజనాలను దెబ్బతీయటానికి అనేకమైన కపటపు పద్ధతుల ద్వారా ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రయత్నాలను తిప్పికొట్టకపోతే రాజ్యాంగంలో బలహీనవర్గాలకు కల్పించిన రిజర్వేషన్ల ప్రయోజనాలను కోల్పోయే నిజమైన ప్రమాదం పొంచివున్నది. కొన్ని వివాదాస్పదమైన తీర్పులు ఇచ్చినప్పటికీ సాధారణంగా న్యాయవ్యవస్థ, ప్రత్యేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన వివిధ తీర్పులు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను కాపాడుకోవటానికి ఉపయోగపడ్డాయి.

## 2

### రిజర్వేషన్లపై సిపిఐ (ఎం) విధానం

పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలను కాపాడటం, ఆ సామాజిక సంబంధాల పరిధిలోనే అయినప్పటికీ చారిత్రకంగా, సామాజికంగా అత్యంత దుర్భరమైన అణచివేతకు గురైన తరగతులకు కనీసమైన ఉపశమనం కలిగించేవిగా రిజర్వేషన్లను సిపిఐ(ఎం) పరిగణిస్తున్నది. సాంప్రదాయకమైన కుల పునాదులను నడలించటానికి, వివిధవర్గాల సామాజిక పునాదిని వైవిధ్యభరితం చేయటానికి, దిగువకులాలకు చెందినవారిలో కొద్దిమంది అయినా ఉన్నతవర్గాలలో చేరటానికి దోహదం చేస్తున్న ప్రజాస్వామిక మూలాలు ఉన్నవిగా రిజర్వేషన్లను సిపిఐ(ఎం) చూస్తున్నది. అందువలననే విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఎస్‌సి, ఎస్‌టి, ఇతర బలహీనవర్గాలకు తాత్కాలికంగా ఉపశమనం కలిగిస్తాయని భావిస్తూ సిపిఐ(ఎం) వాటిని బలపరుస్తున్నది. అదే సమయంలో సామాజిక సమానత్వం సాధించటంలో మౌలిక పరిష్కారంగా సమూలమైన భూసంస్కరణలను అమలు చేయటం, సంపద కేంద్రీకరణను బద్దలు చేయటం, సమ్మిళిత ఆర్థికాభివృద్ధి సాధించటం చేయాలని డిమాండ్ చేస్తున్నది. సమర్థత, సమానత్వం, మానవ వనరులను



epaper.prajasakti.com

సమర్ధవంతంగా వినియోగించుకోవటం పేరుతో రిజర్వేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది.

నిజమైన సామాజిక వెనుకబాటుతనం ప్రాతిపదికగా రిజర్వేషన్ల కోసం చేస్తున్న డిమాండ్లనన్నింటినీ సిపిఐ(ఎం) బలపరుస్తున్నది. ఇప్పటివరకు రిజర్వేషన్లను అమలుచేయని ప్రభుత్వ విభాగాలు, రంగాలలో రిజర్వేషన్లను అమలు చేయాలనే డిమాండ్లను బలపరుస్తున్నది. ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌కు మద్దతిస్తున్నది. పదోన్నతులలో రిజర్వేషన్లు అమలుచేయాలని, రిజర్వేషన్లను అమలుచేయటంలోని అసమానతలను సరిచేయటం కోసం చేస్తున్న డిమాండ్లను బలపరుస్తున్నది. రిజర్వేషన్ల ఫలితాలను పొందటంలో ఆ సామాజిక విభాగంలోని కులాల మధ్య అసమానతలు స్పష్టంగా కనిపిస్తున్నపుడు వర్గీకరణ డిమాండ్‌ను బలపరుస్తున్నది. ఇతర వెనుకబడిన తరగతులలో రిజర్వేషన్లు పొందుతున్న కులాల మధ్య గణనీయమైన వ్యత్యాసాలు వ్యక్తమౌతున్నపుడు, నిజంగా రిజర్వేషన్లు అవసరమైన కులాలలోని వారు వాటిని పొందటం కోసం ఆర్థిక పరిమితులు విధించటం ద్వారా క్రీమీలేయర్ విధానాన్ని అమలు చేయాలన్న డిమాండ్‌ను బలపరుస్తున్నది. అదే సమయంలో ఎస్‌సి, ఎస్‌టిలలో గమనించదగినంతగా ఆర్థిక వ్యత్యాసాలు చోటు చేసుకోకపోవటం వలన వారికి కల్పించిన రిజర్వేషన్లకు ఆర్థిక పరిమితిని నిర్ణయించి, క్రీమీలేయర్ విధానాన్ని ప్రవేశపెట్టాలన్న డిమాండ్‌కు మద్దతివ్వటం లేదు.

ఉన్నత, ఆధిపత్య కులాలకు కుల ప్రాతిపదికపై రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌ను సిపిఐ(ఎం) వ్యతిరేకిస్తున్నది. అదే సమయంలో సామాజిక వెనుకబాటు ప్రాతిపదిక కానప్పటికీ ఉన్నత, ఆధిపత్య కులాలలో ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌ను ఒక మినహాయింపుగా బలపరుస్తున్నది. రిజర్వేషన్లు పొందని కులాలలోని పేదలలో రిజర్వేషన్ల పట్ల ఉన్న వ్యతిరేకతను తగ్గించటం ద్వారా వర్గ ఐక్యతను పరిరక్షించటానికి ఈ చర్య దోహదం చేస్తుంది కాబట్టి ఇందుకు మద్దతిస్తున్నది. పూర్తి సామాజిక న్యాయాన్ని సాధించటంలో రిజర్వేషన్లకు తీవ్రమైన

> **"నిజమైన సామాజిక వెనుకబాటుతనం ప్రాతిపదికగా రిజర్వేషన్ల కోసం చేస్తున్న డిమాండ్లనన్నింటినీ సిపిఐ(ఎం) బలపరుస్తున్నది. ఇప్పటివరకు రిజర్వేషన్లను అమలుచేయని ప్రభుత్వ విభాగాలు, రంగాలలో రిజర్వేషన్లను అమలు చేయాలనే డిమాండ్లను బలపరుస్తున్నది. ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌కు మద్దతిస్తున్నది. పదోన్నతులలో రిజర్వేషన్లు అమలుచేయాలని, రిజర్వేషన్లను అమలుచేయటంలోని అసమానతలను సరిచేయటం కోసం చేస్తున్న డిమాండ్లను బలపరుస్తున్నది."**

పరిమితులు ఉన్నప్పటికీ, సామాజిక సమానత్వాన్ని సాధించేవరకు ఎటువంటి కాల పరిమితి లేకుండా రిజర్వేషన్లను కొనసాగించాలని సిపిఐ (ఎం) బలంగా విశ్వసిస్తున్నది.

### 3

### రిజర్వేషన్లు అమలుచేయటం వలన వచ్చిన ఫలితాలు

స్వాతంత్ర్యానంతరం గత ఏడు దశాబ్దాలలో రిజర్వేషన్లను అమలుచేయటం వలన వచ్చిన అనుభవాలు, ఫలితాలు ఈ దిగువ విధంగా ఉన్నాయి.

1) సామాజికంగా వెనుకబడిన కులాలలో విద్య విస్తరించటానికి రిజర్వేషన్లు దోహదం చేశాయి. ఈ కులాలలోని వారు ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలలో ఉద్యోగాలు పొందటం, రాజకీయ రిజర్వేషన్ల ద్వారా చట్టసభలలోని స్థానాలకు ఎన్నికవటం ద్వారా సామాజికంగా పైస్థాయికి చేరటానికి తోడ్పడ్డాయి.

2) సమాజంలో వెనుకబడిన తరగతులలో అవసరమైన వారందరూ రిజర్వేషన్ల వలన ప్రయోజనం పొందలేదు. వారిలో అత్యంత తక్కువమంది మాత్రమే మధ్య తరగతిలో చేరారు. సామాజికంగా వెనుకబడిన ఈ తరగతులలోని అత్యధికులు తమ నిత్య జీవితంలో దరిద్రం, నిరక్షరాస్యత, అనారోగ్యం, నిరుద్యోగం, అణచివేత, వివక్షలను ఎదుర్కొంటున్నారు. అస్తిత్వవాద రాజకీయాలను బలపరిచేవారు ప్రచారం చేస్తున్నట్లుగా రిజర్వేషన్లు సామాజిక సమానత్వాన్ని సాధించటానికి దోహదం చేయకపోగా, కొద్దిమంది సామాజికంగా తమ స్థానాన్ని మెరుగుచేసుకోవటానికి మాత్రమే దోహదం చేశాయి.

3) నయా ఉదారవాద ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టిన తర్వాత రిజర్వేషన్ల పరిమిత ప్రయోజనాలు కూడా క్రమంగా క్షీణించిపోతున్నాయి. ప్రైవేటీకరణ, ప్రభుత్వరంగ సంస్థలను రద్దు చేయటం, ఉద్యోగాల కాంట్రాక్టీకరణ, యాంత్రీకరణ వలన ఉద్యోగాలు రాని అభివృద్ధి జరుగుతున్నది. విద్యారంగాన్ని వాణిజ్యీకరించటం వలన ప్రభుత్వరంగంలో విద్య, ఉద్యోగాలకు అవకాశాలు తగ్గిపోతున్నాయి. అందువలన రోజురోజుకూ రిజర్వేషన్లకు ఉన్న అవకాశాలు తగ్గిపోతున్నాయి.

4) రిజర్వేషన్లకు అవకాశాలు తగ్గిపోవటాన్ని భర్తీ చేయటం కోసం ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు కల్పించాలని సామాజిక ఉద్యమాలు డిమాండ్ చేస్తున్నాయి. సిపిఐ(ఎం) ఈ డిమాండ్‌ను బలపరుస్తున్నది. కాని ప్రైవేటురంగం దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది.

5) రిజర్వేషన్ల ద్వారా ప్రయోజనం పొందటానికి అవకాశాలు తగ్గిపోతుండటంతో ఉన్నవాటి నుండి తాము ఎక్కువ ప్రయోజనం పొందటం కోసం బలహీనవర్గాలలోని వివిధ తరగతుల మధ్య పోటీ పెరుగుతున్నది. ఫలితంగా ఉన్న కొద్దిపాటి అవకాశాలను దక్కించుకోవటం కోసం వివిధ తరగతుల మధ్య వైషమ్యాలు, ఘర్షణలు పెరుగుతున్నాయి. దీనితో కొత్త తరగతులు రిజర్వేషన్ల కోసం డిమాండ్ చేయటం పెరగటంతో పాటు, ఉన్న రిజర్వేషన్లను సమానంగా అందించటం కోసం ఉన్న కోటాలను పునర్నిర్ణయించాలన్న డిమాండ్‌లు కూడా పెరుగుతున్నాయి.


epaper.prajasakti.com

"ఇప్పటి వరకు ఆ వర్గాలలో స్థానం లేని సామాజిక తరగతులకు చెందిన వారు కూడా చేరటంతో ఒకే సామాజిక తరగతికి చెందినవారితో ఉన్న వర్గాలు కూడా సామాజికంగా భిన్న తరగతులకు చెందిన వారితో కూడిన వర్గాలుగా మార్పుచెందాయి. పరస్పర విరుద్ధమైన ఈ క్రమం పెట్టుబడిదారీ వ్యవస్థకు అనుగుణంగా కులవ్యవస్థను మార్చటానికి, తద్వారా ఈ సామాజిక తరగతులపై పాలకవర్గాల పట్టు మరింతగా పెరగటానికి దారితీస్తున్నది."



రిజర్వేషన్ల ఫలితంగానే ఎస్సీ ఎస్టీ లకు పార్లమెంటులోప్రాతినిధ్యం ఉంటున్నది

6) అందువలన రిజర్వేషన్లకు సంబంధించిన ఈ డిమాండ్ల ప్రాతిపదికగా ఆందోళనలు, ఉద్యమాలు విస్తరిస్తున్నాయి. ఈ ఆందోళనలలో సమీకరణలకు కులం, సామాజిక గుర్తింపు ప్రధానాంశాలుగా ముందుకు వస్తున్నాయి.

7) రిజర్వేషన్ల వలన ప్రయోజనం పొందిన విద్యావంతులైన మధ్య తరగతి తమ తరగతులకు చెందిన ప్రజలను పైకి తీసుకురావటం కోసం పనిచేయటానికి బదులుగా తమ స్వప్రయోజనాలు, వ్యక్తిగత అభివృద్ధికి తపన పడుతున్నారు. వారికి అస్తిత్వవాద రాజకీయాలు బాగా ఉపయోగపడుతున్నాయి. అందువలన వారు నిర్మిస్తున్న సంస్థలను వారి రాజకీయ, సామాజిక అభివృద్ధి కోసం మెట్లుగా ఉపయోగించుకుంటూ, వారి రాజకీయాలను పాలకవర్గాలతో బేరసారాలకు పరిమితం చేస్తున్నారు. ఫలితంగా ఈ సామాజిక తరగతులలోని చిన్నగ్రూపును పాలకవర్గాలలో భాగస్వాములుగా చేసుకోవటానికి, తద్వారా అణచివేతకు గురవుతున్న ఈ తరగతులలో పాలకవర్గాల పలుకుబడిని పెంచుకోవటానికి దోహదం చేస్తున్నారు.

8) రిజర్వేషన్లకు ఉన్న సహజమైన పరిమితుల వలన సామాజిక సమానత్వం, సామాజిక న్యాయాన్ని సాధించటానికి అవి ద్రోహదం చేయనప్పటికీ, రిజర్వేషన్ల ద్వారా ఈ వ్యవస్థ పరిధిలోనే బలహీనవర్గాలు క్రమంగా తమ సామాజిక అసమానతలను అధిగమించటం సాధ్యమౌతుందన్న తప్పుడు నమ్మకాన్ని ఈ తరగతులలో కల్పించటంలో భారత పాలకవర్గాలు జయప్రదమైనాయి. ఈ భ్రమలను ఆసరాగా చేసుకుని బలహీనవర్గాల ప్రజలకు విద్య, వైద్యం, ఉద్యోగాలు, భూమి, ఇతర ఆస్తులు కల్పించాల్సిన మౌలిక బాధ్యత నుండి రాజ్యం తప్పుకున్నది.

**4**

స్వతంత్ర భారతదేశంలో సామాజిక న్యాయం పేరుతో భారత పాలకవర్గాలు అమలుచేసిన రిజర్వేషన్లు, ఇతర విధానాలు కులవ్యవస్థలో పరస్పర విరుద్ధమైన పరిణామాలు చోటు చేసుకోవటానికి దారితీశాయి. ఈ విధానాలు ఒకవైపున కులవ్యవస్థకు ఉన్న సాంప్రదాయక పునాదిని బలహీనపరుస్తూ, మరోవైపున అస్తిత్వం పునాదిగా అది బలపడటానికి దారితీస్తున్నాయి. కులాలు, సామాజిక తరగతులలో సాపేక్షంగా ఒకేస్థితిలో ఉన్న ప్రజలలో వర్గ విభజన, అసమానతలకు అవి కారణమైనాయి. ఒకవైపున కులంలో ఒకే విధమైన పరిస్థితులలో ఉన్నవారి మధ్య సాంప్రదాయకంగా ఉన్న ఐక్యతను బలహీనపర్చటానికి ఇది దోహదం చేయగా, మరోవైపున ఈ విధానాల వలన కులంలో అభివృద్ధి అయిన కొద్దిమంది పై వర్గం వారి పట్టు ఆ కులంపై బిగియటానికి దోహదం చేస్తున్నది.

ఇప్పటి వరకు ఆ వర్గాలలో స్థానం లేని సామాజిక తరగతులకు చెందిన వారు కూడా చేరటంతో ఒకే సామాజిక తరగతికి చెందినవారితో ఉన్న వర్గాలు కూడా సామాజికంగా భిన్న తరగతులకు చెందిన వారితో కూడిన వర్గాలుగా మార్పుచెందాయి. పరస్పర విరుద్ధమైన ఈ క్రమం పెట్టుబడిదారీ వ్యవస్థకు అనుగుణంగా కులవ్యవస్థను మార్చటానికి, తద్వారా ఈ సామాజిక తరగతులపై పాలకవర్గాల పట్టు మరింతగా పెరగటానికి దారితీస్తున్నది. అందువలన ప్రస్తుతం కులవ్యవస్థను రూపుమాపటం కోసం జరుగుతున్న పోరాటాలు పెట్టుబడిదారీ విధానాన్ని అంతం చేయటం కోసం జరుగుతున్న పోరాటాలతో మిళితమౌతున్నాయి.

మొత్తంగా చూసినపుడు అణచివేతకు గురవుతున్న తరగతులకు రిజర్వేషన్ల వలన వాస్తవంగా కలుగుతున్న ప్రయోజనం కన్నా వారికి ఎక్కువ ఉద్వేగం కలిగిస్తూ, ఉద్యమోన్ముఖులను చేస్తున్నాయి. పెట్టుబడిదారీ విధానాన్ని రక్షించటం, కొనసాగించటానికి అతి ముఖ్యమైన, శాంతియుతమైన ఆయుధంగా రిజర్వేషన్లు పాలకవర్గాలకు ఉపయోగపడుతున్నాయి. పరస్పర విరుద్ధమైన ఈ ధోరణులు వర్గ ఐక్యతను నిర్మించేక్రమంలో విప్లవోద్యమం ముందుకు అనేక జటిలమైన సమస్యలను తీసుకొస్తున్నాయి.

అనువాదం: ఎ కోటిరెడ్డి


epaper.prajasakti.com

# ప్రజాపునాది ఎందుకు చెదిరింది?

**ఎస్.వీరయ్య**



రచయిత సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

ప్రజా పునాది తరిగిపోతున్నది. మనందరినీ ఆందోళనకు గురిచేస్తున్న విషయమిది. గత మహాసభ తర్వాత కూడా పునాది చెదిరిందని కన్నూరులో జరిగిన పార్టీ అఖిల భారత మహాసభ గుర్తించింది. ప్రజాపునాది అంటే ఏమిటన్న ప్రశ్న ఇక్కడ ఉదయిస్తున్నది. సాధారణంగా ప్రజల సమీకరణ శక్తి, ప్రజా సంఘాల సభ్యత్వం, పార్టీ సభ్యత్వం, నిధుల సమీకరణ శక్తి, పార్టీ పత్రికల సర్క్యులేషన్, పార్టీకి పడుతున్న ఓట్లను బట్టి ప్రజా పునాది గురించి అంచనాకు వస్తున్నారు. ఈ ఆరు అంశాల్లో బలపడితే ప్రజా పునాది బలపడుతుందని భావిస్తున్నాం. అనేక సందర్భాల్లో ఓట్లే ప్రజా పునాదికి ప్రాతిపదికగా చూస్తున్నాం. ఆ విషయం పక్కన బెడితే, ఈ అంశాలన్నీ బలంగా ఉన్న చోట కూడా ఆ బలం కరిగింది. కారణం ఏమిటి? రెండు రకాల పరిస్థితులు పరిశీలించవచ్చు. ఆ ప్రాంతంలోని ప్రజల సమస్యల మీద పనిచేస్తున్న తీరు, ప్రజలతో సజీవ సంబంధాలు ఉన్నాయా? లేదా? అన్నది మొదటిది. పార్టీ అనుసరిస్తున్న రాజకీయ విధానం, పార్టీ నాయకులు, కార్యకర్తల పని విధానం రెండవది.

ప్రజలంటే... అన్ని వర్గాల ప్రజలు కాదు కదా! మనది కార్మికవర్గ పార్టీ. వర్గ సమాజంలో సహజంగానే కార్మికవర్గం కోసమే పనిచేస్తాం. ప్రజలంటే మన దృష్టిలో శ్రామికులు. శ్రామికుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీకి క్షేత్రస్థాయిలో వర్గ శత్రువులుంటారు. వారి ప్రయోజనం కోసం నిలబడే రాజకీయ శత్రువులుంటారు. మనం పనిచేస్తున్న గ్రామాల్లో, బస్తీల్లో ఇలాంటి శత్రుపూరిత వాతావరణం ఉన్నదా? నిరంతరం ఘర్షణ వాతావరణం ఉన్నదా? లేదు కదా! అన్ని పార్టీల నాయకులూ మన పట్ల గౌరవ భావంతో ఉంటున్నారు. స్నేహపూరితంగానే మసలుకుంటున్నారు. ఎట్లా సాధ్యం! మెజారిటీ శ్రామికులు బూర్జువా పార్టీల వెనుకనే ఉన్నారు. వారిని మనవైపు ఆకర్షించకుండా మన బలం పెరగదు. బూర్జువా పార్టీలను బలహీనపరచడం ద్వారా మాత్రమే మనం బలపడతాం. వారిని బలహీనపరిచే కృషి మనం చేస్తున్నామా? ఆ ప్రయత్నం చేస్తే, వారు మనలను మిత్రులుగా చూడజాలరు. మన పట్ల శత్రుపూరితంగానే వ్యవహరిస్తారు. ఇందుకు భిన్నంగా... మన వెనుకనున్న శ్రామిక ప్రజలను బూర్జువా పార్టీలు తమవైపు ఆకర్షిస్తున్నాయి. మన ప్రజాపునాది తరిగిపోవడం అంటే అదే కదా! అంటే ... క్షేత్రస్థాయిలో వర్గ పోరాటం ఏ మేరకు చేస్తున్నామో పరిశీలించుకోవాల్సిన సమయమిది. గ్రామం లేదా బస్తీల్లో కాంట్రాక్టర్లు, వ్యాపారులు, ధనిక వర్గాల పట్ల పోరాట స్ఫూర్తి ఎందుకు మందగించిందో పరిశీలించాలి. మన రోజువారీ పని, వర్గశత్రువుకు ఏమాత్రం నొప్పి కలిగించడం లేదంటేనే మన పని గురించి మనం పరిశీలించుకోవాలి. లోపం ఎక్కడున్నదో గుర్తించాలి.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తర్వాత, తెలుగుదేశం ఆవిర్భావం వరకు గమనిస్తే మన ప్రజా పునాది స్థూలంగా నిలబెట్టుకోగలిగాం. రైతాంగ సాయుధ పోరాటం, స్వాతంత్ర్యోద్యమం, జమీందారీ వ్యతిరేక పోరాటాల ఫలితంగా ఏర్పడిన ప్రజాపునాదిని కాపాడుకోగలిగాం. ఆ తర్వాత కొత్త పరీక్షలు ఎదుర్కొన్నాం. క్రమంగా కరుగుతున్నాం. ఇందుకు అనేక కారణాలున్నాయి. సోషలిజానికి ఎదురుదెబ్బలు, సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రజలతో ఉన్న సంబంధాలు, ప్రజా సమస్యలపైన కృషి, రాజకీయ, సైద్ధాంతిక వైఖరులు తదితర అనేక అంశాలుండవచ్చు. ప్రజలతో సంబంధాలు, రాజకీయ విధానం ప్రభావం, పని విధానం గురించి మాత్రమే ప్రస్తుతం పరిమితమవుదాం. 80వ దశాబ్దం చివరిదాకా స్థానికంగా వర్గ సంఘర్షణలున్నాయి. ప్రజల ప్రయోజనాల కోసం రాజీలేని పోరాటం సాగింది. అందుకే స్థానికంగా తమ దోపిడీకి ఆటంకాలు తొలగించుకోవడానికీ, రాజకీయంగా ఆధిపత్యం నిలబెట్టుకోవడానికీ నిరంతరం వర్గ శత్రువులు మన మీద దాడులు, దౌర్జన్యాలు చేశారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను హత్య చేశారు. ప్రజల అండతోనే ఈ దాడులను పార్టీ ఎదుర్కొన్నది. కమ్యూనిస్టులకూ, బూర్జువా పార్టీలకు మధ్య స్పష్టమైన విభజన రేఖ ఉన్నది. పండుగల సందర్భంగానూ, జాతర్లలో కూడా ఈ తేడాలు స్పష్టంగా కనిపించేవి. ఆ గీత చెదిరింది. ఇప్పుడు, వారు వీరయ్యారా? లేక వీరు వారయ్యారా? అన్నదే ప్రశ్న. ఇక్కడ ఏమాత్రం గందరగోళం లేదు. మన పునాది చెదిరిందన్నది స్పష్టమే! కారణం ఏమిటి?

గ్రామంలో, బస్తీలో వర్గ శత్రువులే మిత్రులయ్యారు. కాంట్రాక్టర్లు, ధనిక రైతులు, వ్యాపారులు, యజమానులు కమ్యూనిస్టులతో కలిసి తిరగడం మొదలైంది. ఈ నూతన ధనికవర్గం తెలుగుదేశం పార్టీలో నాయకులు, ప్రజా ప్రతినిధులయ్యారు. ఆ పార్టీతో ఎన్నికల సర్దుబాట్లు దీర్ఘకాలమే సాగాయి. పేద ప్రజలు తమ శత్రువులుగా భావిస్తున్న నయా


epaper.prajasakti.com

"ఇవన్నీ నిరంతరం చేసినప్పుడు ప్రజలను సమీకరించగల శక్తి పెరుగుతుంది. ప్రజాసంఘాల సభ్యత్వం పెరుగుతుంది. పార్టీ చైతన్యంతో పనిచేస్తే, చురుకుగా పనిచేస్తున్న వారిని గుర్తించి ఆగ్జిలరీ గ్రూపుల్లో పెట్టి రాజకీయ, సైద్ధాంతిక తర్ఫీదునిస్తే పార్టీ సభ్యత్వం, పత్రికల సర్క్యులేషన్ కూడా పెరుగుతుంది. సహజంగానే విరాళాలు ఇచ్చే వారి సంఖ్య పెరుగుతుంది. వనరుల సమస్య ఉండదు."

ధనికవర్గమే క్షేత్రస్థాయిలో రాజకీయ మిత్రులయ్యారు. అది కూడా సుదీర్ఘకాలం... సమస్యల ప్రాతిపదికన ఐక్య కార్యాచరణ కాదు, దీర్ఘకాలిక రాజకీయ స్నేహంగానే అవతరించింది. స్థానికంగా వర్గ సంఘర్షణ పదును తగ్గింది. ఇప్పుడు కూడా నిరంతరం పనిచేస్తూనే ఉన్నాం. నిర్విరామంగా కృషి చేస్తున్నాం. కానీ విశాల శ్రామిక ప్రజానీకాన్ని ప్రభావితం చేయగలుగుతున్నామా? ప్రజలు కదిలే సమస్యల మీద పరిష్కారం అయ్యేవరకు పోరాడుతున్నామా? ప్రస్తుతం ఆందోళనా, పోరాటాలు అనటం కంటే, కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని భావించవచ్చు. మీడియా కూడా పట్టించుకోదు. ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పోస్టు చేసి సంతృప్తి చెందడమే ఇప్పుడు జరుగుతున్నది. ప్రజలను ప్రభావితం చేయలేనప్పుడు, కదిలించలేనప్పుడు, ప్రజాపునాది బలోపేతం కాదుకదా! కార్యకర్తలే 20-30 మంది గుమిగూడి, నినాదాలిచ్చి, ప్లకార్డులు, ఎర్రజెండాలు, బ్యానర్లు ప్రదర్శించి అరగంటలో ముగిస్తున్నాం. ఉపన్యాసాలిచ్చే నాయకులు ఎక్కువమంది ఉంటే, ఆ మేరకు పొడిగిస్తున్నాం.

మన కార్యకర్తలు కొన్ని విషయాలు పరిశీలించుకోవాలి. ఒకసారి కలిసిన వారిని మళ్ళీ కలుస్తున్నామా? వారితో నిరంతర సంబంధాలు కొనసాగిస్తున్నామా? ఒక బస్తీలో, గ్రామంలో ఎన్ని కుటుంబాల్లో వారిని పేర్లు పెట్టి, వరుసతో పలుకరించగలుగుతున్నామో పరిశీలించాలి. ఎంతమంది మన కార్యకర్తలను గుర్తుపట్టి తమ ఇంట్లోకి ఆహ్వానించి, పేరుపెట్టి సంబోధిస్తూ చనువుగా మాట్లాడుతున్నారో గమనించాలి. జనం ఇంట్లో ఉన్నప్పుడు మనం కూడా ఇంట్లోనే ఉంటున్నామా లేక జనంలో ఉంటున్నామా అన్నది చిన్న విషయంగానే కనిపించవచ్చు. కానీ అదే ముఖ్యమైంది. జనం నిద్రలేచి పొద్దున్నే 8 లేదా 9 గంటల్లోగా ఇంటి పనులన్నీ ముగించుకుని పనికి వెళ్ళిపోతున్నారు. మనం కూడా పొద్దున 9 గంటల తర్వాతనే బయటకు వస్తున్నాం. ఆ సమయానికి ఇండ్లల్లో మిగిలేది పిల్లలూ, వృద్ధులే కదా! మనం ఏ ప్రజలల్లో పనిచేస్తున్నట్టు? ప్రజలతో నిత్య సంబంధాలున్నాయని చెప్పగలిగే వారు పరిమితమే. ఒక కుటుంబానికి ఎదురయ్యే సమస్యలన్నింటిమీద పనిచేస్తున్నామో లేదో కూడా పరిశీలించాలి. భార్యాభర్తలు చెరో వృత్తిలో ఉండవచ్చు. వారి పని స్థలంలో సమస్యలు, వారి నివాస ప్రాంతంలో ఉన్న సమస్యలు, శాంతి భద్రతల సమస్యలు, గృహ హింస, వివక్షా సమస్యలు, ఆ ఇంట్లో విద్యార్థినీ విద్యార్థుల సమస్యలు, నిరుద్యోగుల సమస్యలు... ఇట్లా ఒక కుటుంబం చుట్టూ అనేక సమస్యలుంటాయి. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటున్నామా? పరిష్కారమయ్యే వరకు కృషి చేస్తున్నామా? ప్రజలు కదిలే సమస్యల మీద, పరిష్కారమయ్యే వరకు పోరాడనప్పుడు ప్రజలు మనలను అంటిపెట్టుకుని ఉండాల్సిన అవసరం లేదు కదా! వారి కోసం సర్వశక్తులూ ఒడ్డి పనిచేస్తున్నామన్న విశ్వాసం వారికి కలగాలి. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పౌర సమస్యలకు రాజకీయ విధానాలకు మధ్య ఉన్న సంబంధం మన కార్యకర్తలు ఏ మేరకు అర్థం చేసుకుంటున్నారో పరిశీలించుకోవాలి. మనకే స్పష్టత లేనప్పుడు ప్రజలకు అర్థమయ్యేట్టు చెప్పడం సాధ్యం కాదు.

ఇవన్నీ నిరంతరం చేసినప్పుడు ప్రజలను సమీకరించగల శక్తి పెరుగుతుంది. ప్రజాసంఘాల సభ్యత్వం పెరుగుతుంది. పార్టీ చైతన్యంతో పనిచేస్తే, చురుకుగా పనిచేస్తున్న వారిని గుర్తించి ఆగ్జిలరీ గ్రూపుల్లో పెట్టి రాజకీయ, సైద్ధాంతిక తర్ఫీదునిస్తే పార్టీ సభ్యత్వం, పత్రికల సర్క్యులేషన్ కూడా పెరుగుతుంది. సహజంగానే విరాళాలు ఇచ్చే వారి సంఖ్య పెరుగుతుంది. వనరుల సమస్య ఉండదు. కానీ గత నాలుగు దశాబ్దాల కాలంలో కొత్తగా ఏర్పడిన ప్రజాపునాది అరుదు. ప్రధానంగా ఉన్న పునాది చెదిరింది. మొదట ఎన్నికల ఫలితాలు బాగానే వచ్చాయి. వాటిని చూసి పునాది పెరిగిందని కూడా అనుకున్నాం. ఉన్న పునాది కూడా ఎందుకు చెదిరింది? అనేక పోరాటాలు చేసిన తర్వాత కూడా కొత్తగా పునాది ఎందుకు బలపడలేదో పరిశీలించాలి. ఇక్కడే రాజకీయ, సైద్ధాంతిక వైఖరుల ప్రభావం ముందుకొస్తుంది.

భూస్వాములు, ధనిక రైతులు, కాంట్రాక్టర్లు, బడాపెట్టుబడిదార్లు, తదితర ధనిక వర్గాల ప్రయోజనాలను కాపాడేందుకు కాంగ్రెస్ పనిచేసింది. శ్రామికవర్గ ప్రయోజనాల కోసం కమ్యూనిస్టులు క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీతో తలపడవలసి వచ్చింది. అనేక త్యాగాలు చేయాల్సి వచ్చింది. అలాంటి కాంగ్రెస్‌ను ఓడించే లక్ష్యంతో తెలుగుదేశంతో ఎన్నికల సర్దుబాట్లు చేసుకున్నాం. కానీ అది సర్దుబాట్లకు పరిమితం కాలేదు. ప్రజల దృష్టిలో ఇది దీర్ఘకాలిక రాజకీయ స్నేహంగా పరిగణించే విధంగానే సాగింది. మీడియా మిత్రపక్షాలు అని పేరు పెట్టింది. దానినే ప్రజలు నమ్మేటంతగా సన్నిహిత సంబంధాలు నడిచాయి. ఈ క్రమంలోనే చంద్రబాబు ప్రభుత్వం ప్రపంచబ్యాంకు విధానాలు అమలు చేసింది. వీటికి వ్యతిరేకంతగా సుదీర్ఘ పోరాటం చేశాం. విద్యుత్ ఉద్యమంతో అది పరాకాష్టకు చేరింది. ప్రపంచబ్యాంకు విధానాలు అమలు చేస్తున్న టీడీపీని ఓడించాలనే పేరుతో కాంగ్రెస్‌తో ఎన్నికల సర్దుబాట్లు చేసుకున్నాం. ఇది ప్రజల్లో మన పట్ల విశ్వసనీయతను దెబ్బకొట్టింది. కాంగ్రెస్ గెలిచింది. రాజశేఖర్‌రెడ్డి పాలనలో ఆరు మాసాలకు పైగా భూపోరాటం సాగింది. ముదిగొండ కాల్పులతో పరాకాష్టకు చేరింది. ఈ ప్రభుత్వాన్ని గద్దెదించే లక్ష్యంతో విద్యుత్ ఉద్యమకారులపై కాల్పులు జరిపిన టీడీపీతో తర్వాత ఎన్నికల్లో మళ్ళీ సర్దుబాట్లు చేసుకున్నాం. తర్వాత భద్రాచలంలో శాసనసభా ఎన్నికల ఫలితం కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వైసీపీతో సర్దుబాటు చేసుకున్నాం. ఈ పరిణామాలన్నీ కమ్యూనిస్టులకూ, బూర్జువా పార్టీలకు మధ్య విభజన రేఖను తుడిచి వేశాయి. సరళీకృత



epaper.prajasakti.com

ఆర్థిక విధానాల మీద పోరాట పదును తగ్గడానికి దారితీసింది. ప్రపంచబ్యాంకు విధానాలను అమలు చేస్తున్న టీడీపీని గద్దెదించేందుకు, దేశంలో ఆ విధానాలు ప్రవేశపెట్టి, దేశమంతా అమలు జరిపిన కాంగ్రెస్‌తోనే జతకట్టడం ప్రజల్లో విశ్వసనీయతను నీరుగార్చింది. ఈ గందరగోళ వాతావరణంలోనే మతోన్మాద శక్తులు, ముఖ్యంగా తెలంగాణలో కొంత మేరకు పుంజుకున్నాయి.

**"ఈ పరిస్థితుల్లో ప్రజాపునాది అంటే కేవలం ఎన్నికల సంబంధం మాత్రమే కాదు. ప్రజలతో నిరంతర సంబంధాలుండాలి. వారితో మమేకం కావాలి. వారి సమస్యల పరిష్కారం కోసం చివరిదాకా ప్రయత్నించాలి. ప్రజలు కదిలితే అటో ఇటో తేలేదాకా పోరాడాలి. వీటిని మించి సరైన రాజకీయ, సైద్ధాంతిక విధానం అనుసరించాలి. వర్గ దృక్పథంతో పనిచేయాలి. ఎన్నికల ప్రయోజనాల కోసం కక్కుర్తి ప్రదర్శించకుండా పనిచేయగలిగినప్పుడే కమ్యూనిస్టు ఉద్యమ వారసత్వాన్ని నిలబెట్టగల్గుతాం."**



విశాఖలో సిపిఐ(ఎం) 21వ మహాసభల సందర్భంగా జరిగిన సభ

విశాఖలో జరిగిన పార్టీ 21వ మహాసభ ఈ సమస్యను పరిష్కరించింది. ఏ పార్టీ అధికారంలో ఉన్నదన్న విషయంతో నిమిత్తం లేదు. సరళీకృత ఆర్థిక విధానాల మీద, ప్రజల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేయాలన్నది. మతోన్మాద శక్తుల మీద పోరాడాలనీ, ఒంటరిచేసి ఓడించాలనీ పిలుపునిచ్చింది. తర్వాత తెలంగాణలో సామాజిక సమస్యల మీద తప్పటడుగులు వేసిన కాలమది. తర్వాత కరోనా మహమ్మారి వ్యాపించిన కాలం. గత మూడు దశాబ్దాల కాలంలో ఎన్నికల ఖర్చు, ప్రచార పద్ధతుల్లో కూడా అనేక మార్పులు సంభవించాయి. గతంలో ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం పంపకాలను ఎదిరించిన చరిత్ర కమ్యూనిస్టులది. బూర్జువా పార్టీలతో ఎన్నికల సర్దుబాట్ల పేరుమీద, మిత్రపక్షాలుగా పరిగణిస్తున్న పార్టీలు అదే పనిచేసినప్పుడు చూసీ చూడనట్టు వదిలిన ఫలితం చూస్తున్నాం. కమ్యూనిస్టులు పోటీ చేస్తున్న చోట, బూర్జువా పార్టీల వెనక ఉన్న ప్రజలు కమ్యూనిస్టులకు ఓట్లు వేయాలంటే డబ్బు, మద్యం ఉండాలన్న చర్చ మిత్రపక్షాల నుంచి మొదలైంది. తాము పోటీ చేసిన చోట్ల, కమ్యూనిస్టు ఓటర్లకు కూడా పంచే పని కూడా ప్రారంభించారు. పర్యవసానంగా జరిగిందేమిటి? పోరాటాల పునాదుల మీద బలపడిన కమ్యూనిస్టుల ప్రజా పునాదిలోకి కూడా డబ్బు సంబంధాలు చొరబడ్డాయి.

ఈ పరిస్థితుల్లో ప్రజాపునాది అంటే కేవలం ఎన్నికల సంబంధం మాత్రమే కాదు. ప్రజలతో నిరంతర సంబంధాలుండాలి. వారితో మమేకం కావాలి. వారి సమస్యల పరిష్కారం కోసం చివరిదాకా ప్రయత్నించాలి. ప్రజలు కదిలితే అటో ఇటో తేలేదాకా పోరాడాలి. వీటిని మించి సరైన రాజకీయ, సైద్ధాంతిక విధానం అనుసరించాలి. వర్గ దృక్పథంతో పనిచేయాలి. ఎన్నికల ప్రయోజనాల కోసం కక్కుర్తి ప్రదర్శించకుండా పనిచేయగలిగినప్పుడే కమ్యూనిస్టు ఉద్యమ వారసత్వాన్ని నిలబెట్టగల్గుతాం. అట్లా చేసినప్పుడు, ప్రజలు ఎక్కువ సంఖ్యల్లో కదలటమే కాదు, ఏ పిలుపు వచ్చినా ఇంటికొక్కరైనా పాల్గొనాలన్న చైతన్యం ప్రదర్శిస్తారు. ప్రతి ఇంటా ఎర్రజెండా రెపరెపలాడుతుంది. కార్యకర్తలను, నాయకులను కంటికి రెప్పలాగా ప్రజలే కాపాడుకుంటారు. అదే నిజమైన ప్రజా పునాది. ❋

## 'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com



epaper.prajasakti.com

# వైవిధ్యాన్ని పెంపొందించిన అశోకుని పాలన

యం.వి.ఎస్.శర్మ



రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

అశోకుడి కాలానికి వచ్చేసరికి మౌర్య సామ్రాజ్యం భారత ఉపఖండం లో దక్షిణాది ప్రాంతం (ప్రస్తుత తమిళనాడు, దక్షిణ కర్నాటక, కేరళ ప్రాంతం) మినహా తక్కిన భాగం అంతటికీ విస్తరించింది. వాయవ్య ప్రాంతంలో ప్రస్తుత పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ కూడా మౌర్య సామ్రాజ్యంలో భాగంగానే ఉండేవి. కాశ్మీర్ ప్రాంతం మౌర్యసామ్రాజ్యంలో భాగంగా ఉండినట్టు దాఖలాలు లేవు. ఇది క్రీ.పూ. 260 నాటి పరిస్థితి.

కళింగ యుద్ధం (క్రీ.పూ. 262 ) తర్వాత అశోకుడు రాజ్య విస్తరణ కోసం యుద్ధాలు చేపట్టడం నిలిపివేశాడు. బౌద్ధ ధర్మాన్ని స్వీకరించాడు. ఆ ధర్మాన్ని ప్రజలందరూ ఆచరించాలని నిరంతర ప్రచారం నిర్వహించాడు.

ఆశోకుడి కాలం నాటి పరిస్థితులను వివరంగా తెలుసుకోడానికి ఉపకరించిన చారిత్రిక ఆధారాలు (1) ఆశోకుడు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శిలా శాసనాలు. (2) ఆ కాలంలో పర్యటించిన గ్రీకు పర్యాటకుడు మెగస్తనీస్ గ్రంధస్తం చేసిన వివరాలు, (3) అర్థశాస్త్రం గ్రంధంలో కొన్ని సందర్భాల్లో వచ్చిన ప్రస్తావనలు.

అశోకుడి తొలి శిలాశాసనంలో భారత ఉపఖండం భౌగోళిక ప్రాంతాన్ని జంబూద్వీపం అని పేర్కొన్నారు. అంటే హిందూ దేశం అన్న పేరు అప్పటికి ఇంకా వాడుకలోకి రాలేదు. అదే విధంగా భారతదేశం అన్న ప్రస్తావన కూడా లేదు. పాటలీపుత్రం రాజధానిగా ఉన్న మగధసామ్రాజ్యం అని మాత్రమే పేర్కొన్నారు.

సువిశాలమైన సామ్రాజ్యాన్ని పాలించడానికి రాజుకు సహాయకులుగా ఆయా ప్రాంతాలకు రాజ ప్రతినిధులను నియమించారు. ఇలా నియమించబడిన వారు సాధారణంగా అశోకుడి స్వంత తోబుట్టువులే ఎక్కువమంది ఉన్నారు. ఆ విధంగా సామ్రాజ్యం మీద పట్టు రాజకుటుంబానికే ప్రధానంగా ఉండే విధంగా చూసుకున్నారు..

మహారాజు ఆదేశాలను అమలు చేయడానికి వీలుగా దిగువస్థాయి ఉద్యోగులకు ఉత్తర్వులు జారీ చేయడానికి ఒక సలహామండలి ఉండేది. దీనినే పరిషత్ అన్నారు. పరిషత్ సలహాల మేరకు మహారాజు వ్యవహరించాలని అర్థశాస్త్రంలో సూచించినదానికి, అశోకుడి రాజ్యంలో ఆచరణకు పొంతన లేదు. ఇక్కడ మహారాజు ఆదేశాలను అమలు జరిగేవిధంగా చేయడమే పరిషత్ బాధ్యతగా ఉంది.

రాజ్య పాలనకు సంబంధించిన విధులను వివిధ స్థాయిలలో నిర్వహించడానికి మూడు దొంతరలలో అధికారులను నియమించారు. వీరిలో అత్యున్నతస్థాయి అధికారులను 'మహామాత్ర' అన్నారు. మహారాజు ఈ మహామాత్రలతో నేరుగా చర్చించేవాడు. ఆయా ప్రాంతాలకు రాజప్రతినిధులను నియమించడంతో బాటు ఒక్కో ప్రాంతానికీ ఒక్కో మహామాత్రను కూడా నియమించారు. ఆ విధంగా రాజప్రతినిధులతోను, అక్కడి మహామాత్రలతోను మహారాజు నేరుగా చర్చించడం ద్వారా మొత్తం సామ్రాజ్యంలోని ప్రధాన విషయాల మీద నేరుగా పట్టు కలిగివుండేవాడు. ఇక కేంద్రంలో వివిధ బాధ్యతలను నెరవేర్చడానికి కూడా మహామాత్రలను నియమించారు.

రాజధానిలో పరిపాలనను ఆరు భాగాలుగా విభజించారు. (1) చేతివృత్తుల పరిశ్రమలు (2) విదేశీయులతో వ్యవహారాలు (3) జనన, మరణ వివరాల నమోదు, పన్నుల నిర్ధారణ (4) వాణిజ్యం, తూకాలు, కొలతలు (5) వ్యాపారంలో అక్రమాలను నిరోధించడం (6) అమ్మకపు పన్ను వసూళ్ళు.

సైన్యాన్ని నిర్వహించడం, జీతభత్యాలు చెల్లించడం మహారాజు బాధ్యతగా ఉండేది. సైన్యం ప్రధానంగా (1) పదాతి దళం (2) ఆశ్విక దళం (3) రథాల దళం (4) గజ దళం. ఇవి గాక కోటలను ఆక్రమించుకోడానికి బండరాళ్ళు విసిరే యంత్రాలు ( పెద్దసైజు వడిశెలల వంటివి), గోడలను బద్దలుకొట్టడానికి కావలసిన పెద్ద పెద్ద కొయ్య దుంగలను అమర్చిన బళ్ళు వంటివి కూడా ఉండేవి. రాజ్యంలోని ప్రతి ప్రధాన నగరంలోనూ ఉండే కోటలకు రక్షణగా ఈ సైన్యాలు ఉండేవి. పాటలీపుత్రం నగరం నది వెంబడి సుమారు 15 కి.మీ. పొడవున, 3 కి.మీ. వెడల్పుతో ఉండేదని మెగస్తనీస్ పేర్కొన్నాడు. కోట చుట్టూ కొయ్యతో నిర్మించిన అగడ్త ఉండేది. దాని చుట్టూ 600 అడుగుల వెడల్పు, 30 అడుగుల లోతు కల కందకం ఉండేది. కోటకి 64 ద్వారాలు, 570 బురుజులు ఉండేవి. కోటను నిరంతరం కాపలా కాసే సైన్యం ఉండేది. ఇటువంటి కోటలు కౌశాంబి, తక్షశిల, ఉజ్జయిని, తదితర ప్రాంతాల్లో కూడా ఉండేవి.

ఆయా ప్రాంతాల్లో ఉపయోగించే భాషను బట్టి రాజ్యాన్ని ప్రాదేశికంగా



epaper.prajasakti.com

విభజించారు. మాగధి, ఉజ్జయిని, గాంధారి, కళింగ, కల్సి, దక్షిణ, సౌరాష్ట్ర వంటి ప్రాంతాలుగా విభజన జరిగింది. రాజ్య నిర్వహణకు ఎక్కువగా ప్రాకృత భాషను ఉపయోగించారు. రాజశాసనాలను ఆయా ప్రాంతాలలో ఉపయోగించే భాషలలో తయారుచేసేవారు.

(రెండువేల సంవత్సరాల క్రితమే అశోకుడు ప్రదర్శించిన ఈ ఇంగిత జ్ఞానం నేటి హిందూత్వ పాలకులకి కరువైంది. దేశమంతా ఒకే భాష అన్న సూత్రాన్ని బలవంతంగా రుద్దుతున్నారు) ఎక్కడికక్కడ పరిపాలనను నిర్వహించడానికి వీలుగా కొన్ని స్వయంపాలన ప్రాంతాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల ప్రత్యేకతలకు అనుగుణంగా అక్కడ పాలనా వ్యవహారాలను నిర్వహించుకోవచ్చు. (1)యవన, (2) కాంభోజ, (3) గాంధార, (4) రథిక, (5) పితినిక, (6) భోజ, (7) నాభాక, (8) నాభపంతి, (9) ఆంధ్ర, (10) పరింద. వీటిలో మొదటి అయిదూ వాయవ్య ప్రాంతంలోనివి. (ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం మాత్రం రాష్ట్రాలకు సైతం అధికారాలు లేకుండా వాటిని కబళిస్తోంది)

దేశ రాజధానితో ప్రతి ప్రాంతానికీ సంబంధం ఉండేలా రహదారులను నిర్మించారు. ఇందుకోసం ఒక ప్రత్యేక విభాగం ఉండేది. ప్రధాన రహదారుల వెంబడి ప్రతి మైలుకీ ఒక టోల్‌గేట్ ఉండేది. రోడ్లకు దగ్గరలో ఉండేలా ఎక్కడికక్కడ బావులు తవ్వించారు. రోడ్లకు ఇరువైపులా చెట్లు నాటించారు. ఈ రహదారుల వెంబడి వేగుల వ్యవస్థ కూడా ఉండేది.

**పన్నుల విధానం:** రాజ్యంలో భూమి మొత్తానికి మహారాజే యజమాని. పన్నులు ప్రధానంగా వస్తురూపంలో వసూలు చేసేవారు. స్వంత పశువులు, నాగళ్ళు కల రైతులు భూమి శిస్తు చెల్లించాలి. దానితో బాటు పండిన పంటలో సగం భాగాన్ని పన్నుగా చెల్లించాలి. కేవలం స్వంత శారీరక శ్రమ మాత్రమే చేసే రైతులైతే (స్వంతంగా పశువులు, నాగళ్ళు లేనివారు) పండిన పంటలో నాలుగో వంతు మాత్రమే తమ వాటాగా తీసుకుని మూడు వంతులు పన్నుగా చెల్లించాలి. అశోకుడు తన

> **❝ ఎక్కడికక్కడ పరిపాలనను నిర్వహించడానికి వీలుగా కొన్ని స్వయంపాలన ప్రాంతాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల ప్రత్యేకతలకు అనుగుణంగా అక్కడ పాలనా వ్యవహారాలను నిర్వహించుకోవచ్చు. (1)యవన, (2) కాంభోజ, (3) గాంధార, (4) రథిక, (5) పితినిక, (6) భోజ, (7) నాభాక, (8) నాభపంతి, (9) ఆంధ్ర, (10) పరింద. వీటిలో మొదటి అయిదూ వాయవ్య ప్రాంతంలోనివి. ❞**

రాజ్యంలో కొన్ని చోట్ల చెరువులు తవ్వించి, అక్కడి నుంచి కాలువల ద్వారా పంటపొలాలకు నీరందేటట్లు చేశాడు. ఆ విధంగా కాలువల ద్వారా నీరందే పొలాల రైతుల నుండి 'ఉదక భాగం' పేరుతో నీటిపన్ను వసూలు చేసేవారు.

పన్నులను వస్తురూపేణా వసూలు చేసేవారు కనుక ఆ విధంగా వసూలయే ధాన్యాన్ని నిల్వ చేయడానికి పెద్ద పెద్ద ధాన్యాగారాలను నిర్మించారు. రైతుల నుండే కాక, చేతివృత్తుల వారి నుండి కూడా పన్నులు వసూలు చేసేవారు. అమ్మిన వస్తువుల విలువలో పదోవంతు పన్ను వసూలు చేసేవారు. దానితో బాటు చేతివృత్తులవారు వివిధ సేవలను ఉచితంగా అందించాలి.

కొంత పన్ను నగదు రూపంలో కూడా వసూలు చేసేవారు. నాణేలను కేంద్రంలో ప్రభుత్వమే ముద్రించేది. ప్రధానంగా వెండి, రాగి లోహాలను ఉపయోగించి ఈ నాణేలను తయారు చేసేవారు. పాలనా నిర్వహణలో రాతి శాసనాలు మినహా ఇతరత్రా రాతపూర్వకమైన రికార్డులు, జమాఖర్చులు వంటివి దాదాపు లేవు. ఎక్కువగా అధికారుల జ్ఞాపకశక్తి మీదనే ఆధారపడ్డారు.

**ఈ కాలానికి సంబంధించిన కొన్ని ప్రధానమైన మైలురాళ్ళు:**

1. మగధలో నందవంశ పాలన ప్రారంభం: క్రీ.పూ. 344
2. వాయవ్య భారతంపై అలెగ్జాండర్ దండయాత్ర: 327-325
3. అలెగ్జాండర్ మరణం:323
4. నందరాజ్య పతనం, చంద్రగుప్త మౌర్యుని పాలన ప్రారంభం:322
5. చంద్రగుప్త మౌర్యుడిచే వాయవ్య భారతం స్వాధీనం:311-305
6. సెల్యూకస్‌తో సంధి, రాయబారిగా మెగస్తనీస్ రాక:305
7. చంద్రగుప్తుని మరణం, బిందుసారుడి పట్టాభిషేకం:298
8. బిందుసారుడి మరణం, అశోకుడి పట్టాభిషేకం:270
9. కళింగయుద్ధం:262

**అశోకుని శాసనాలు-ప్రత్యేకతలు**

అశోకుని కాలంలోని రాతి శాసనాలు చారిత్రికంగా చాలా విలువైన ఆధారాలుగా ఉన్నాయి. ఇప్పటి వరకూ మనకు బోధపడని సింధు నాగరికత కాలంనాటి లిపి మాత్రమే మనకు అభించిన అత్యంత ప్రాచీనమైన రాతపూర్వక ఆధారం. ఆ తర్వాత మనకు లభించిన రాతపూర్వక ఆధారం అశోకుడి కాలం నాటి శాసనాలు మాత్రమే. ఇవి మూడు భాషల్లో రాయబడ్డాయి. (1) ప్రాకృతం, (2) ఇరానో-అరమైక్, (3) గ్రీక్. ఈ శాసనాలను నాలుగు లిపులలో రాశారు. (1) బ్రాహ్మీ, (2) ఖరోష్టి, (3) అరమైక్, (4) గ్రీక్.

అశోకుని కాలంనాటి బ్రాహ్మీ లిపి నుండే మన దేశంలో నేడు ఉపయోగించే అనేక భాషల లిపులు పుట్టుకొచ్చాయి. హిందీతో సహా కొన్ని ద్రవిడ భాషలు కూడా బ్రాహ్మీ లిపి నుండే ఆవిర్భవించాయి. (సంస్కృతమే భారతీయ



epaper.prajasakti.com

> **" మానవులందరూ సమానమేనని, అన్ని మతాలూ గౌరవించదగ్గవేనని అశోకుడి శాసనాలు ప్రకటించాయి. అన్ని మతాల వారూ స్వేచ్ఛగా ప్రచారం చేసుకోవచ్చునని తెలిపాయి.. కౌటిల్యుడి అర్ధశాస్త్రంలో, లేదా మనుధర్మశాస్త్రంలో ప్రస్తావించినట్టు అశోకుడి ధర్మ ప్రచారంలో ఎక్కడా రాజకీయ కోణం కనిపించదు. అసమానతలను, వివక్షను సమర్థించినట్టు కనపడదు. "**

భాషలకు తల్లి అనే వాదన చారిత్రికంగా తప్పు అని ఈ ఆధారాలు రుజువు చేస్తున్నాయి.)

అటు ఆఫ్ఘనిస్తాన్ నుండి ఇటు కర్ణాటక వరకు వివిధ ప్రాంతాల్లో ఈ రాతి శాసనాలు లభ్యమౌతున్నాయి. వీటిని రాళ్ళమీద, స్తూపాల మీద చెక్కారు. అశోకుడు వివిధ సందర్భాలలో ఇచ్చిన ఆదేశాలు ఈ శాసనాల్లో ఉన్నాయి. కనుక ఒకే ఆదేశం వివిధ ప్రాంతాల్లో రాళ్ళమీద దొరుకుతుంది. ఆ విధంగా ఈ శాసనాల సాధికారికత ఇంకా బలపడింది. దానిని ఆయా ప్రాంతాల భాషలలోకి తర్జుమా చేసేవారు. రాళ్ళమీద చెక్కినప్పుడు బ్రాహ్మీ లిపి కొన్ని చోట్ల ఉపయోగిస్తే, మరికొన్ని చోట్ల ఆరమైక్ లిపి లేదా గ్రీకు లిపిని ఉపయోగించారు. అశోకుడు ఉపయోగించిన భాష చాలా సరళంగా, సామాన్యులకు బోధపడే విధంగా ఉండేది కావడంతో తర్వాత చరిత్రకారులకు చాలా ఉపయోగపడింది. అశోకుడి ఆదేశాలతో బాటు సామాజిక, రాజకీయ, ధార్మిక సందేశాలు కూడా ఉండేవి.

చరిత్రలో ఒక వ్యక్తి గురించి ప్రచారంలో ఉన్న గాథల ద్వారా మాత్రమే కాకుండా ఆ వ్యక్తి నేరుగా వ్యక్తం చేసిన భావాలను రాతపూర్వకంగా తెలుసుకోగలిగిన అవకాశం మొట్టమొదట అశోకుడి విషయంలోనే వచ్చింది. అశోకుడి ఆదర్శాలను మాత్రమే గాక, అతడు ఆందోళన చెందిన విషయాలను, తన గురించి అతడు మంచిగా చెప్పుకున్న సంగతులే కాకుండా ఆత్మవిమర్శనాపూర్వకంగా చెప్పుకున్నవి సైతం ఈ శాసనాల ద్వారా మనకు తెలుస్తున్నాయి.

**అశోకుడూ-బౌద్ధ ధర్మ ప్రచారం**

తన రాజ్యంలోని ప్రజలు, రాజోద్యోగులు మాత్రమే కాక భవిష్యత్ తరాల వారు కూడా బౌద్ధ ధర్మాన్ని అనుసరించాలన్న ఉద్దేశ్యంతో అశోకుడు ఈ శిలాశాసనాలను చెక్కించాడు. నేటికీ చెదరకుండా ఉన్న రాతి స్తూపాలు ఇందుకు తార్కాణంగా నిలిచాయి.

వైదిక పరిభాషలో ధర్మం అంటే చట్టంతో సమానం. ప్రతి ఒక్కరూ తప్పకుండా అనుసరించి తీరాల్సినది. అలా చేయకపోతే శిక్ష పడుతుంది. కాని బౌద్ధధర్మం అటువంటిది కాదు. ఇక్కడ ధర్మం అంటే బుద్ధుని బోధనలు. స్వచ్ఛందంగా పాటించాల్సిన ఆదర్శాలు, పద్ధతులు.

ఐతే అశోకుడు ధర్మం అనే పదాన్ని అటు వైదిక అర్ధంలో గాని, ఇటు బౌద్ధ అర్ధంలో గాని

ఉపయోగించలేదు. అశోకుడు ఒక శాసనంలో తాను బౌద్ధంలోను, సంఘంలోను పూర్తి విశ్వాసం కలిగివున్నవాడిగా ప్రకటించుకున్నాడు. అదే మరో శాసనంలో తన రాజ్యంలో ప్రజలంతా ఇతరుల ధర్మాన్ని కూడా తెలుసుకోవాలని, అన్ని ధర్మాలను ఆచరించాలని ప్రకటించాడు. "ఫలానా కులం వారు ఫలానా విధులు నిర్వహించడం వారి ధర్మం" అన్న అర్థం వచ్చేలా ఎక్కడా అశోకుడు తన శాసనాలలో ప్రకటించలేదు.

**అశోకుడి శాసనాలలో ప్రచారం చేసిన ధర్మాలు**

1. అన్ని జీవుల యెడల దయతో వ్యవహరించడం, వాటికి హాని తలపెట్టకుండా ఉండడం.

2. తల్లిదండ్రుల ఆదేశాలను గౌరవించడం.

3. పెద్దల యెడల భక్తి కలిగి వుండి వారి ఆదేశాలను గౌరవించడం.

4. బ్రాహ్మణులను, శ్రమణకులను (అన్ని మతాల సన్యాసులు) ఆదరించడం.

5. బానిసలను, సేవకులను ఆదరంగా చూడడం.

6. స్నేహితులను, బంధువులను, సహోద్యోగులను ఆదరంగా చూడడం.

7. ఉదారబుద్ధి కలిగివుండడం.

8. సత్యాన్నే పలకడం.

9. ఆలోచనల్లో పవిత్రత, దయ కలిగివుండడం.

10. ఆత్మనిగ్రహం (ముఖ్యంగా మాటల్లో) పాటించడం.

11. గురువులను గౌరవించడం.

12. పొదుపుగా ఖర్చు చేయడం, పరిమితంగా సంపద కలిగివుండడం.

13. వయస్సులో పెద్దవారిని గౌరవించడం.

14. పేదవానిని, దిక్కులేనివారిని ఆదరించడం.

15. తనకన్నా పై స్థాయిలో ఉన్నవారి ఆదేశాలను పాటించడం.

16. ఈర్ష్య, అసూయ, ద్వేషం, పగ, క్రూరత్వం, గర్వం వంటి లక్షణాలను విడనాడడం.

17. ఉపవాసదీక్ష పాటించడం.

మానవులందరూ సమానమేనని, అన్ని మతాలూ గౌరవించదగ్గవేనని అశోకుడి శాసనాలు ప్రకటించాయి. అన్ని మతాల వారూ స్వేచ్ఛగా ప్రచారం చేసుకోవచ్చునని తెలిపాయి.. కౌటిల్యుడి అర్ధశాస్త్రంలో, లేదా మనుధర్మశాస్త్రంలో ప్రస్తావించినట్టు అశోకుడి ధర్మ ప్రచారంలో ఎక్కడా రాజకీయ కోణం కనిపించదు. అసమానతలను, వివక్షను సమర్థించినట్టు కనపడదు. ఐతే పంచములు మాత్రం స్మశానాల వద్దే నివసించాలని అశోకుడు నిర్దేశించాడు. దీనిని బట్టి కుల వ్యవస్థతో ప్రత్యక్షంగా ఘర్షణ పడే వైఖరిని తీసుకోలేదని భావించాలి.

**(తరువాయి వచ్చే సంచికలో)**

❋



epaper.prajasakti.com

రాజకీయ పరిణామాలు

# మైనారిటీలపై దాడులను తీవ్రం చేసిన సంఘ్ పరివార్

ఎ.కోటిరెడ్డి



రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

హిందువుల నూతన సంవత్సరం, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి పండుగల సందర్భంగా ఏప్రిల్ 2 నుండి 16వ తేదీ వరకు సంఘ్ పరివార్‌కు చెందిన అసాంఘీక శక్తులు దేశంలోని వివిధ ప్రాంతాలలో ప్రదర్శనలు జరుపుతూ మైనారిటీలపై దాడులకు తెగబడ్డారు. అనేకచోట్ల మసీదులను లక్ష్యంగా చేసుకొని, మైక్‌ల సౌండ్ పెంచి మైనారిటీలను రెచ్చగొట్టే విధంగా నినాదాలు చేశారు. మైనారిటీలపై జరుగుతున్న దాడులను నిరోధించకుండా ఎక్కువ చోట్ల పోలీసులు ప్రేక్షకుల వలె వ్యవహరించారు. కొన్నిచోట్ల మైనారిటీలను బెదిరించారు. మరికొన్ని చోట్ల దాడులకు తోడ్పాటునందించారు. అన్నిచోట్లా దాడులకు పాల్పడినవారిని వదిలివేసి, దాడులకు గురైన మైనారిటీలపైనే కేసులు నమోదు చేశారు. శ్రీరామనవమి సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్‌లోని సిలిగురి, గోవాలోని వాస్కో పట్టణం, ముంబై, బీహార్‌లోని ముజఫర్‌నగర్, రాజస్థాన్‌లోని కరౌలి, కర్ణాటకలోని రాయచూర్, గుజరాత్‌లోని వివిధ ప్రాంతాలలో మైనారిటీలపై దాడులు చేశారు. ఎబివిపి నాయకత్వంలో ఢిల్లీలోని జెఎన్‌యు విద్యార్థులపై దాడులు చేశారు. తెలంగాణాలోని హైదరాబాద్ నగరంలో దాడులు జరగకపోయినప్పటికీ బిజెపి నాయకులు, ఎంఎల్‌ఎలు, సంఘ్ పరివార్‌కు చెందినవారు హిందువుల ఆధిపత్యాన్ని స్థాపిస్తామని, హిందువులతో ఘర్షణ పడేవారిని సహించబోమని రెచ్చగొడుతూ ప్రకటనలు చేశారు. ప్రదర్శనలు జరిగిన ప్రతిచోటా మైనారిటీలను రెచ్చగొట్టే పాటలు పాడుతూ, అరాచకంగా వ్యవహరించారు. కొన్నిచోట్ల మసీదులపై కాషాయజెండాలు ఎగురవేయటానికి ప్రయత్నం చేశారు.

దేశవ్యాపితంగా పథకం ప్రకారం మైనారిటీలను రెచ్చగొట్టి, దాడులకు కారణమైన బిజెపి, సంఘ్ పరివార్ నాయకులు మైనారిటీలను నిందిస్తూ వారిపై కేసులు నమోదు చేయిస్తూ, వారి ఆస్తులకు నష్టం కలిగించే చర్యలకు పూనుకున్నారు. మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్‌లో జరిగిన ఘర్షణలకు ముస్లింలే కారణమని ఆ రాష్ట్ర హోంమంత్రి నిందించాడు. ప్రదర్శనపై రాళ్ళు రువ్వారనే పేరుతో ముస్లింల ఇళ్ళు, దుకాణాలు, వ్యాపారాలను ధ్వంసం చేశారు. ఇవన్నీ పథకం ప్రకారం జరుగుతున్నవేనని, బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో అధికారులు, పోలీసులను ఇందుకు వినియోగించుకుంటున్నదని ఘటనల తీరు తెలియజేస్తున్నది. మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్, ఢిల్లీలోని జహంగీర్‌పురిలలో జరిగిన దాడులు, అధికారులు వ్యవహరించిన తీరును పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమౌతుంది. ఖర్గోన్‌లో శ్రీరామనవమి సందర్భంగా విహెచ్‌పి, భజరంగ్‌దళ్‌లకు చెందినవారు ఊరేగింపు మైనారిటీల ప్రాంతానికి చేరిన తర్వాత రెచ్చగొట్టే విధంగా నినాదాలు చేసి, రంజాన్ సందర్భంగా మసీదులో ప్రార్థనలు చేసుకోవటానికి చేరిన వారిని కవ్వించే విధంగా వ్యవహరించారు. ప్రదర్శనకు అనుమతించిన పోలీసులు ఈ విధమైన కవ్వింపు చర్యలను నిరోధించకుండా ఉదాశీనంగా వ్యవహరించారు. ఇదే సమయంలో ప్రదర్శనను అడ్డగించారని కొందరు పుకార్లను వ్యాపింపజేశారు. దానితో మరికొందరు సమీకృతమై మరొక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ విధంగా మతపరంగా సున్నితమైన, మైనారిటీలున్న ప్రాంతాలలో కవ్వింపులను, వదంతులను వ్యాప్తి చేస్తున్నవారిని నిరోధించటానికి పోలీసులు చర్యలు తీసుకోకపోవటం ఘర్షణలకు దారితీశాయి. తర్వాత సోమవారం నుండి అధికారులు ఘర్షణలు జరిగిన ప్రాంతంలోని మైనారిటీల ఇళ్ళు, షాపులను బుల్డోజర్లతో కూల్చివేయటం ప్రారంభించారు. ఘర్షణలలో పాల్గొన్నవారి ఇళ్ళను, షాపులను కూల్చివేస్తామని ప్రకటించారు. ఆ రాష్ట్ర హోంమంత్రి కూడా రాళ్ళు విసిరిన వారి ఇళ్ళను శిధిలాలుగా మారుస్తామని ప్రకటించాడు. ఆ విధంగా రెండు రోజుల పాటు మైనారిటీల ఇళ్ళు, షాపులను కూల్చివేశారు.

ఢిల్లీలోని జహంగీర్‌పురిలో కూడా ఇదేవిధంగా వ్యవహరించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 16వ తేదీన జరిగిన శోభాయాత్రలో స్థానికులు కానివారు కత్తులు, తుపాకులతో పాల్గొన్నారు. ఇక్కడ జరిగిన హింసకు విహెచ్‌పి, భజరంగ్‌దళ్ కార్యకర్తలు కారణమని మొదట పోలీసులు ప్రకటించారు. అనుమతి లేకుండా హనుమాన్ జయంతి ప్రదర్శన చేసిన వారిపై ఢిల్లీ పోలీసులు మొదట ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఈ ఘటనలు జరుగుతున్న సమయంలో ఢిల్లీ బిజెపి నాయకులు హోంమంత్రి అమిత్‌షాను కలిశారు. తమపై చర్యలు తీసుకుంటే యుద్ధానికి పూనుకుంటామని హిందుత్వ సంస్థలు బెదిరించటంతో వెనక్కు తగ్గిన పోలీసులు మైనారిటీలకు చెందిన వారిని బలిపశువులుగా చేసి ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. విహెచ్‌పి నాయకుని అరెస్ట్ చేసి, విచారణకని పిలిచి, 188 బెయిలబుల్ అని చెప్పి తప్పుకున్నారు. పోలీసులు విడుదల చేసిన


epaper.prajasakti.com

> "ఘర్షణలు జరిగిన ప్రాంతంలో ప్రదర్శన రెండుసార్లు తిరిగినా ఘర్షణలు జరగలేదు. మూడోసారి వచ్చినపుడు ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఒక ప్రదర్శన ఒకే ప్రాంతంలో ఒకసారికి మించి తిరగటానికి ఎక్కడా అనుమతించరు. మరి పోలీసులు విహెచ్‌పి, భజరంగ్‌దళ్‌లకు ఎందుకు అనుమతి ఇచ్చారు? ప్రదర్శనను మసీదు దగ్గర ఆపి, రెచ్చగొట్టేలా నినాదాలు చేస్తున్నప్పటికీ పోలీసులు ప్రదర్శకులను వారించలేదు."

రెండవ ఎఫ్ఐఆర్‌లో విహెచ్‌పి, భజరంగ్‌దళ్ నాయకుల పేర్లు కూడా లేవు. అమిత్‌షా నిర్దేశం మేరకు ఎన్ఐఎ కింద ముస్లీం యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. జహంగిర్‌పురిలో ఇళ్ళు, షాపులను కూల్చివేయటాన్ని ఆపాలని కోరుతూ సుప్రీంకోర్టుకు వెళ్ళగా కూల్చివేతలను ఆపాలని ఆదేశిస్తూ స్టే ఆర్డరు ఇచ్చింది. స్టే ఆర్డర్‌ను గురించి తెలియజేసిన తర్వాత కూడా అధికారులు కోర్టు ఆదేశాలను లెక్క చేయకుండా కూల్చివేత కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ విషయాన్ని తిరిగి సుప్రీంకోర్టు ధర్మాసనానికి తెలియజేసిన తర్వాత కోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ, తమ ఆదేశాలను పాటించని అధికారులపై తీవ్రమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. కోర్టు ఆదేశం తర్వాత కూల్చివేతలు జరుగుతున్న ప్రాంతానికి వెళ్ళిన సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ కూల్చివేతలో పాల్గొంటున్న బుల్డోజర్లకు అడ్డుపడటంతో అధికారులు వెనక్కు తగ్గక తప్పలేదు. మైనారిటీలపై జరుగుతున్న ఈ దాడులను ప్రత్యక్షంగా అడ్డుకోవటానికి పూనుకోవటం, మతోన్మాదాన్నిప ఎదుర్కోవటం, మైనారిటీలను కాపాడటంలో సిపిఐ(ఎం) ప్రత్యేకతను వెల్లడిస్తున్నది.

### వామపక్షాల నిజనిర్ధారణ కమిటి వెల్లడించిన వాస్తవాలు

వాస్తవాలకు భిన్నంగా, హిందూత్వ సంస్థలు ప్రేరేపించిన హింసాకాండను సమర్థించేవిగా ప్రధాన స్రవంతి మీడియాలో వచ్చిన కథనాలు ఉన్నాయి. వామపక్షపార్టీల నిజనిర్ధారణ బృందం ఘర్షణలు జరిగిన ప్రాంతాలలో పర్యటించి వాస్తవాలను వెల్లడించింది. విహెచ్‌పి, భజరంగ్‌దళ్‌లు బయటి నుండి సమీకరించిన వారు కత్తులు, తుపాకులతో ప్రదర్శనలో పాల్గొని మైనారిటీలను రెచ్చగొట్టారు. ప్రదర్శనకు ముందు, వెనుక పోలీసులు ఉన్నప్పటికీ ప్రదర్శనలో కత్తులు, తుపాకులతో పాల్గొనటానికి అభ్యంతరం తెలుపలేదు. వారి రెచ్చగొట్టే చర్యలను ఆపటానికి ప్రయత్నించలేదు. ఘర్షణలు జరిగిన ప్రాంతంలో ప్రదర్శన రెండుసార్లు తిరిగినా ఘర్షణలు జరగలేదు. మూడోసారి వచ్చినపుడు ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఒక ప్రదర్శన ఒకే ప్రాంతంలో ఒకసారికి మించి తిరగటానికి ఎక్కడా అనుమతించరు. మరి పోలీసులు విహెచ్‌పి, భజరంగ్‌దళ్‌లకు ఎందుకు అనుమతి ఇచ్చారు? ప్రదర్శనను మసీదు దగ్గర ఆపి, రెచ్చగొట్టేలా నినాదాలు చేస్తున్నప్పటికీ పోలీసులు ప్రదర్శకులను వారించలేదు. రంజాన్ మాసం కావటంతో ప్రార్థన సమయంలో ముస్లీంలు పెద్దసంఖ్యలో మసీదు వద్దకు చేరుకున్నారు. ఆ సమయంలోనే మసీదు వద్ద ప్రదర్శనను ఆపి, రెచ్చగొట్టే చర్యలకు పూనుకోవటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రదర్శనలో పాల్గొన్నవారు ఈ విధంగా రెచ్చగొడుతూ, ఘర్షణలకు కారణం కాగా, వారిని నివారించటంలో పోలీసులు విఫలమయ్యారని ఈ అంశాలు వెల్లడిస్తున్నాయి. నిజ నిర్ధారణ బృందం పోలీసుస్టేషన్‌కు వెళ్ళిన సమయంలోనే బిజెపి నాయకులు పోలీసుస్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహిస్తుండటాన్ని చూశారు. బిజెపి నాయకులు కేంద్ర ప్రభుత్వం ద్వారా పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చి, ఘర్షణలకు పాల్పడిన వారిని వదిలివేసి, మైనారిటీలపై ఏ విధంగా కేసులు నమోదు చేయించి వేధిస్తున్నారన్నది ఈ ఘటనలతో స్పష్టమౌతున్నది. విహెచ్‌పి, భజరంగ్‌దళ్‌లు పథకం ప్రకారం మైనారిటీలను రెచ్చగొట్టి, ఘర్షణలకు కారణం కాగా, వాటిని నివారించటానికి పూనుకోకుండా చోద్యం చూస్తు వ్యవహరించి, తర్వాత మైనారిటీలపై అక్రమంగా కేసులు నమోదు చేస్తున్న పోలీసులు కూడా ఈ కుట్రలో భాగస్వాములయారు. ఈ విధంగా మతోన్మాదులు మతం పేరుతో ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేయటానికి పూనుకోగా, స్థానికప్రజలు కుల, మతాలతో నిమిత్తం లేకుండా ఐక్యంగా శాంతి ప్రదర్శన జరిపి, వారికి గుణపాఠం చెప్పారు. ప్రదర్శనలో హిందువులు, ముస్లీంలు, క్రైస్తవులు, సిక్కులు తదితర స్థానికులందరూ పాల్గొన్నారు.

మత ఘర్షణలకు పథకం రూపొందించిన అఖిలభారత ప్రతినిధి సభఐదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఆర్ఎస్ఎస్ అత్యున్నత నిర్ణాయక సంస్థ అఖిల భారత ప్రతినిధి సభ సమావేశం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో మార్చి 11న నుండి 13వ తేదీ వరకు జరిగింది. సమావేశంలో వార్షిక నివేదికను ప్రవేశపెట్టి, తీర్మానాన్ని ఆమోదించారు. తాము చేస్తున్న తప్పులు, మతోన్మాద కార్యకలాపాలను ఎదుటివారిపై రుద్దటం, హిందువులను మతమార్పిడికి ప్రోత్సహిస్తున్నారన్న దుష్ప్రచారాన్ని తీవ్రం చేసి, మత ఉద్రిక్తతలను మరింత ఎగదోయటం, రాజ్యాంగంపై దాడికి పురికొల్పటం లక్ష్యంగా నివేదికను రూపొందించారు. పెరుగుతున్న మతమౌఢ్యం తీవ్రమైన సవాళ్ళను విసురుతున్నదని, ఒక మతం వారు ప్రభుత్వ యంత్రాంగంలోకి చొరబడటానికి దీర్ఘకాలం నుండి కుట్ర చేస్తున్నారని, వివిధ రకాలైన చీలికలను ప్రోత్సహించటం ద్వారా హిందు సమాజాన్ని బలహీనపరచటానికి ప్రయత్నం చేస్తున్నారని పేర్కొంది. జాతీయత, హిందుత్వ, సాంస్కృతిక విలువలు, సాంప్రదాయాలపై తీవ్రమైన దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రజలను ఆకట్టుకొనే పద్ధతిలో ఆ ప్రచారాన్ని తిప్పికొట్టాలని నివేదికలో చెప్పారు. సామాజిక కట్టుబాట్లు, ఆచారాలు, సాంప్రదాయాలను ధిక్కరిస్తూ చిన్న కారణాలతో వరుసగా సభలు, ప్రదర్శనలు జరుపుతూ రాజ్యాంగం ముసుగులో మతపరమైన విద్వేషంతో క్రూరమైన దాడులకు, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడటం పెరుగుతున్నదని పేర్కొన్నారు. పెరుగుతున్న మతోన్మాదం ప్రమాదకరంగా తయారైంది. తీవ్రమైన మత విద్వేషం అనేక ప్రాంతాలలో


epaper.prajasakti.com

తిరిగి తలయెత్తుతున్నదని, కేరళ, కర్ణాటక రాష్ట్రాలలో హిందు సంస్థల కార్యకర్తల హత్యలు ఇందుకు నిదర్శనంగా ఉన్నాయని నివేదికలో ఉద్ఘాటించారు.

మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ మైనారిటీలపై తాము చేస్తున్న దాడులను కప్పిపెట్టుకోవటానికి, రాజ్యాంగంపైనా, అభ్యుదయ శక్తులపైనా దాడిని మరింత తీవ్రం చేయటానికి అవసరమైన అంశాలను నివేదికలో పొందుపరిచారని పై విషయాలు స్పష్టం చేస్తున్నాయి. వివిధ సంస్థలలోకి పథకం ప్రకారం చొరబడటం, వాటిని చట్టబద్ధంగా పనిచేయకుండా నిరోధించి, తమ లక్ష్యాలకు అనుగుణంగా ఉపయోగించుకుంటున్న ఆర్ఎస్ఎస్ మరెవరో ఆ పనిచేస్తున్నట్లుగా నిందిస్తున్నది. బిజెపి ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన సంస్థలన్నింటినీ నిర్వీర్యం చేస్తున్నది. హిందు మతోన్మాదాన్ని పెంచటం ద్వారా సమ్మిళిత సంస్కృతికి ఆలవాలంగా ఉన్న భారతీయ సమాజాన్ని ధ్వంసం చేస్తూ, ఇతర మతాలపై దాడులకు పూనుకుంటున్నారు. ఆర్థిక, సామాజికాభివృద్ధి ఫలితంగా హిందుమతం ప్రవచించిన చాతుర్వర్ణ వ్యవస్థ, కుల అసమానతలు వెనుకపట్టుపట్టటం, భారతీయ సమాజం సామాజిక సమానత్వం వైపుగా పురోగమించటాన్ని సంఘ్ పరివారం సహించలేకపోతున్నది. సమానత్వం, అభివృద్ధి సాధనకు పునాదిగా ఉన్న రాజ్యాంగంపై దాడిని మరింత తీవ్రం చేసింది. మతపరమైన మైనారిటీలు, అభ్యుదయ శక్తులపై పథకం ప్రకారం దాడులు, హత్యలు చేస్తూ ఇతరులెవరో తమ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కేరళలో తమ కార్యకర్తలను హత్య చేస్తున్నారనేది ఇటువంటి తప్పుడు ప్రచారమే.

ఆర్ఎస్ఎస్ అఖిలభారత ప్రతినిధి సభ నివేదికలోని అంశాలను పరిశీలిస్తే మైనారిటీలపై దాడులను తీవ్రం చేయటం ద్వారా ప్రజల మధ్య విభజన సృష్టించటం, మతోన్మాదాన్ని మరింతగా పెంచటం కోసం ఆర్ఎస్ఎస్ పథకం రూపొందించిందని స్పష్టమౌతున్నది. ఈ పథకాన్ని అమలుచేయటంలో భాగంగానే నూతన సంవత్సరం, శ్రీరామనవమి, హనుమాన్ జయంతిని ఉపయోగించుకుని మత ఘర్షణలు సృష్టించటానికి పూనుకున్నారు. రానున్న కాలంలో మత ఘర్షణలను తీవ్రం చేయటం ద్వారా దేశప్రజల మధ్య చీలికలను తీవ్రం చేయటం, ప్రజలు భక్తిభావంతో జరుపుకుంటున్న పండుగలను తమ మతోన్మాద క్రీడలో సాధనాలుగా ఉపయోగించుకుంటారని జరిగిన ఘటనలను పరిశీలిస్తే స్పష్టమౌతున్నది. దేశంలోని వామపక్ష,లౌకిక, ప్రజాస్వామ్య వాదులందరూ సమైక్యంగా ప్రజలను సమీకరించటం ద్వారా ఆర్ఎస్ఎస్ కుట్రలను తిప్పికొట్టటానికి సన్నద్ధం కావాలి.

> “ హిందు మతోన్మాదాన్ని పెంచటం ద్వారా సమ్మిళిత సంస్కృతికి ఆలవాలంగా ఉన్న భారతీయ సమాజాన్ని ధ్వంసం చేస్తూ, ఇతర మతాలపై దాడులకు పూనుకుంటున్నారు. ఆర్థిక, సామాజికాభివృద్ధి ఫలితంగా హిందుమతం ప్రవచించిన చాతుర్వర్ణ వ్యవస్థ, కుల అసమానతలు వెనుకపట్టుపట్టటం, భారతీయ సమాజం సామాజిక సమానత్వం వైపుగా పురోగమించటాన్ని సంఘ్ పరివారం సహించలేకపోతున్నది. ”



ఢిల్లీలోని జహంగీర్‌పురిలో చట్టవిరుద్ధంగా మైనార్టీల ఇళ్లను కూలుస్తున్న బుల్డోజర్లను అడ్డగించిన బృందాకరత్

### అమెరికా బెదిరింపులపై నోరు మెదపని మోడి

రష్యా–ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం సందర్భంగా అమెరికా, నాటో దేశాలు రష్యాపై ఆంక్షలు విధించటంతో మనదేశం రష్యా నుండి ఆయిలు, ఇతర ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటే రూపాయి–రూబుల్ మారకం ద్వారా చెల్లింపులు చేయవచ్చునని రష్యా ప్రకటించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఆయిల్ ధరలు బ్యారల్‌కు 105 డాలర్లకు మించి ఉండి, ఇంకా పెరగటానికి అవకాశం ఉన్న సమయంలో రష్యా నుండి దిగుమతులు చేసుకోవటం మనకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. రష్యా బ్యారెల్‌కు 35 డాలర్ల చొప్పున మనకు ముడి చమురును అమ్ముతానని చెప్పింది. మార్కెట్ ధరకన్నా మూడింట రెండువంతుల తక్కువ ధరకు ముడి చమురును దిగుమతి చేసుకుంటే దేశంలో పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గటానికి దోహదం చేస్తుంది. గతంలో లేని విధంగా ద్రవ్యోల్బణం పెరగటంలో పెట్రోలు, డీజిల్ ధరల పెరుగుదల కూడా ముఖ్య కారణంగా ఉంది. ద్రవ్యోల్బణం ప్రజలకు పెనుభారంగా పరిణమించింది. ఇటువంటి పరిస్థితులలో ధరల భారం నుండి ప్రజలకు ఉపశమనం కలిగించటానికి, దేశ ఆర్థికవ్యవస్థను మెరుగుచేసుకోవటానికి రష్యా నుండి తక్కువ ధరలకు ముడి చమురును దిగుమతి చేసుకోవటం ఉపయోగపడుతుంది. మనదేశం రష్యా నుండి తక్కువ ధరలకు వచ్చే ముడి



epaper.prajasakti.com

> **" జాతీయ ద్రవ్యీకరణ పథకం ద్వారా నాలుగు సంవత్సరాల కాలంలో ఆరు లక్షల కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని, దేశవ్యాపితంగా మౌలిక సదుపాయాలు కల్పించటం కోసం ఆ ఆదాయాన్ని వినియోగిస్తామని చెబుతున్నారు. పూర్తయిన మౌలిక సదుపాయాలను ప్రైవేటు వారికిస్తూ, తిరిగి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఖర్చు చేస్తున్నదంటే అర్థమేముంది? తిరిగి కల్పించే మౌలిక సదుపాయాలు కూడా ప్రైవేటు వారికే అప్పగిస్తారు కదా! "**

చమురును దిగుమతి చేసుకోవటం గురించి ఆలోచిస్తామని ప్రకటించగానే రష్యా నుండి ముడి చమురును దిగుమతి చేసుకుంటే మనదేశంపై ఆంక్షలు విధిస్తామని అమెరికా బెదిరింపులకు దిగింది. ప్రత్యామ్నాయ చెల్లింపుల విధానం ద్వారా రష్యా నుండి ఆయిల్ దిగుమతి చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని మనదేశంలో పర్యటిస్తున్న అమెరికా డిప్యూటి రక్షణ సలహాదారు దలీప్‌సింగ్ మార్చి 31వ తేదీన బెదిరింపులకు దిగాడు. ఆత్మ నిర్భరత, దేశాన్ని నంబర్ వన్‌గా మార్చటానికి కృషి చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న మోడి గాని, ఆయన ప్రభుత్వంలోని వారుగాని ఈ ప్రకటనను ఖండించలేదు. ఎగుమతులు-దిగుమతుల విషయంలో మనదేశానికి ప్రయోజనం కలిగించేలా వ్యవహరిస్తామని కనీసం ప్రకటన కూడా చేయలేదు. అమెరికా ప్రతినిధి మనదేశంలో ఉండి మనదేశాన్ని బెదిరిస్తూ ప్రకటన చేస్తే తమ దేశభక్తిని గురించి గొప్పలు చెప్పుకుంటూ, ఇతరులకు దేశభక్తి లేదని నిందిస్తున్న బిజెపి, సంఘ్ పరివార్‌కు చెందిన సంస్థలు కనీసంగా స్పందించకపోవటం వారి నయవంచక స్వభావాన్ని వెల్లడిస్తున్నది.

**ఇంధన ధరల పెంపుతో ప్రజలపై పెరుగుతున్న భారం**

ఐదు రాష్ట్రాలలో ఎన్నికలకు ముందు నాలుగు మాసాల పాటు పెట్రోలు, డీజిల్ ధరల పెంపును వాయిదా వేసిన కేంద్ర ప్రభుత్వం ఎన్నికలు పూర్తి అయిన తర్వాత తిరిగి ధరల పెంపు కార్యక్రమాన్ని ప్రారంభించింది. మార్చి 22వ తారీఖున ధరలను పెంచటం ప్రారంభించిన ప్రభుత్వం ఏప్రిల్ 5వ తేదీనాటికి 15 రోజులలో 13 సార్లు ధరలను పెంచింది. ఈ 13 సార్లు ధరలు పెంచిన ఫలితంగా పెట్రోలు, డీజిల్‌పై లీటరుకు 9.20 రూపాయలు అదనంగా పెరిగింది. కోవిడ్‌తో ప్రజల ఆర్థిక పరిస్థితులు తల్లకిందులై కోట్లాది మంది ఉపాధి కోల్పోవటం, ఆదాయలు తగ్గిపోవటం జరిగినా ప్రభుత్వం ఏ మాత్రం లక్ష్యపెట్టకుండా భారాలు విధిస్తున్నది. వాస్తవంగా ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ ధరలను పెంచవలసిన అవసరం లేదు. ఇప్పటికే ప్రపంచంలో కల్లా మనదేశంలోనే పెట్రోలు, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయి. అయినా మరింతగా ధరలు పెంచటానికి పూనుకోవటం ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల స్వభావాన్ని వెల్లడిస్తున్నది. కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలకు లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూ, రుణాలు రద్దు చేస్తున్న ప్రభుత్వం సామాన్యప్రజలపై మాత్రం భారాలపై భారాలు మోపుతున్నది. హిందువులపై అపారమైన ప్రేమ ఉన్నట్లు నటిస్తూ, మైనారిటీలపై దాడులు చేసి మత ఘర్షణలు సృష్టిస్తున్న సంఘ్ పరివార్ ప్రభుత్వం వేస్తున్న భారాలు దేశప్రజలందరిపైనా, దేశంలో మెజారిటీగా ఉన్న హిందువులపై పడుతుంటే నోరెత్తకపోవటం వారి నిజ స్వభావాన్ని వెల్లడిస్తున్నది.

ప్రభుత్వం హిందువులు, ముస్లీంలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు అనే భేదభావం లేకుండా దేశంలోని సామాన్య ప్రజలందరిపైనా భారాలు వేస్తూ, సంపదను కూడా మత విభజనలు లేకుండా అన్ని మతాలలోని పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నది. హిందువుల నుండి సంపదలను లాక్కోవటానికి, వాటిని ఇతర మతాలలోని పెట్టుబడిదారులకు కట్టబెట్టటానికి సంఘ్ పరివార్ ఏ మాత్రం వ్యతిరేకించటం లేదు. ఈ అంశాలను పరిశీలిస్తే సంఘ్ పరివార్ నాయకత్వంలోని హిందూత్వమూకల నిజస్వరూపం వెల్లడౌతుంది. వారు హిందువుల ప్రయోజనాలను కాపాడేవారు కాదు. కార్పొరేట్ల ప్రయోజనాలను మాత్రమే కాపాడుతారు. కార్పొరేట్ల ప్రయోజనాల పరిరక్షణ కోసం, దేశసంపదలను కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలకు కట్టబెట్టటం నుండి ప్రజల దృష్టిని మళ్ళించటం కోసమే మత ఘర్షణలు సృష్టిస్తున్నారు. కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలకు ప్రయోజనాల కోసం ప్రజలను మతాల వారీగా చీల్చి, మారణహోమం సృష్టిస్తున్నారు. ఈ సత్యాన్ని ప్రజలు గ్రహించేలా చేస్తే వారు సంఘ్ పరివార్ విచ్ఛిన్న క్రీడకు ముగింపు పలుకుతారు.

**జయప్రదమైన రెండు రోజుల కార్మిక, కర్షక సార్వత్రిక సమ్మె**

బిజెపి అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక, ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకిస్తూ దేశంలోని కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు ఐక్యంగా నిర్వహించిన రెండు రోజుల సార్వత్రిక సమ్మె జయప్రదంగా జరిగింది. దేశవ్యాపితంగా 20 కోట్లమందికి పైగా కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. దేశంలోని సాధారణ ప్రజానీకం అంతా ఈ సమ్మెకు మద్దతు తెలిపింది. అందువలననే అనేక రాష్ట్రాలలో సమ్మె బంద్ రూపం తీసుకుంది. ప్రైవేటీకరణ పేరుతో బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను తన అనుయాయులైన బడా కార్పొరేట్లకు కట్టబెడుతున్నది. ప్రభుత్వం వ్యాపార కార్యకలాపాలలో పాల్గొనదని చెబుతూ లాభనష్టాలతో నిమిత్తం లేకుండా మొత్తం ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరణ చేయటానికి పూనుకుంటున్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద బీమా సంస్థగా ఉన్న ఎల్ఐసి ప్రభుత్వరంగంలో ఉన్నది కాబట్టే ప్రభుత్వ బడ్జెట్‌కు, దేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు లక్షల కోట్ల రూపాయలు రుణాలు ఇస్తున్నది. కోట్లాదిమంది ప్రజలు జీవిత భద్రత కోసం తమ ఆదాయాలను బీమారూపంలో దాచుకుంటున్నారు. ఎల్ఐసి సంస్థ ప్రజల నమ్మకాన్ని నిలబెడుతూ, వారి సొమ్ముకు 100 శాతం భద్రత కల్పిస్తున్నది. 98 శాతం పైగా క్లెయింలను పరిష్కారంచేస్తూ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉన్నది. ప్రజలు ఎటువంటి భయం లేకుండా తమ ఆదాయాలను పొదుపు

(మిగతా 34వ పేజీలో)



epaper.prajasakti.com

# "ఎల్.ఐ.సి ఐ.పి.ఓ భారీ కుంభకోణం

బి.శ్రీధర్



రచయిత ప్రముఖ పాత్రికేయులు

**లాభాల కోసం తమకు నచ్చినట్టు పనిచేసే "పెట్టుబడిదారుల" కోరికలకు అనుగుణంగా, ప్రజా ప్రయోజనాలను పట్టించుకోకుండా, దుందుడుకుగాఎల్ఐసిని విక్రయించాలనే ఆలోచన దిగ్భ్రాంతికి గురిచేస్తుంది. బహుశా ఈ ఐపిఓ (ప్రభుత్వ సంస్థను ప్రైవేటీకరించేటపుడు దాని షేర్లను కార్పొరేట్ కంపెనీలకు అందించే ప్రక్రియ) లో షేర్ల ధర నిర్ణయం భారతదేశంలోని అతిపెద్ద ప్రైవేటీకరణ కుంభకోణాన్ని సూచిస్తుంది.**

'తొందరపడి చేయి, తీరిగ్గా పశ్చాత్తాపపడు' అనే పాత అరిగిపోయిన (ఇంగ్లీష్) సామెత, భారతదేశంలో ఉత్తమమైన బీమా సంస్థ అయిన భారత జీవిత బీమా సంస్థ (ఎల్ ఐ సి) లోని ప్రభుత్వ వాటాలో కొంత భాగాన్ని విక్రయించడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం హడావిడిగా తీసుకున్న నిర్ణయానికి చక్కగా అద్దం పడుతోంది.

భారీ తగ్గింపు ధరలతో షేర్లను పొందేందుకు, విపరీతంగా బేరసారాలు సాగించిన అంతర్జాతీయ స్పెక్యులేటర్ల గొంతెమ్మ కోరికలకు అనుగుణంగా భారతదేశపు అతిపెద్ద ఐపిఒను మోడీ ప్రభుత్వం నిర్వహించే విధానం చూస్తే ప్రజా ప్రయోజనాలను పూర్తిస్థాయిలో విస్మరించటం కనిపిస్తుంది. ఎల్ఐసీని అభివృద్ధి చేసి, పెంచినది దాని యొక్క కోట్లాది మంది పాలసీదారులు. వీరు కేవలం ఎల్ఐసీని మాత్రమే కాకుండా భారతదేశంలో జీవిత బీమా సంస్కృతిని అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించారు. ప్రభుత్వం దిగ్భ్రాంతికరంగా ఈ చరిత్రని విస్మరించి, కొన్ని అంతర్జాతీయ సంస్థల స్పెక్యులేటివ్ ప్రయోజనాలకు అనుకూలంగా ఉండటం ఒక అనుమానాన్ని ధృవీకరించింది. ఎల్ఐసీ షేర్ల అమ్మకం ఒక భారీ కుంభకోణమని, బహుశా భారతదేశ ప్రైవేటీకరణ చరిత్రలో ఇదే అతిపెద్ద కుంభకోణమని స్పష్టమౌతున్నది.

ఏప్రిల్ 23 శనివారం నాడు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఒత్తిడితో ఎల్ఐసి బోర్డు ప్రణాళికాబద్ధంగా పెట్టుబడుల ఉపసంహరణ చేసింది దానిని 5 శాతం నుండి 3.55 శాతంకి తగ్గించాలని నిర్ణయించింది. ఏప్రిల్ 26న, ఎల్ఐసి బోర్డు సమావేశం అయింది. ఇందులో అమ్మకం జరిగే తేదీలను నిర్ణయించి, పాలసీదారులకు, ఉద్యోగులకు ధరపై తగ్గింపు, ఇంకా ఇతర వివరాలను అధికారికంగా నిర్ణయించడానికి సమావేశమైంది. ఎల్ఐసి తన అధికారిక రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (ఎంతకు అమ్మదలుచుకుంది అని తెలిపే పత్రం)ను మార్కెట్ రెగ్యులేటర్, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) కి ఏప్రిల్ 27న అందచేయనుంది. ఆ తర్వాత ఈ వివరాలను మీడియా సమావేశంలో అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది.

ఉక్రెయిన్‌లో యుద్ధం, దాని వల్ల ప్రపంచ మార్కెట్‌లలో ఏర్పడిన గందరగోళం వంటి అసాధారణమైన పరిస్థితుల్లో చిక్కుకొని, మే 12 నాటికి ముగిసే గడువుకుకి ఈ ప్రక్రియ పూర్తిచేసేందుకు ప్రభుత్వం ప్రయాస పడుతోంది. ప్రభుత్వం సెబికి తన రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (DRHP) డ్రాఫ్ట్‌ని దాఖలు చేయడం ద్వారా ఫిబ్రవరిలో ఎల్ఐసిలో తన వాటాలో కొంత భాగాన్ని విక్రయించే దిశగా మొదటి అధికారిక చర్యను ప్రారంభించింది. ప్రభుత్వం వివాదాస్పద ఐపిఒను కొనసాగించడానికి అప్పటి వరకు సమయం ఉంది. గడువు తేదీని మించిపోతే దాని పనితీరుపై తాజాగా, కొత్తగా చేయబడిన డేటాను ఫైల్ చేయాల్సి ఉంటుంది, ఇది ఐపిఒను ఆలస్యం చేస్తుంది. ఈ దుందుడుకు నిర్బంధ పెట్టుబడి ఉపసంహరణను ప్రభుత్వం ఏ విధంగానైనా సమర్థించుకోగలదా అనేది కీలకమైన ప్రశ్న.

**భారీగా తగ్గిన ఎల్ఐసీ వాటాల ధర**

ఆర్థిక మంత్రిత్వ శాఖలోని పేరుచెప్పని అధికారుల వ్యాఖ్యలు ఆధారంగా, గత కొన్ని రోజులుగా ఈ విషయం మీద పని చేస్తున్న మీడియా నివేదికల ప్రకారం ప్రభుత్వం ఐపిఒ పరిమాణాన్ని తగ్గించాలని ఆలోచిస్తోందని సూచిస్తున్నాయి. అది సుమారుగా 70-75,000 కోట్ల నుండి 21,000 కోట్ల రూపాయిలకు తగ్గుతుందని తెలుస్తున్నది. ఇష్యూ పరిమాణాన్ని తగ్గించడానికి రెండు మార్గాలు ఉన్నాయి: తక్కువ సంఖ్యలో వాటాలను మార్కెట్‌లో పెట్టటం లేదా కాబోయే వాటాదారులకు అమ్మబోయే వాటాల ధర తగ్గించటం. ఈ "పరిమాణం" ప్రభావం అనేది ప్రభుత్వం విక్రయం చేసే షేర్ల సంఖ్య పై ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వం 30 శాతం షేర్లను తగ్గిస్తే ఈ ప్రభావం కనిపిస్తుంది. DRHP ప్రకారం ఎల్ఐసిలో ఈక్విటీ బేస్ 632.50 కోట్ల షేర్లలో 5 శాతం ప్రాతినిధ్యం వహిస్తున్న 31.625 కోట్ల షేర్లను ప్రభుత్వం విక్రయించటానికి ఆలోచన చేసింది. ప్రస్తుతం ప్రభుత్వం అమ్మజూతపుతున్నషేర్లు 22.1375 కోట్లకి తగ్గిస్తుంది, ఇది ఎల్ఐసి యొక్క ఈక్విటీ బేస్‌లో 3.5 శాతం. ఈ ప్రక్రియలో ఇప్పటి వరకు ఏదీ అక్రమంగా కనిపించదు. కానీ



epaper.prajasakti.com

> **"మొదట్లో, కేవలం రెండు నెలల క్రితం, 2.5 మరియు 3 ల మధ్య గుణకార కారకాన్ని వర్తింపజేయడం ద్వారా ప్రతి ఎల్ఐసి షేర్ యొక్క నిజమైన విలువ చేరుతుందని అంచనా వేయబడింది. అంటే ఒక్కో షేరు విలువ రూ. 2,133 నుండి రూ. 2,559 వరకు ఉంటుంది అని భావించవచ్చు. 5 శాతం వాటా విక్రయం ద్వారా అంటే 31.625 కోట్ల షేర్ల అమ్మటం ద్వారా ప్రభుత్వానికి రూ. 67,456 కోట్ల నుండి రూ. 80,928 కోట్ల వరకు వచ్చి ఉండేది."**

భారతదేశంలోని అత్యంత విజయవంతమైన బీమా కంపెనీని ప్రైవేటీకరించడం ఎందుకు అన్న ప్రశ్న వేస్తే అప్పుడు ఇది అర్థం అవుతుంది.

"ధర ప్రభావం" అనే దాని దగ్గరే ఆర్థికమంత్రి కుటిల వన్నాగం బయటపడుతోంది. ఇది ఎలాగో వివరిస్తాను. మిల్లిమాన్ అడ్వైజర్స్ యొక్క తాజా అంచనా ప్రకారం ఎల్ఐసి విలువ (ఇవి – ఎంబెడెడ్ వేల్యూ – నికర ఆస్తి విలువ, భవిష్యత్తు లాభాల ప్రస్తుత విలువ యొక్క మొత్తం) రూ. 5.40 లక్షల కోట్లు అని DHRP లో వెల్లడించింది. దీని ప్రకారం ప్రతి షేర్ మూల విలువ రూ.853. (అసలు ఈ 'ఇమిడి ఉన్న విలువ' అనే భావనలోని లోపాలను ప్రస్తుతానికి పట్టించుకోవద్దు.)

**పెట్టుబడిదారులకు లాభం,**
**పాలసీదారులకు నష్టం**

మొదట్లో కేవలం రెండు నెలల క్రితం 2.5 మరియు 3 ల మధ్య గుణకార కారకాన్ని వర్తింపజేయడం ద్వారా ప్రతి ఎల్ఐసి షేర్ యొక్క నిజమైన విలువ చేరుతుందని అంచనా వేయబడింది. అంటే ఒక్కో షేరు విలువ రూ. 2,133 నుండి రూ. 2,559 మధ్య ఉంటుంది అని భావించవచ్చు. 5 శాతం వాటా విక్రయం ద్వారా, అంటే 31.625 కోట్ల షేర్లను అమ్మటం ద్వారా ప్రభుత్వానికి రూ. 67,456 నుండి రూ. 80,928 కోట్లు వచ్చి ఉండేవి.

మీడియాలో వచ్చిన కథనాలు సూచించేదేమంటే ప్రభుత్వం అంతర్జాతీయ పెట్టుబడిదారుల తీవ్రమైన వత్తిడితో, వారు ఉదహరించిన ''ప్రతికూల మార్కెట్ పరిస్థితుల''కు లోబడి, ప్రస్తుతం షేర్ల విలువను తగ్గించేందుకు సిద్ధమైంది. అది ఎల్ఐసి అంచనా వేసిన ఇమిడి ఉన్న విలువ (ఇవి) కంటే తక్కువగా కేవలం 1.1 రెట్లు గుణకారాన్ని ఉపయోగించడం ద్వారా చేసింది. ఇది భారతదేశపు అతిపెద్ద జీవిత బీమా సంస్థ (ప్రపంచంలో అతిపెద్ద వాటిలో ఒకటి) యొక్క నిజమైన విలువకు అసలు సరిపోని కొలమానం. ప్రభుత్వం దగ్గర ఇంత తక్కువ గుణకార కారకాన్ని వర్తింపజేయడానికి ఎటువంటి సమర్థన లేదు. ప్రత్యేకించి ఎల్ఐసి కంటే చాలా చిన్న ప్రైవేట్ జీవిత బీమా సంస్థలు తమ ఇమిడి ఉన్న విలువలకు 2.5 మరియు 3 రెట్ల మధ్య కారకాన్ని వర్తింపజేసారు. కచ్చితంగా, ఎల్ఐసి తన సుదీర్ఘ ట్రాక్ రికార్డ్‌తో, పెద్ద మార్కెట్ వాటాతో, చాలా ఎక్కువ గుణకార కారకాన్ని కలిగి ఉంటుంది.

1.1 గుణకార కారకాన్ని వర్తింపజేయడం అంటే చాలా తక్కువ విలువతో వాటాలను అమ్మేయటం, అప్పుడు ప్రతి షేర్ విలువ సుమారు రూ.938 అవుతుంది. మునుపటి విలువ దిగువ పరిమితి కంటే ఇది దాదాపు 44 శాతం చౌకగా ఉంటుంది. మునుపటి వాల్యుయేషన్ యొక్క అధిక పరిమితిలో చూస్తే డిస్కౌంట్ 63 శాతం అందించబడుతుంది. ఇంకాస్త మెరుగైన పోలిక కోసం, ప్రభుత్వం తన 22.1375 కోట్ల షేర్ల (3.5 శాతం వాటా) విక్రయం ద్వారా ఎంత సంపాదించి ఉంటుందో అంచనా వేద్దాం.

ఫిబ్రవరిలో అమలులో ఉన్న గుణకార కారకాన్ని వర్తింపజేయడం ద్వారా – 2. 5 నుండి 3 మధ్య – ప్రభుత్వానికి రూ. 47,219 కోట్లు నుండి రూ. 56,650 కోట్లు మధ్య వచ్చి ఉండేది. మీడియాలో ప్రసారమవుతున్న నివేదికల ప్రకారం, 1.1 తగ్గింపు గుణకంతో ఈ 3.5 శాతం వాటా విక్రయంలో ఒక్కో షేరు ధర రూ. 938గా ఉండి, ప్రభుత్వానికి రూ. 20,765 కోట్లు వస్తుంది. ప్రైవేటీకరణ కసరత్తు యొక్క పూర్తి మూర్ఖత్వాన్ని ఒక్క క్షణం మరచిపోయినప్పటికీ, ఖజానాకు కలిగే పరోక్ష నష్టం రూ. 26,443 కోట్లు నుండి రూ. 35,885 కోట్లు ఉంటుంది.

**ఇది కుంభకోణం కాకపోతే మరేమిటి?**

భారతదేశంలో జీవిత బీమాను ప్రారంభించిన సంస్థ, దాదాపు మూడింట రెండు వంతుల మార్కెట్ వాటాను కలిగి ఉన్న సంస్థ, తన పెట్టుబడి మొత్తం మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ కంటే ఎక్కువగా ఉన్న సంస్థ, ఆరు దశాబ్దాలుగా ఎలాంటి మచ్చ లేని ట్రాక్ రికార్డు కలిగిన సంస్థ అయిన ఎల్ఐసిని, కోట్లాది మంది పాలసీదారుల ఖర్చుతో అడ్డగోలుగా డబ్బు సంపాదించడానికి, నమ్మకం కలిగించలేని, చిత్తానుసారంగా ప్రవర్తించే పెట్టుబడిదారులచే "విలువ" కట్టించటానికి అనుమతించటం కారణంగా ఈ ఎల్ఐసి ఐపిఓని ఒక భారీ కుంభకోణంగా పరిగణించాలి.

**మూల్యాంకనం ఆట**

ఇమిడి ఉన్న విలువ అందించిన మూల విలువ కూడా ఎల్ఐసి యొక్క నిజమైన విలువను తక్కువగా అంచనా వేయడమే. ఇక్కడ ఇమిడిఉన్న విలువ భావన ఆధారంగా మూల్యాంకనం చేసిన కసరత్తును పునరుద్ఘాటించవలసిన అవసరం ఉంది. ఈ కసరత్తు బీమా రెగ్యులేటర్ ద్వారా చేసి, దానితోనే ఆమోదం పొందింది. అంటే ఒకరకంగా ఎల్ఐసి యొక్క అతి కనిష్ట మూల్యాంకనానికి భారతదేశ ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ బాధ్యత ఉంది. ఇమిడి ఉన్న విలువ (అనేది జీవిత బీమా కంపెనీ యొక్క అంచనా వేసిన మూల విలువ యొక్క ఖరీదు, ఒకరకంగా ఎల్ఐసి వంటి ప్రత్యేక ఆర్థిక సంస్థల విలువ కట్టటానికి ఇది పూర్తిగా సరిపోదు.

ఇక్కడ ముఖ్యంగా నొక్కి చెప్పవలసిన విషయం జీవిత బీమా కంపెనీ యొక్క ఇమిడి ఉన్న విలువను కొలతగా తీసుకోటం ఇటీవలే, ముఖ్యంగా ప్రపంచ ఆర్థిక సంక్షోభం తరువాత మొదలైంది. ప్రపంచ జీవిత బీమా వ్యాపారంలో అనేక బీమా కంపెనీల పతనం తర్వాత విలీనాలు, కొనుగోళ్లకు ఇది దారితీసింది.

సారాంశమేమంటే ఇమిడిఉన్న విలువ ప్రశ్నకు సంక్షిప్త సమాధానాన్ని అందించడానికి ప్రయత్నిస్తుంది: జీవిత బీమా చేసిన వ్యక్తి యొక్క రాబడి (రిటర్న్) విలువ



epaper.prajasakti.com

ఎంత? ఇదే ఇమిడి ఉన్న విలువ భావనకు ప్రాతిపదిక. నిజానికి కెనడియన్ యాక్చురీ (2006) లోని ఒక పరిశోధనా పత్రంలో ఫ్రెడెరిక్ ట్రెంబ్లే ఇలా అన్నారు, ఇమిడిఉన్న విలువను "చాలా జాగ్రత్తగా వాడాలి" ఎందుకంటే, ఇవి వాల్యుయేషన్ కోసం తయారు చేయబడిన అంతర్లీన అంచనాలపై సూక్ష్మంగా ఆధారపడి ఉంటాయి.

నిజానికి, మూల్యంకనం గురించి మరో సందర్భంలో మాట్లాడుతూ, న్యూయార్క్‌లోని స్టెర్న్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఫైనాన్స్ ప్రొఫెసర్, "మూల్యాంకన గురువు" అశ్వత్ దామోదరన్, అందరికి తెలిసిన ఆయన పదే పదే నొక్కిచెప్పేదేమంటే దేని మూల్యాంకనం లోనయినా మూల్యాంకనం చేసేవారి పక్షపాతాలను ప్రతిబింబిస్తూ రూపొందించిన అంతర్లీన అంచనాలపై ఆధారపడి ఉంటుందని అన్నారు. ఇటీవలే ఇద్దరు చెక్ పరిశోధకులు ఇలా అభిప్రాయ పడ్డారు : వాల్యుయేషన్‌లను నిర్ణయించడానికి ఇమిడి ఉన్న విలువపై అధికంగా ఆధారపడడం ప్రమాదకరం. దానికి బదులుగా వారు సూచించేదేమంటే, భీమా వ్యాపారం విలువ యొక్క మెరుగైన అంచనాను పొందడానికి ఇమిడిఉన్న విలువకి అదనంగా మరో పద్ధతిని ఉపయోగించవచ్చు.

ఎల్ఐసి విషయంలో ఇమిడి ఉన్న విలువ లెక్కింపు నుండి తప్పించుకున్న అత్యంత అద్భుతమైన అంశాలలో ఒకటి, మిల్లిమాన్ తన లెక్కింపులో ఎల్ఐసి ఆధీనంలో ఉన్న ఆస్తుల విలువను పూర్తిగా వదిలివేసింది. ఇలా వదిలివేయడం చాలా ఆశ్చర్యకరంగా ఉంది ఎందుకంటే ఎల్ఐసి అన్ని భారతీయ మెట్రోలు మరియు పెద్ద నగరాల్లోనే కాకుండా దేశం యొక్క నలుమూలల్లో అత్యంత విలువైన ఆస్తులు కలిగిఉన్న భారతదేశపు అతిపెద్ద రియల్టర్. ఎల్ఐసి యొక్క రియల్ ఎస్టేట్ ఆస్తుల విలువ ఎంత అనేదానిపై విశ్వసనీయమైన అంచనాలు లేవు. కానీ కొందరు ఈ విలువను అనేక లక్షల కోట్ల రూపాయలుగా పేర్కొన్నారు, ఇది మిల్లిమాన్ అంచనా వేసిన ఇమిడి ఉన్న విలువ కంటే చాలా ఎక్కువ.

ఎల్ఐసి ఈ ఆస్తుల విలువను ఎన్నడూ అంచనా వేయలేదు. ఎందుకంటే దానికి అటువంటి అవసరం రాలేదు. ఈ ఆస్తులను సంపాదించటంలో ఎటువంటి పాత్ర పోషించని కొత్త యజమానులకు కేవలం కొత్త యజమానులుగా ఉండటం ద్వారా ఎల్ఐసి ఆధీనంలో ఉన్న ఆస్తులపై వారు ఇప్పుడు హక్కు కలిగి ఉంటారు. ఇది తక్కువ వాల్యుయేషన్ వల్ల కొత్త యజమానులకు నేరుగా కలిగే ప్రయోజనం, ప్రైవేట్ సంస్థలకు అనుకూలంగా ప్రభుత్వ వాటాను తక్కువ చేయడం వల్ల జరిగిన పరిణామం.

**“ ఎల్ఐసి ఈ ఆస్తుల విలువను ఎన్నడూ అంచనా వేయలేదు ఎందుకంటే దానికి అటువంటి అవసరం రాలేదు. ఈ ఆస్తులను సంపాదించటంలో ఎటువంటి పాత్ర పోషించని కొత్త యజమానులకు కేవలం కొత్త యజమానులుగా ఉండటం ద్వారా ఎల్ఐసి ఆధీనంలో ఉన్న ఆస్తులపై వారు ఇప్పుడు హక్కు కలిగి ఉంటారు. తక్కువ వాల్యుయేషన్ వల్ల కొత్త యజమానులకు ఈ విధంగా ప్రయోజనం కలుగుతుంది. ”**

**తక్కువగా మూల్యంకనం చేయటం, పాలసీదారుల హక్కుల హరణం**

DRHPలో స్పష్టంగా కనిపించే వాస్తవమేమంటే, లక్షలాది మంది ప్రస్తుత పాలసీదారుల హక్కులను హరించిన విధానం. వాస్తవానికి ఎల్ఐసి యొక్క ఇమిడి ఉన్న విలువలో ఆకట్టుకునే పెరుగుదల – మార్చి 2021లో రూ. 0.96 లక్షల కోట్లు నుండి రూ. సెప్టెంబరు 2021లో 5.40 లక్షల కోట్లు (ఆరు నెలల్లోపు) ఎల్ఐసి చట్టంలో చేసిన మార్పులవల్ల వచ్చింది.

ఈ మార్పులు ఒక దెబ్బతో పార్టిసిపేటరీ పాలసీలు ఉన్నవారు మిగులు కోల్పోయేలా చేస్తుంది, ఇంతకుముందు వీరు నాన్ పార్టిసిపేటరీ పాలసీ మీద వచ్చే మిగులులో 95 శాతంకి అర్హులు. వీరికి ఈ లాభం ఎందుకువచ్చేదంటే ఈ పాలసీలతో ఉన్న రిస్క్ వారు తీసుకుంటారు.

పాలసీదారుల హక్కులను లాక్కోవడం వల్ల, వాటిని "వాటాదారులకు" బదిలీ చేయడం ద్వారా మాత్రమే ఇమిడి ఉన్న విలువలో విపరీతమైన పెరుగుదల సాధ్యమైంది. ఇవిలో పెరుగుదల, వాటాదారుల అధికారానికి కొలమానం. ఈ పెరుగుదల వారి పొదుపులను ఇక్కడ దాచివుంచిన కోట్లాది మంది పాలసీదారుల హక్కుల హరణపై స్పష్టంగా ఆధారపడి ఉంటుంది.

ఈ కోణంలోంచి చూస్తే, తక్కువ వాల్యుయేషన్ అనేది రెండు అంశాలలో కుంభకోణం అవుతుంది. ఒకటి, ఇది ఐపిఓ నుండి ప్రభుత్వం సంపాదించే "ఆదాయాలను" కోల్పోతుంది. కానీ మరీ ముఖ్యంగా ఇది పాలసీదారుల హక్కులను హరించి, దశాబ్దాలుగా ఎల్ఐసిని నిర్మించడంలో మరియు పెంపొందించడంలో ఎలాంటి పాత్ర పోషించని ప్రైవేట్ సంస్థలకు లాభాలను బదిలీ చేస్తుంది.

గత కొన్ని రోజులుగా మీడియా గాసిప్ చెబుతున్నదేమంటే మోడీ ప్రభుత్వం పరిశీలిస్తున్న తగ్గింపుల వెనుక అంతర్జాతీయ "పెట్టుబడిదారులు" ఉన్నారు. ఐపిఓలోని ఎల్ఐసి స్టాక్‌ని ఈ భావి "కొనుగోలుదారులు", ముఖ్యంగా "యాంకర్ ఇన్వెస్టర్లు" (ప్రజలకు అందుబాటులోకి రాకముందే ఐపిఓలో పెట్టుబడి పెట్టే పెట్టుబడిదారుడు) అని పిలవబడే వారు, ధర ఎంత ఉండాలో ప్రభుత్వానికి చెప్పడం విడ్డూరం మరియు దిగ్భ్రాంతికరమైనది కాదా? మార్కెట్‌లో ధరలు "స్వేచ్ఛ"గా నిర్ణయించబడి విక్రయం జరుగుతున్నట్లు పేర్కొనడం హాస్యాస్పదం కాదా?

**ఎల్ఐసి యొక్క నిజమైన యజమానులు ఎవరు?**

మీడియాలోని పండితులు, ఎల్ఐసి కథనంలోని అతి పెద్ద ప్రశ్నను జాగ్రత్తగా వదిలేశారు. వీరు ప్రభుత్వం పట్ల చాలా సానుభూతితో ఉన్నారు, అందుకే తక్కువ వాల్యుయేషన్ అనేది పూర్తిగా ప్రభుత్వ నియంత్రణకు బయట ఉన్న కారకాల ఫలితమని వాదించారు. ఈ వాదన అంత తెలివైనది కూడా కాదు. ఒకటి, ఎవరైనా ఎల్ఐసి ఐపిఓ ఆలోచనతో అంగీకరించినప్పటికీ, మూడు నెలల కంటే తక్కువ వ్యవధిలో అత్యంత తక్కువగా తగ్గింపు చేసిన వాల్యుయేషన్‌తో ఎవరైనా ఎందుకు అంగీకరిస్తారు?

**(మిగతా 31వ పేజీలో)**




epaper.prajasakti.com

సిద్ధాంతం

# తీవ్రమౌతున్న సామాజిక వైరుధ్యాలు

**బి.టి.రణదివె**



రచయిత సిపిఐ(ఎం) మాజీ పొలిట్ బ్యూరో సభ్యులు, సిఐటియు అగ్రనాయకులు

*(మార్చి నెల తరువాయి)*

రాజ్యాంగం, ఫ్యూడల్ సంస్థానాలను విలీనం చేసుకోవటం ద్వారా భారతదేశ ఐక్యతను సాధించినప్పటికీ జాతీయోద్యమ విజయోత్సాహపు వెల్లువ వెనుకపట్టు పట్టటంతో ప్రజలు, పాలకవర్గాలను ఐక్యత, ప్రజాస్వామ్యానికి సంబంధించిన సమస్యలు చుట్టుముట్టాయి. స్వాతంత్ర్యపోరాట కాలంలో వెనుకపట్టు పట్టిన భారత సమాజంలోని సామాజిక వైరుధ్యాలు తీవ్రమౌతున్నాయి. భారతదేశ ఐక్యతకు సంబంధించిన సమస్యలను శాశ్వతంగా పరిష్కరించామని భావించిన బూర్జువా నాయకత్వానికి దెబ్బ మీద దెబ్బ తగలటం ప్రారంభమైంది. అల్పసంఖ్యాకులను విలీనం చేసుకోవటం, ఉమ్మడి జాతీయ జీవనంపై వారిలో విశ్వాసం కలిగించటం, అందరికీ సమాన హోదా కల్పించటం పరిష్కరించటం సాధ్యం కానివిగా మారుతున్నాయి. సంస్థానాలను నిర్మూలించటం జాతుల సమస్యను పరిష్కరించలేదు. భారతదేశ ఐక్యతను సవాలు చేస్తూ రాష్ట్రాలు స్వాతంత్ర్యాన్ని కోరుతున్నాయి. పక్షవాతం వచ్చిన విధంగా ఉన్న ప్రభుత్వం శక్తివంతంగా వ్యవహరించలేని స్థితిలో ఖలిస్థాన్, అస్సాం, మిజోరం, గూర్ఖాలాండ్ ఆందోళనలు ఒకదాని తర్వాత మరొకటి సవాలు విసురుతున్నాయి. ఈ పరిణామాలు మతోన్మాద, వేర్పాటువాద శక్తులను ప్రోత్సహించటం ద్వారా జోక్యం చేసుకోవటానికి సామ్రాజ్యవాదులకు అవకాశాన్నిచ్చాయి. ముఖ్యమైన సమస్యలను పరిష్కరించటంలో బూర్జువా-భూస్వామ్యవర్గ ప్రభుత్వ దివాళాకోరుతనాన్ని ఈ పరిణామాలు నిరంతరం వెల్లడి చేస్తున్నాయి.

పెట్టుబడిదారి మార్గంలో సాగుతున్న బూర్జువా-భూస్వామ్యవర్గ ప్రభుత్వానికి దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటంలో ఉన్న పరిమితులు కాలం గడిచేకొద్దీ స్పష్టంగా వెల్లడౌతున్నాయి. వ్యవసాయక విప్లవాన్ని పూర్తి చేయకుండా స్వతంత్ర ఆర్థికవ్యవస్థ కోసం ప్రణాళిక రూపొందించటంలో ఉన్న పరిమితులను ఇంతకు ముందే వేరే వ్యాసంలో పరిశీలించాం. ఈ పరిమితులు ఆర్థికాభివృద్ధికి మాత్రమే పరిమితం కాలేదు. జాతీయ జీవనంలోని ప్రతి అంశం దీనితో ప్రభావితమైంది. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, జాతీయ ఐక్యత, లౌకికవాదం, సమగ్రత, ప్రతిరంగంలోనూ తిరోగమనం సంభవించింది.

ఆగస్టులో జరిగిన కేంద్రకమిటి సమావేశం పేర్కొన్నట్లుగా రాజీవ్‌గాంధి ప్రభుత్వం దేశం విచ్ఛిన్నం అయ్యే పరిస్థితులను తుదికంటా తీసుకుపోతున్నది. జాతీయ జీవనాన్ని ఆధునీకరించటంలో ఎదురయే సమస్యలను పరిష్కరించటంలో భారత పాలకవర్గాల అశక్తతలోనే ఇందుకు పునాదులు ఉన్నాయి. 1960లో జరిగిన కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల సమావేశం ఈ విధంగా చెప్పింది, ‘ రాజకీయ స్వాతంత్ర్యం సాధించుకున్న తర్వాత ప్రజలు తమ జీవితంలో ఎదురౌతున్న సామాజిక సమస్యలు, జాతీయ స్వాతంత్ర్యాన్ని బలపరచుకోవటంలో ఎదురౌతున్న సమస్యలను పరిష్కరించుకోవటానికి ప్రయత్నిస్తారు. వివిధ రాజకీయ పార్టీలు, వర్గాలు ఈ సమస్యలకు వివిధ రకాలైన పరిష్కారాలను సూచిస్తాయి. సామాజిక వైరుధ్యాలు తీవ్రమౌతున్నకొద్దీ జాతీయ బూర్జువావర్గం, దేశీయంగా ఉన్న ప్రతీఘాతుక శక్తులు సామ్రాజ్యవాదంతో రాజీ పడటానికి మొగ్గుచూపుతాయి’. భారతదేశంలో ఖచ్చితంగా ఇదే జరుగుతున్నది. దేశంలో వర్గ వైరుధ్యాలు తీవ్రమౌతున్నకొద్దీ ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని రూపొందించిన వారే దాని పనితీరునుకుదించటానికి, బలహీనపరచటానికి తీరికలేకుండా ప్రయత్నం చేస్తున్నారు. పెరుగుతున్న ఈ వైరుధ్యాలతో పాటు ఆర్థిక సమస్యలను స్వతంత్రంగా పరిష్కరించటంలో విఫలమైనవారు ప్రపంచబ్యాంకు విధిస్తున్న కఠినమైన షరతులను అమలు చేయటానికి అంగీకరిస్తున్నారు. రాజీవ్‌గాంధి ప్రభుత్వరంగాన్ని విచ్ఛిన్నం చేయటానికి అంగీకరించటం, నూతన ఆర్థిక విధానాల అమలు వలన కంట్రోళ్ళు, లైసెన్సులు, రెగ్యులేషన్‌లను రద్దు చేయాలని నిరంతరం ఒత్తిళ్ళు వస్తున్నాయి. తమ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించాలని, భారీగా రాయితీలు ఇవ్వాలని పశ్చిమదేశాలు చేస్తున్న ఒత్తిడిని ప్రతిఘటిస్తున్న పెట్టుబడిదారులు అదే సమయంలో వారిపై ఆధారపడటం పెరిగే విధానాలను అనుసరించిన క్రమానికి ఇది చరమాంకంగా ఉన్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ క్షీణించిపోతున్న పరిస్థితులలో, పెట్టుబడిదారీ సమాజాన్ని నిర్మించటానికి ప్రయత్నం చేయటం వలన ఎదురౌతున్న పరిమితులు రెండు శిబిరాల మధ్య సమతూకంతో వ్యవహరిస్తూ, బేరసారాలాడేందుకు ఉన్న అవకాశాలను కుదింపజేస్తున్నాయి. కాబట్టి నాలుగు దశాబ్దాల స్వాతంత్ర్యానంతరం సామ్రాజ్యవాదులపై ఆధారపడకుండా స్వేచ్ఛగా వ్యవహరించటానికి మారుగా ఆర్థికవ్యవస్థ మరింత లోతుగా ప్రపంచబ్యాంకు ఉచ్చులోకి జారిపోతున్నది. నూతన ఆర్థిక విధానాలను వేగంగా అమలుచేయాలని, తమకు మరిన్ని రాయితీలు ఇవ్వాలని గత కొద్ది మాసాల నుండి ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతున్నది.




epaper.prajasakti.com

> 1986, డిసెంబరులో ప్రపంచబ్యాంకు విడుదల చేసిన నివేదిక పారిశ్రామిక సంస్థల ఉత్పత్తి పరిమాణాన్ని నియంత్రించే విధానంపై దాడిచేసింది. లైసెన్సింగ్ విధానాన్ని రద్దుచేయటం, గుత్తసంస్థలపై ఉన్న పరిమితులను సడలించటం, విదేశీ పెట్టుబడులకు మరింతగా ప్రోత్సాహాన్నివ్వటం, విదేశాల నుండి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవటం తదితరాలు నూతన విధానంలో ఉన్నట్లు వెల్లడౌతున్నది.

51 శాతం విదేశీ పెట్టుబడులున్న సంస్థలకు దేశీయ సంస్థల హోదా ఇచ్చి, దేశీయ కంపెనీలకు ఇస్తున్న రాయితీలు, సదుపాయాలను వాటికి కూడా ఇవ్వాలని విదేశీ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తూ అసోచామ్ ఈ మధ్యనే డిమాండ్ చేసింది. ప్రస్తుతం విదేశీ పెట్టుబడులు 40 శాతానికి మించకుండా ఉన్న కంపెనీలకు మాత్రమే అటువంటి హోదాను ఇస్తున్నారు. ఈక్విటీని పెంచటం, జాతీయ హోదాను ఇవ్వటం ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దేశంలోకి వస్తుందని వాదిస్తున్నారు. భారతీయ, విదేశీ కంపెనీల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూర్తిగా రద్దుచేయటం కోసం ఉద్దేశ్యపూర్వకంగా చేస్తున్న డిమాండ్ ఇది. దీని వలన దేశీయ కంపెనీల రక్షణ కోసం తీసుకుంటున్న చర్యల ద్వారా విదేశీ కంపెనీలు లాభపడటం, దేశీయ కంపెనీలు నష్టపోవటం జరుగుతుంది.

నూతన ఆర్థిక విధానాలను అమలు చేయటానికి, విదేశీ పెట్టుబడులను దేశంలోకి స్వేచ్ఛగా అనుమతించటానికి ప్రభుత్వం అంగీకరించినప్పటికీ వాటిని యధాతథంగా అమలు చేయలేకపోతున్నది. అదే సమయంలో వాటిని పూర్తిగా తిరస్కరించటానికి సాహసించటం లేదు. కాబట్టి ఈ విధమైన డిమాండ్లను వ్యతిరేకిస్తూనే, 40 శాతం విదేశీ పెట్టుబడుల పరిమితిని కఠినంగా అమలుచేయటానికి సిద్ధపడకుండా, అవసరమైనపుడు మినహాయింపులు ఇవ్వటానికి సిద్ధపడుతున్నది. అంశాల వారీగా మినహాయింపులు ఇవ్వటానికి సిద్ధపడిన ప్రభుత్వ విధానం దాదాపుగా అసోచామ్ చేస్తున్న డిమాండ్‌ను నెరవేర్చేదిగా ఉన్నది. విదేశీ పెట్టుబడులకు జాతీయ హోదా, పరిమితి పెంపు కోసం డిమాండ్ చేయటానికి వీరు సన్నద్ధమౌతున్నారు.

గత పారిశ్రామిక విధాన తీర్మానాలకు మౌలికంగా భిన్నమైన నూతన పారిశ్రామిక విధాన ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఇందులోని కొన్ని అంశాలు గత విధానాల కన్నా తిరోగమనంలో ఉన్నాయి. దేశం ఆర్థికాభివృద్ధిని సాధించటంలో ప్రభుత్వరంగం నిర్ణయాత్మకమైన స్థానంలో ఉండాలని ప్రారంభ సంవత్సరాలలో జాతీయ నాయకులు కన్న కలలను వమ్ముచేసే అంశాలు ప్రతిపాదిత తీర్మానంలో ఉన్నాయి. ప్రపంచబ్యాంకు డిమాండ్ చేస్తున్న కంట్రోళ్ళను తొలగించటం కూడా దీనిలో ఉన్నది. 1986, డిసెంబరులో ప్రపంచబ్యాంకు విడుదల చేసిన నివేదిక పారిశ్రామిక సంస్థల ఉత్పత్తి



1985లో శ్రీనగర్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు

పరిమాణాన్ని నియంత్రించే విధానంపై దాడిచేసింది. లైసెన్సింగ్ విధానాన్ని రద్దుచేయటం, గుత్తసంస్థలపై ఉన్న పరిమితులను సడలించటం, విదేశీ పెట్టుబడులకు మరింతగా ప్రోత్సాహాన్నివ్వటం, విదేశాల నుండి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవటం తదితరాలు నూతన విధానంలో ఉన్నట్లు వెల్లడౌతున్నది. ఈ పత్రంలో పొందుపరచిన విధానాల వలన 200 నుండి 300 భారీ సంస్థలపై మాత్రమే పరిమితులు విధించటం సాధ్యమౌతుంది.

భారతదేశంలో పారిశ్రామిక క్రమబద్ధీకరణ విధానానికి సంబంధించి ప్రపంచబ్యాంకు 1986, డిసెంబరులో విడుదల చేసిన నివేదికలో ఈ దిగువ డిమాండ్లు చేసింది. 'లైసెన్స్‌ల ద్వారా ఉత్పత్తిని పెంచుకోవటంపై విధించిన పరిమితులను వెంటనే తొలగించాలి. లైసెన్స్ విధానం ద్వారా పరిమితులు విధించే పరిశ్రమల సంఖ్యను గణనీయంగా తగ్గించాలి. సాంకేతిక పరిజ్ఞానం, విదేశీ పెట్టుబడులకు లైసెన్స్‌ల క్రమాన్ని సరళతరం చేయాలి. వాణిజ్యాన్ని కుదించే విధానాలపై కేంద్రీకరణ పెంచాలి. వ్యక్తిగత సంస్థల పరిమాణం, పారిశ్రామిక మార్కెట్‌కు సంబంధించిన కొన్ని వ్యవస్థాగత అంశాలపై కేంద్రీకరణను తగ్గించాలి. చిన్న పరిశ్రమలకు ఉన్న రిజర్వేషన్లను రద్దుచేయాలి. చిన్న పరిశ్రమల ఆధునీకరణ, పెరుగుదలను ప్రోత్సహిస్తూ, అనవసర కార్యకలాపాలను వదులుకునేలా చేయాలి. రుణాలివ్వటంపై కఠినమైన ఆంక్షలున్న పరిస్థితులలో ఆస్తులను బదలాయించటం, కార్మికులను (తగిన పరిహారం ఇచ్చి) ఇతర చోట్లకు తరలించటాన్ని సులభతరం చేయాలి. ఖాయిలా పడిన పరిశ్రమలను స్వాధీనం చేసుకోనని ప్రభుత్వం ఇచ్చిన హామీని ఖచ్చితంగా నెరవేర్చాలి. పారిశ్రామిక సరుకుల ధరలపై ఉన్న నియంత్రణలను క్రమంగా సడలించాలి. ధరలను అదుపు చేయటం వలన పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలు, పోటీతత్వంపై పడే ప్రభావాలపై కేంద్రీకరించాలి. వీటితో పాటు



epaper.prajasakti.com

" దళితులు, దిగువకులాలకు చెందిన వారికి ఏమీ దక్కలేదు. బలమైన విప్లవకర రైతాంగ ఉద్యమం భూమిని స్వాధీనం చేసుకుని, కులాలతో నిమిత్తం లేకుండా పంచేస్థితిలో లేనపుడు ఈ విధంగా జరగటం అనివార్యం. ఫలితంగా అత్యంత క్షీణస్థితిలో ఉన్న ఫ్యూడల్ సంబంధాలు అధిపత్యం చలాయించటంతో గ్రామాలలో కులాధిపత్యం, కులపీడన పెరిగింది. కేంద్ర ప్రభుత్వం, బూర్జువా నాయకత్వం తర్వాతి కాలంలో చేసిన భూపంపకం బూటకంగా మిగిలిపోయింది. "

దిగుమతుల పోటీని ఎదుర్కొని, ఎగుమతులను ప్రోత్సహించేందుకు వాణిజ్యం, ద్రవ్య విధానాలలో అవసరమైన మార్పులు తీసుకురావాలి'.

ప్రపంచబ్యాంకు ప్రభుత్వంపై వత్తిడిని పెంచుతుండగా, మరోవైపు అమెరికా ప్రభుత్వం కూడా వత్తిడిని తీవ్రం చేసింది. సూపర్ కంప్యూటర్, భారత యుద్ధ విమానాలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కోసం జరుగుతున్న చర్చలు ముగింపు లేకుండా కొనసాగుతున్నాయి. వాటిని ఇవ్వటానికి దేశవ్యతిరేకమైన షరతులు విధించటంతో చర్చలు ముందుకు సాగటం లేదు. సూపర్ కంప్యూటర్, యుద్ధ విమానాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇవ్వటానికి నూతన ఆర్థిక విధానాల ద్వారా ఇస్తున్న రాయితీలు, పరిమితులను సడలించటంలో రాజీపడటం, వాణిజ్య సరళీకరణలు అమెరికాకు సరిపోలేదు. మన ఆర్థికవ్యవస్థ, ఇతర రంగాలపైనా అమెరికా వత్తిడి పెరుగుతున్నది. స్వాతంత్ర్యం సాధించిన తర్వాత మనం ప్రారంభించిన ప్రయాణం ఇక్కడి దాకా సాగింది!

రాజీవ్‌గాంధి అనుసరిస్తున్న విధానాలు మాత్రమే పశ్చిమదేశాలపై మనం ఆధారపడే ప్రమాదం పెరగటానికి కారణం కాదు. ఈ క్రమం ఇంతకు ముందే ప్రారంభమై కొనసాగుతున్నది. దేశీయ పరిశ్రమల పోటీతత్వాన్ని పెంచటం, ఖర్చులను తగ్గించటం కోసమంటూ బహుళజాతి కంపెనీల సేచ్ఛా ప్రవేశానికి మూర్ఖంగా అంగీకరించారు. రాజీవ్‌గాంధి అనుసరిస్తున్న విధానాలు ఈ క్రమాన్ని వేగవంతం చేయటంతో పాటు ప్రతిరోజూ నూతన ప్రమాదాలను సృష్టిస్తున్నవి. గతంలో అనుసరించిన విధానాల లక్ష్యాలు, ప్రాధాన్యతల నుండి ఇవి పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గాన్ని ఎంచుకున్న తర్వాత పశ్చిమదేశాల పెట్టుబడులపై ఆధారపడటం అనివార్యం. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో ఉన్న కాలంలో వెనుకబడిన దేశంలోని ఆర్థిక వ్యవస్థను అభివృద్ధికర దిశలో పునర్వ్యవస్థీకరణ చేయటంలో పెట్టుబడిదారీ మార్గం అశక్తత చారిత్రకంగా రుజువయింది.

అన్ని విధాలైన ఫ్యూడల్ సంబంధాలను అంతం చేయటానికి, వ్యవసాయిక సంబంధాలను పునర్వ్యవస్థీకరించి రైతాంగానికి స్వేచ్ఛ కల్పించటానికి బూర్జువా నాయకత్వం తిరస్కరించటం భారతదేశ ఆర్థికవ్యవస్థ పెట్టుబడిదారీ మార్గంలో పురోగమించటంపై మరిన్ని పరిమితులు విధించింది. ఫ్యూడల్ ప్రభువులు, భూస్వాముల ఆర్థిక, రాజకీయ అధికారాలను కుదించటానికి ప్రారంభంలో తీసుకున్న కొన్ని చర్యలు మినహా తర్వాతి కాలంలో వారి అధికారాలను తగ్గించే చర్యలు నిలిపివేశారు. భారతదేశంలో ఉన్న పరిస్థితులలో చట్టబద్ధ భూస్వామ్య విధానాన్ని రద్దుచేసిన తర్వాత చేపట్టిన భూపంపకం కష్టజీవులైన రైతుల జీవితాలలో పెద్దమార్పు తీసుకురాలేదు. దానిలో ఎక్కువ భాగం అంతకు ముందునుండి కౌలుదార్లుగా ఉన్నవారు స్వంతం చేసుకున్నారు. వారిలో కొందరు పై కులాల నుండి వచ్చినవారు, మంచి స్థితిలో ఉన్నవారున్నారు. దళితులు, దిగువకులాలకు చెందిన వారికి ఏమీ దక్కలేదు. బలమైన విప్లవకర రైతాంగ ఉద్యమం భూమిని స్వాధీనం చేసుకుని, కులాలతో నిమిత్తం లేకుండా పంచేస్థితిలో లేనపుడు ఈ విధంగా జరగటం అనివార్యం. ఫలితంగా అత్యంత క్షీణస్థితిలో ఉన్న ఫ్యూడల్ సంబంధాలు అధిపత్యం చలాయించటంతో గ్రామాలలో కులాధిపత్యం, కులపీడన పెరిగింది. కేంద్ర ప్రభుత్వం, బూర్జువా నాయకత్వం తర్వాతి కాలంలో చేసిన భూపంపకం బూటకంగా మిగిలిపోయింది. భూమిలేని గిరిజనులు, దళితులు భూములు పొందలేకపోయారు. కేంద్రంలోని కాంగ్రెస్(ఐ) ప్రభుత్వం తర్వాత కాలంలో భూపంపకం గురించి మాట్లాడటం మానివేసింది. అత్యవసర పరిస్థితిలో ప్రకటించిన 20 సూత్రాల కార్యక్రమంలో భూమిలేనివారికి ఇళ్ళస్థలాలను ఇవ్వాలని మాత్రమే ప్రతిపాదించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూసంస్కరణల చట్టాలు గ్రామీణప్రాంతంలోని విస్తారమైన ప్రజానీకానికి భూమిని నిరాకరించటం, కొద్దిమంది చేతులలో ఎక్కువ భూమి(4 శాతం మంది చేతుల్లో 26 శాతం భూమి ఉన్నది) కేంద్రీకృతం కావటానికి దారితీశాయి. భూమిని ఇవ్వకపోవటం అంటే ఉద్యోగాలు, జీవనోపాధిని తిరస్కరించటమే అవుతుంది. సాంప్రదాయక పరిశ్రమలు, వృత్తులు వేగంగా నాశనం అవుతున్న స్థితిలో గ్రామీణ ప్రాంతంలోని పరిస్థితులు మరింత దిగజారటానికి ఇది దారితీసింది. గ్రామీణ ప్రాంతంలో నిరుద్యోగులు, దరిద్రుల సంఖ్య విస్తారంగా పెరిగింది. ఇది ఆధునిక పరిశ్రమలలో తయారైన సరుకులకు మార్కెట్‌ను కుదించటం, దాని అభివృద్ధికి పరిమితులను విధించటంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో విస్ఫోటక పరిస్థితులను సృష్టించింది. గిరిజనులు, దళితులు, వెనుకబడిన తరగతులు, రైతులపై దారుణమైన అణచివేత జరగటానికి, స్వాతంత్ర్యానంతరం ప్రతి సంవత్సరం అత్యాచారాలు పెరుగుతుండటానికి పూర్వరంగం ఇది. ఈ అత్యాచారాలు చేయటంలో భూస్వాములు, భూ యజమానులకు స్థానిక పోలీసులు పూర్తి తోడ్పాటును ఇస్తున్నారు. పోలీసులలో ఎక్కువభాగం అదే పై కులాల నుండి రావటం (కనీసం అధికారులైనా భూస్వాముల కులాలు, వర్గాల నుండే వస్తున్నారు) తో ఈ తరగతులలో అసంతృప్తితో ఉన్న, పోరాడుతున్న రైతాంగాన్ని అణచివేయటం, భయభ్రాంతులకు గురిచేయటం, హత్యాకాండను కొనసాగించటం చేస్తున్నారు. పోలీసు యంత్రాంగాన్ని ప్రైవేటీకరించటం, వారు తరచుగా భూస్వాముల హింసాకాండలో పనిముట్లుగా ఉపయోగపడటం బీహార్‌లో స్పష్టంగా కనిపిస్తున్నది. గ్రామీణ ప్రజానీకంపై జరుగుతున్న అణచివేతను కులపరమైన ఘర్షణలుగా చూపిస్తూ, వర్గ అణచివేతతో దానికి సంబంధం లేదని చెబుతున్నారు. వామపక్ష ప్రభుత్వాలు ఉండి, అదుపు



epaper.prajasakti.com

చేస్తున్నచోట మినహా మిగతా దేశమంతా ఈ హింసాకాండ కొనసాగుతున్నది.

గతకొన్ని దశాబ్దాలలో విస్తారమైన గ్రామీణ ప్రజానీకం ఏ విధమైన ప్రజాస్వామిక హక్కులు లేకుండా కట్టుబానిసలుగా మార్చబడ్డారన్న విషయం అతి తక్కువగా మాత్రమే గుర్తించబడుతున్నది. బీహార్‌లోని కొన్ని ప్రాంతాలలో ఓటుహక్కు వినియోగించుకోవటానికి కూడా వారిని అనుమతించరు. భూస్వాములకు ఏజంట్లుగా ఉన్నవారు భూస్వాముల అభ్యర్థులకు వారి ఓట్లు పడేవిధంగా ఏర్పాట్లు చేస్తారు.

**ప్రజాస్వామిక హక్కులను తిరస్కరించటం పెరుగుతున్నది**

ఈ విధమైన పరిణామాల నేపథ్యంలో ప్రాథమిక, ప్రజాస్వామ్య హక్కులు అమలు చేయటానికి ఉన్న అవకాశాలు ఏమిటి? కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూసంస్కరణలు రాజ్యాంగంలో గ్యారంటీ చేసిన హక్కులను ఫార్సుగా మార్చాయి. గ్రామీణ ప్రాంతంలో తీవ్రమైన అసంతృప్తి పెరుగుతున్న పరిస్థితులలో ప్రాథమిక హక్కులను అమలుచేస్తారని ఎవరు భావిస్తారు? కాంగ్రెస్ ప్రభుత్వకాలంలో ప్రాథమిక హక్కులను నిరాకరించటం, అణచివేయటం, వాటిని చిత్తు కాగితాలుగా మార్చటం గ్రామీణ ప్రాంతంలో ఆధిపత్యం వహిస్తున్న పాలకవర్గాలకు జీవన్మరణ సమస్యగా మారింది. ప్రజలకు ప్రాథమిక, ప్రజాస్వామిక హక్కులను ఇవ్వటం ప్రమాదం కాదని, ఇవి తమను మరింత బలవరుస్తాయని పాలకవర్గాలకు గతంలో ఉన్న నమ్మకం పోయింది.

దీనితో పాటు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న వారు గతంలోని నాయకుల వలె ప్రజలు తమ స్వంత నాయకులుగా భావించిన, విస్తారమైన పలుకుబడి కలిగిన వారు కాదు. గత దినాలలో వలె కాంగ్రెస్(ఐ) ప్రజల మద్దతును పొందటం లేదు. ప్రజల కార్యకలాపాలను అదుపుచేయటం, కుదించటంలో విఫలమౌతున్నది. సైద్ధాంతిక, రాజకీయ పలుకుబడి ద్వారా ప్రజలు వర్గ పోరాటాలలో పాల్గొనకుండా నిరోధించటంలో విఫలమవటంతో వారి ప్రాథమిక, ప్రజాస్వామిక హక్కులను అణచివేస్తున్నది. దేశంలోని గ్రామీణప్రాంతాలలోని ఎక్కువభాగంలో ఉన్న విస్తారమైన ప్రజానీకానికి ఓటువేసే హక్కు మినహా ఇతర ప్రజాస్వామిక హక్కులేమీలేవు.

> **" కేరళలో 1957లో ఇఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి దాడి జరిగింది. తమకు వ్యతిరేకమైన వర్గశక్తి విసిరిన మొదటి సవాల్‌ను మొగ్గలోనే తుంచేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహం, కాంగ్రెస్ పార్టి భాగస్వామ్యంతో ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పును తోసిపుచ్చి, ముస్లీంలీగ్, క్యాథలిక్ చర్చి తదితర మతోన్మాద శక్తులను కూడగట్టి, బహిరంగంగా తిరుగుబాటును ప్రారంభించారు. "**

స్వాతంత్ర్యానంతరం 40 సంవత్సరాల కాలంలో భారత ప్రజలలో ఎక్కువ భాగం క్రమంగా తమ ప్రజాస్వామిక హక్కులను కోల్పోయారు. ఈ కాలంలో రాజ్యాంగంపై దాడులు పెరగటం కొనసాగింది. నూతనంగా విముక్తి పొందిన వెనుకబడిన దేశంలోని బూర్జువావర్గ ప్రయోజనాలకు సరిపడవని స్పష్టమవటంతో రాజ్యాంగంలోని ప్రమాణాలన్నింటినీ ఉల్లంఘిస్తున్నారు. భూస్వాములతో మైత్రి నెరపుతున్న వారికి పూర్తిగా ఫ్యూడల్ వ్యతిరేక విప్లవాలతో రూపొందిన పశ్చిమదేశాల రాజ్యాంగాల నుండి తీసుకున్న ప్రజాస్వామ్య సూత్రాలు ప్రమాదకరంగా మారటం ప్రారంభమైంది.

కేరళలో 1957లో ఇఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి దాడి జరిగింది. తమకు వ్యతిరేకమైన వర్గశక్తి విసిరిన మొదటి సవాల్‌ను మొగ్గలోనే తుంచేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహం, కాంగ్రెస్ పార్టి భాగస్వామ్యంతో ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పును తోసిపుచ్చి, ముస్లీంలీగ్, క్యాథలిక్ చర్చి తదితర మతోన్మాద శక్తులను కూడగట్టి, బహిరంగంగా తిరుగుబాటును ప్రారంభించారు. ప్రజాస్వామ్యవాది అయిన నెహ్రూ నాయకత్వంలోనే ఇందుకు ప్రణాళికను రూపొందించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, మౌలిక సూత్రాల కన్నా వర్గ ప్రయోజనాలే ప్రధానమని రుజువుచేశారు. కాని తర్వాత కాలంలో వ్యవహరించనట్లుగా హఠాత్తుగా మంత్రివర్గాన్ని రద్దుచేయలేదు. మంత్రివర్గాన్ని రద్దు చేయాలంటూ విముక్తి పోరాటాన్ని ప్రారంభించి, అందుకవసరమైన పరిస్థితులను సృష్టించారు.

ఇది కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా మాత్రమే కాంగ్రెస్ ఉపయోగిస్తున్న ఆయుధమని అనేకమంది సోషలిస్టులు, ఇతరులు భావించారు. కమ్యూనిజం నుండి దేశాన్ని కాపాడటం కోసమంటూ కొంతమంది ఈ చర్యను స్వాగతించారు కూడా. నెహ్రూ నాయకత్వంలో భారతదేశంలో స్థిరమైన ప్రభుత్వం ఉందని అంతర్జాతీయ ప్రతీఘాతుక శక్తులు ఈ చర్యను సమర్ధించాయి. నెహ్రూ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగానైనా, రాజ్యాంగవ్యతిరేక పద్ధతులలోనైనా కమ్యూనిస్టులు విసురుతున్న సవాలును తిప్పికొడుతుందని వారు అర్థం చేసుకున్నారు.

ఈ విధంగా నిరంకుశంగా ప్రభుత్వాలను రద్దుచేసే విధానాన్ని ఇతర బూర్జువా ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలపై కూడా ప్రయోగిస్తారని తర్వాతి కాలంలో జరిగిన పరిణామాలు స్పష్టం చేశాయి. రాజ్యాంగం, ఎన్నికల విధానాన్ని బలిచేసి, అధికారంపై తన గుత్తాధిపత్యాన్ని నిలబెట్టుకోవటానికి పాలకపార్టి చేసిన ప్రయత్నం ఇది. ఆర్భాటంగా రాజ్యాంగాన్ని ప్రకటించినప్పటికీ, అది ఏకపార్టీ పాలనకు సాధనంగా ఉంటుందని భారత బూర్జువావర్గ ప్రధాన ప్రతినిధిగా ఉన్న కాంగ్రెస్ పార్టి తలపోసింది. బూర్జువా పార్లమెంటరీ విధానంలో ప్రధానమైన ప్రతిపక్షపార్టీలు కేవలం అలంకారం కోసమేనని, అధికారం కోసం పోటీపడేహక్కు వాటికి లేదని భావించింది. అయినప్పటికీ వారు అధికారంలో ఉండటానికి, ఇతర ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలతో పాటు వామపక్ష ప్రభుత్వాలు మూడు రాష్ట్రాలలో అధికారంలో కొనసాగటానికి ప్రజల ప్రతిఘటన, పోరాటాలే కారణం. సంవత్సరాలు గడిచేకొద్దీ రాజ్యాంగంపై దాడులు పెరిగిపోతున్నాయి. సమ్మెలు, ప్రజాసంఘాలు, కార్మికసంఘాల కార్యకలాపాలను నిరోధించటానికి ప్రతి సంవత్సరం కొత్త చట్టాలను తీసుకువస్తున్నారు. వ్యక్తులను ముందస్తుగా అరెస్టు చేయటం కోసం తీసుకువచ్చిన కొన్ని చట్టాలు వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని ఫార్సుగా మార్చాయి.



epaper.prajasakti.com

> “ రాజ్యాంగాన్ని పనిముట్టుగా కుదించటానికి పాలకపార్టీ చేసిన ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఈ కాలంలో నిరంతర పోరాటాలు జరిగాయి. మొదట సిపిఐ(ఎం), కమ్యూనిస్టుల పైన మాత్రమే పాలకపార్టీ కేంద్రీకరించింది. సిపిఐ(ఎం)ను అణచివేయటం కోసం పశ్చిమబెంగాల్‌లో అర్ధఫాసిస్టు నిర్బంధకాండను ప్రారంభించింది. ఒక దశలో సిపిఐ(ఎం) ఈ దాడులను ఒంటరిగానే ఎదుర్కోవలసి వచ్చింది. ”



**1975లో దేశంలో విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఆందోళనలో పాల్గొన్న ప్రజలు**

వీటితోపాటు పోలీసుస్టేషన్లలో మరణాలు, శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన అధికారులు చేస్తున్న హత్యలు పెరుగుతున్నాయి. ఇటువంటి హత్యలకు పాల్పడిన వారు అరుదుగా మాత్రమే శిక్షించబడుతున్నారు. ప్రజలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలోని వారు 10 నుండి 20 సంవత్సరాల వరకు విచారణ లేకుండానే జైళ్ళలో గడుపుతున్నప్పటికీ, అందుకుగానూ ఎవరినీ శిక్షించటం లేదు. అంటరానితనాన్ని నిర్మూలించాలని రాజ్యాంగంలో చెప్పినప్పటికీ, దళితుల ఇళ్ళను తగులబెట్టటం, మహిళలను మానభంగం చేయటం చూస్తున్నాం. ప్రాథమిక హక్కుల వలెనే ఆదేశిక సూత్రాలను కూడా పట్టించుకోకపోవటం, ఉల్లంఘించటం కొనసాగుతున్నది. బూర్జువా–భూస్వామ్య పాలకుల ప్రయోజనాలకు, ప్రజల హక్కులకు మధ్య ఘర్షణ పెరుగుతున్నది. బూర్జువా–భూస్వామ్యవర్గాల కూటమి చేతిలో ఆయుధంగా రాజ్యాంగాన్ని ఉపయోగించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు.

ఈ విధంగా నిరంతరం చేస్తున్న దాడులు అత్యవసర పరిస్థితిని ప్రకటించటం, రాజ్యాంగాన్ని రద్దుచేయటానికి దారితీశాయి. ప్రజల అసంతృప్తిని అణచివేయటానికి కాంగ్రెస్ ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ అది ప్రజల నుండి వేరుపడటాన్ని, ఆ పార్టీలో అంతర్గత ఘర్షణలను, అధికారంపై గుత్తాధిపత్యాన్ని కోల్పోవటాన్ని నివారించలేకపోయిందని ఇవి స్పష్టం చేస్తున్నాయి. అత్యవసర పరిస్థితి ప్రకటించటానికి పార్లమెంటరీ పరిధిని దాటి ప్రజల తక్షణ తిరుగుబాటు లేదా విప్లవం సంభవించే పరిస్థితులు ఉండటం కారణం కాదని గుర్తుంచుకోవాలి. ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తి, కాంగ్రెస్(ఐ) ప్రజల నుండి వేరువడటం పెరగటంతో ఇందిరాగాంధి పార్లమెంటులో మెజారిటి కోల్పోయే అవకాశం కన్పించింది. పార్లమెంటరీ సూత్రాలకు అనుగుణంగా ఇతరపార్టీలు దేశాన్ని పాలించటానికి ఉన్నహక్కును అధికార పార్టీ బూర్జువా ప్రతినిధులు గుర్తించలేదు. ఏకపార్టీ నిరంకుశ పాలనను స్థాపించటమే వారి లక్ష్యం. అందుకోసం రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేశారు.

కాంగ్రెస్(ఐ) ప్రజల నుండి వేరుపడటం, ప్రజాస్వామ్యం కోసం భారత ప్రజలలో ఉన్న గాఢమైన ఆకాంక్ష, జాతీయోద్యమ సాంప్రదాయాలు కలిసి దుర్మార్గమైన ఈ కుట్రను ఓడించాయి. కొత్తగా ఎన్నికలు జరపాల్సిందిగా ఇందిరాగాంధిపై వత్తిడి వచ్చింది. ఆమె, ఆమె పార్టీ ఎన్నికలలో తుడిచిపెట్టుకుపోయాయి. భారతప్రజల పరిపక్వతను, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే వారి సంకల్పాన్ని ఇది వెల్లడించింది. నూతనంగా విముక్తి పొందిన ఏ దేశంలోనూ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఈ విధమైన ప్రతిఘటనను చూడం. ఈ దేశ సాంప్రదాయాలు, రాజ్యాంగంలో ప్రకటించిన అభ్యుదయ సూత్రాలు కాంగ్రెస్(ఐ)ని ఓడించటంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించాయి.

రాజ్యాంగాన్ని పనిముట్టుగా కుదించటానికి పాలకపార్టీ చేసిన ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఈ కాలంలో నిరంతర పోరాటాలు జరిగాయి. మొదట సిపిఐ(ఎం), కమ్యూనిస్టుల పైన మాత్రమే పాలకపార్టీ కేంద్రీకరించింది. సిపిఐ(ఎం)ను అణచివేయటం కోసం పశ్చిమబెంగాల్‌లో అర్ధఫాసిస్టు నిర్బంధకాండను ప్రారంభించింది. ఒక దశలో సిపిఐ(ఎం) ఈ దాడులను ఒంటరిగానే ఎదుర్కోవలసి వచ్చింది. అర్ధఫాసిస్టు నిర్బంధకాండను అమలు చేసిన కాలంలో 1000 మందికి పైగా పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు హత్యకు గురయ్యారు. కొద్దికాలంలోనే ఇతర బూర్జువా ప్రతిపక్ష రాజకీయ పార్టీల రాజ్యాంగబద్ధ హక్కులను కూడా కుదిస్తూ ఈ దాడులు విస్తరించాయి. అత్యవసర పరిస్థితి కాలంలో అన్ని ప్రతిపక్ష పార్టీల నాయకులను– బూర్జువా పార్టీలు, సిపిఐ(ఎం) నాయకులను– జైళ్ళలో నిర్బంధించారు. అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా ఐక్య కార్యాచరణ కోసం వివిధ పార్టీలతో కూడిన విస్తృతమైన సంఘటన ఈ సమయంలోనే ఉనికిలోకి వచ్చింది. ఐక్య కార్యాచరణ కోసం వామపక్షాలు, బూర్జువా ప్రతిపక్షపార్టీల మధ్య అప్పటి వరకు ఎటువంటి అవగాహనా లేదు. ఈ ఐక్యకార్యాచరణ 1977 ఎన్నికలలో జనతాపార్టీ విజయానికి దారితీసింది. బూర్జువా ప్రతిపక్షాలు, వామపక్షాలు నియంతృత్వ పార్టీకి వ్యతిరేకంగా సాధించిన అతి పెద్ద విజయం ఇది. దురదృష్టవశాత్తు జనతాపార్టీ నాయకులు కూడా కాంగ్రెస్(ఐ) నాయకుల వలెనే అదే పాలకవర్గాలకు ప్రాతినిధ్యం వహించేవారు



epaper.prajasakti.com

> మతోన్మాద బిజెపితో పాటు నిరాశతో ఉన్న కొన్ని పార్టీలతో సూత్రరహితమైన కలయికల కోసం ఎల్లప్పుడూ ప్రయత్నాలు చేస్తున్నారు. వీటిలో కొన్ని పార్టీలు భూస్వాములలోని ఒక తరగతి మద్దతుతో రాష్ట్రాలలో తమ ప్రభుత్వాలను కొనసాగిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం తమకు అన్యాయం చేస్తున్నదని స్థానికులలో ఉన్న భావాలను తమ బలం పెంచుకోవటానికి వినియోగించుకుంటున్నాయి.

కావటంతో ఈ విజయాన్ని సంఘటితం చేసుకోవటం జరగలేదు. వాగ్దానాలకు కట్టుబడి ఉండకపోవటం, ఆర్ఎస్ఎస్‌పై ఆధారపడటం, ప్రజలకు అనుకూలమైన చర్యలు తీసుకోకపోవటం, దోపిడీదారులను వ్యతిరేకించే విధానాలను అనుసరించకపోవటం, చివరిగా సూత్రరహితంగా తమలోతాము వివాదాలలో కూరుకుపోవటం వారిని ప్రజల నుండి వేగంగా దూరం చేసింది. తర్వాత జరిగిన ఎన్నికలలో జనతాపార్టీ ఓడిపోయింది. రాజ్యాంగబద్ధంగా అధికారంలో కొనసాగటానికి లభించిన పూర్తికాలం ఆ పార్టీ అధికారంలో ఉండలేకపోయింది.

**బూర్జువా పార్టీల పరిమితులు**

ఇందిరాగాంధీ ఎక్కువ మెజారిటీతో తిరిగి అధికారంలోకి వచ్చింది. గత ఎన్నికలలో జనతా పార్టీకి ఓటువేసి తప్పుచేశామని, దానిని 1980లో జరిగిన ఎన్నికలలో సరిదిద్దుకున్నామని ప్రజలు భావించారా అనిపించింది. బూర్జువా ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్నపుడు యధాతథవాద స్వభావం, మార్పును తీసుకురావాలనే దృక్పధం లేనందు వలన ప్రజలను పట్టించుకోకుండా వ్యవహరించాయి. కాంగ్రెస్(ఐ) వలెనే అదే వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న జనతా పార్టీకి తనముందు పాలకుల విధానాలకు భిన్నమైన కార్యక్రమం లేదు. కనీసం ప్రజల సమస్యలకు పరిష్కారాలను గురించిన సూచనలు, ప్రకటనలు కూడా చేయలేదు. కాంగ్రెస్ పార్టీ దారిద్ర్య వ్యతిరేక కార్యక్రమం, దళితుల సమస్యలను పరిష్కరించాలన్న ప్రచారం తదితరాలు దానిని సామాన్య ప్రజలకు దగ్గరగా కనిపించేలా చేశాయి. జనతాపార్టీ నాయకులు, దాని దృక్పధంలో పైకులాలపై పక్షపాతం స్పష్టంగా కనిపించింది. వీటితో పాటు జయప్రకాశ్ నారాయణ మద్దతు ఉన్నప్పటికీ జాతీయ సాంప్రదాయాలకు ప్రతినిధిగా నిలబడటంలో విఫలమైంది. ఈ సాంప్రదాయాలను కాంగ్రెస్(ఐ) ఎల్లప్పుడూ స్వంతం చేసుకుంటున్నది. నెహ్రూపై దాడిని కేంద్రీకరించిన ఏ పార్టీ అయినా జాతీయ కాంగ్రెస్ వారసత్వాన్ని కొనసాగించటంలో జయప్రదం కాలేదు.

భారతదేశంలో ఉన్న పరిస్థితులలో బూర్జువా ప్రతిపక్ష పార్టీల పరిమితులను ఈ అంశాలు వెల్లడిస్తున్నాయి. జాతీయ సాంప్రదాయాలను స్వంతం చేసుకోవటంలో వైఫల్యం, తీవ్రవాద దృక్పధం, భావాలు లేకపోవటంతో పాటు కాంగ్రెస్ పార్టీ వెనుక ఉన్న దోపిడీ వర్గాలలో ఎక్కువ భాగాన్ని తమవైపుకు ఆకర్షించుకోవాలనే పోరాటంతో ఈ పార్టీలు ప్రజలను ఉత్తేజపరచలేకపోతున్నాయి. తీవ్రవాద దృక్పధంతో ప్రజలకు విజ్ఞప్తి చేయటానికి ఎల్లప్పుడూ భయంతో ఉండటం వలన కాంగ్రెస్‌కు వారే ప్రజలలో స్థానం కల్పిస్తున్నవారవుతున్నారు. వర్గ రాజకీయాలను పక్క పెట్టి, కాంగ్రెస్‌పై అనిర్దిష్టమైన విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్ చేస్తున్న తప్పులను ఎత్తిచూపటంలోనూ, విలువలతో కూడిన రాజకీయాలను అనుసరించటానికి ఈ పార్టీలు దూరంగా ఉంటున్నాయి. విశాల దృక్పధం లేకపోవటం వలన బూర్జువా-భూస్వామ్య కూటమికి చెందిన జాతీయ పార్టీల పాత్రను ఈ పార్టీలు నిర్వహించలేకపోతున్నాయి. అఖిలభారత స్థాయి ప్రతిపక్షపార్టీ లేదని విచారపడుతున్న ఈ పార్టీలు ప్రతీఘాతుక విధానాల వైపు మొగ్గుచూపటం, పరిమిత దృక్పధాన్ని వదులుకోకపోతే నిజనమైన జాతీయ పార్టీని ఏర్పాటు చేయగలస్థితిలో ఉండలేమని గుర్తించలేకపోతున్నాయి. మతోన్మాద బిజెపితో పాటు నిరాశతో ఉన్న కొన్ని పార్టీలతో సూత్రరహితమైన కలయికల కోసం ఎల్లప్పుడూ ప్రయత్నాలు చేస్తున్నారు. వీటిలో కొన్ని పార్టీలు భూస్వాములలోని ఒక తరగతి మద్దతుతో రాష్ట్రాలలో తమ ప్రభుత్వాలను కొనసాగిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం తమకు అన్యాయం చేస్తున్నదని స్థానికులలో ఉన్న భావాలను తమ బలం పెంచుకోవటానికి వినియోగించుకుంటున్నాయి.

అయినప్పటికీ జనతా పార్టీ ప్రభుత్వ వైఫల్యం తర్వాత కూడా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న కార్యక్రమాలలో ఉమ్మడి అవగాహన కొనసాగున్నది. ప్రస్తుతం ఐక్యంగా ఉన్న వామపక్షాలు దీనిలో ప్రధానమైన పాత్ర నిర్వహిస్తున్నాయి. శ్రీనగర్, కలకత్తాలో జరిగిన రెండు సమావేశాలు ఉమ్మడి అవగాహన, కార్యాచరణలను ముందుకు తీసుకుపోవటానికి దోహదం చేశాయి. ఎన్ టి రామారావు, ఫరూక్ అబ్దుల్లా మంత్రివర్గాలను రద్దు చేసినపుడు ప్రతిపక్షాలు, ప్రజాస్వామిక శక్తుల అసాధారణ ఐక్యత వ్యక్తమైంది. ఉమ్మడి అవగాహన, కార్యక్రమాలలో ఎగుడుదిగుళ్ళు ఉన్నప్పటికీ ఈ క్రమం ఆగకుండా కొనసాగుతున్నది.

సిపిఐ(ఎం), వామపక్షాలు 1987 ఎన్నికలలో కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో విజయం సాధించినపుడు భవిష్యత్ అంచనాలతో పాటు ఉమ్మడి అవగాహన, కార్యాచరణలను పెంచాలనే కోరికలు బలపడ్డాయి. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వి పి సింగ్ తిరుగుబాటు చేసినపుడు ఈ అంచనాలు మరింత పెరిగాయి. రాజీవ్‌గాంధి అనుసరిస్తున్న జాతి వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలపై పోరాటంలో అన్ని లౌకిక, వామపక్షశక్తులు ఐక్యం కావాలనే కోరికను ప్రజలు వ్యక్తం చేశారు. ఆ విధంగా కాంగ్రెస్(ఐ) పార్టీ రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రారంభించిన దాడులతో పాటు దానిని ఎదుర్కోవటానికి ప్రారంభమైన పోరాటం కూడా తీవ్రమైంది. పాలకపార్టీ ప్రారంభించిన దాడులను ఎదుర్కోవటం, వాటిని తిప్పికొట్టటంలో అనేక సందర్భాలలో ప్రజాస్వామిక శక్తులు విజయం సాధించాయి. ఇపుడు స్వాతంత్ర్యదినోత్సవం 40వ వార్షికోత్సవం సందర్భంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, జాతీయ ఐక్యతను సంరక్షించుకోవటం కోసం రాజీవ్‌గాంధి ప్రభుత్వం రాజీనామా చేసి, ఎన్నికల జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ పోరాటం కొనసాగుతున్నది.

*(తరువాయి భాగం జూన్ నెల సంచికలో)*

**అనువాదం: ఎ కోటిరెడ్డి**

❋



epaper.prajasakti.com

**అంతర్జాతీయం**

# శత్రువుల ముట్టడిని ఎదుర్కొని సోషలిజం గెలుస్తుంది!



క్యూబా అధ్యక్షులు
కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి

**మిగుఎల్ డియజ్‌కానెల్**

*(క్యూబా జాతీయ 9వ పార్లమెంట్, 7వ సాధారణ సమావేశాల ముగింపు సందర్భంగా చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు)*

దేశాధ్యక్షుడిగా నా పరిపాలనపై నివేదికను సమర్పించేందుకు మీ ముందున్నాను. మనకు ఈ కాలంలో ఎదురైన పరిస్థితులను, అనుభవాలను మీతో పంచుకుంటాను. ధైర్య, సాహసాల్లో క్యూబా పౌరుల స్మృతి చిహ్నం, మన యువతకు నిరంతర స్ఫూర్తి ప్రధాత, మహావీరుడు కామిలో సియన్‌ఫ్యూగొస్ అదృశ్యమైన విషాదకరమైన ఈ రోజు క్యూబా ప్రజలందరికీ అత్యంత ప్రాధాన్యగలిగినది. ఆనందోత్సాహాలతో తొణికిసలాడే, మేధోశక్తి, నిబద్ధత గల ఆదర్శమూర్తి అయిన ఆ కామ్రేడ్‌ను మనం అనునిత్యం స్మరించుకుంటాం.

మన ప్రజల మనోభాలను దృష్టిలో వుంచుకుని నేనీ అంశాలను బహిరంగంగా వ్యక్తం చేస్తున్నాను. ప్రజా సేవకులంగా, ప్రజల పట్ల బాధ్యతతో మన పని విధానాన్ని మెరుగుపరచుకుందాం.

సంక్లిష్టమైన రెండు సంవత్సరాల సుదీర్ఘమైన, కఠినమైన లాక్‌డౌన్లతో మరింత విషమించిన ప్రపంచ పరిణామాలను గురించి నేను వక్కాణిస్తున్నాను. బహుముఖమైన సంక్షోభాలు చుట్టుముట్టిన కాలమిది. కోవిడ్ 19 మూలంగా రెండు వారాలలోపే ప్రపంచవ్యాపితంగా 50 లక్షల మంది మరణించారు. 243.70 కోట్ల మందికిపైగా వైరస్ బారినపడ్డారు. కోవిడ్ మహమ్మారి మూడు వెల్లువల్లో చనిపోయిన వారి సంఖ్య అధికారికంగా ప్రకటించిన లెక్కల కంటే రెండు, మూడు రెట్లు అధికంగా వుండవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది. ప్రపంచంలో జరిగిన నష్టాల పూర్తి వివరాలు ఇంకా తెలియవలసివుంది. ఈ విపత్తు వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కల్గిన నష్టాలను ఎవరూ తక్కువ అంచనా వేయలేరు. విలాసవంతమైన, సౌకర్యవంతమైన ప్రాంతాల సంఖ్య గణనీయంగా తగ్గింది. మినహాయింపులిచ్చిన ప్రదేశాలు నాటకీయంగా విస్తరిస్తున్నాయి.

క్యూబాలో 'ఉచిత, సార్వత్రిక ఆరోగ్య వ్యవస్థ' ఉన్నది. శాస్త్రీయాభివృద్ధి, పరిశోధనా రంగాలలో మనం సాధించిన అభివృద్ధి కోవిడ్ వ్యాక్సిన్‌లను తయారు చేయటంలో క్యూబాను ప్రపంచంలో ముందు పీఠిన నిలబెట్టాయి.

మన ఆర్థికవ్యవస్థ ప్రత్యేక పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు 2019 పార్లమెంట్ సమావేశాల్లో చెప్పుకున్నాం. కోవిడ్ 19 మహమ్మారి నుండి మన ప్రజానీకాన్ని రక్షించుకోవటం కోసం బడ్జెట్‌లో గణనీయమైన మొత్తాన్ని వెచ్చించవలసి వచ్చింది. ఆహారం, ఔషధాల నిరంతర సరఫరా, విద్యుత్ వ్యవస్థ నిర్వహణకు మన శక్తికి మించి నిధులను వినియోగించటం అనివార్యమైంది. ఈ సంక్లిష్ట పరిస్థితులు ప్రజల్లో అసంతృప్తి, అసహనం ప్రకోపించేందుకు దారితీశాయి.

సకాలంలో విద్యుత్ వ్యవస్థ నిర్వహణకు అవసరమైన వనరుల సేకరణలో వెనుకబడటంతో 2021 జూన్ 21 నుండి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తీవ్రమైనాయి. క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ఇంధనాన్ని, ఆర్థిక వనరులను సమీకరించినప్పటికీ ఇబ్బందులను పూర్తిగా అధిగమించలేకపోయాం. 2021 చివరకు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కోలుకునేందుకు అవకాశాలు ఉన్నాయి. దేశవ్యాపితంగా విద్యుత్ సరఫరా పరిస్థితి క్రమంగా మెరుగౌతున్నది.

ఈ కాలంలో సరఫరా కంటే డిమాండు ఎక్కువగా వుంది. ఈ పరిస్థితి ద్రవ్యోల్బణం పెరుగుదలకు దారితీసింది. ద్రవ్యోల్బణాన్ని అదుపులో పెట్టటమే ప్రభుత్వానికి ప్రధానమైన పనిగా మారింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు జాతీయ ఉత్పత్తిదారుల భాగస్వామ్యాన్ని భారీగా పెంచాలి. జాతీయ మార్కెట్‌లో సరఫరాలను మెరుగుపర్చాలి.

కోవిడ్ 19 అదుపుతో ఆర్థిక, సామాజిక పరిస్థితులు కుదుటపడుతున్నాయి. దానితో ప్రభుత్వ సోషలిస్టు సంస్థలకు అధిక స్వయం ప్రతిపత్తిని ఇచ్చాం. ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచి, ప్రాధాన్యతా క్రమంలో బహుముఖంగా వినియోగించేందుకు అవకాశం ఏర్పడింది. 2022 దేశ బడ్జెట్, ఆర్థిక ప్రణాళికలపై సంవత్సరం ఆఖరులో సమీక్షిస్తాం.

ఒక లక్ష్య సాధనకు అన్ని శక్తులనూ అనుసంధానించగల మన వ్యవస్థకు అభినందనలు. ప్రత్యేకించి క్యూబా కమ్యూనిస్టు పార్టీ చుట్టూ ఆ శక్తులన్నింటినీ ఐక్యం చేస్తున్న తీరుకూ ధన్యవాదాలు. ఊహించని కోవిడ్ మహమ్మారి సమస్యలకు, అమానుషంగా కఠినతరం చేయబడిన దిగ్బంధనలకు క్యూబా తక్షణ పరిష్కారాలను కనుగొన్నది. క్రూరుడైన మన శత్రువు అవకాశవాదాన్ని ఎత్తి చూపటం ఎంతైనా అవసరం. మహమ్మారి మనదేశంలో పరాకాష్టకు చేరిన స్థితిలో తరచుగా విద్యుత్ సరఫరాకు ఆటంకాలు ఏర్పడ్డాయి. సరుకులు, సేవల సరఫరాలు గణనీయంగా తగ్గిపోయాయి. ఫలితంగా దేశంలో ఉద్రేకాలు, అసమ్మతులకు అనుకూల వాతవరణం ఏర్పడింది.

మన మాతృభూమి క్యూబా చారిత్రక శత్రువైన అమెరికా ఈ పరిస్థితిని అదునుగా తీసుకుంది. మన ఆర్థిక వ్యవస్థపై దుర్మార్గమైన దాడులకు పూనుకుంది. కోవిడ్ వ్యతిరేక పోరులో ప్రపంచస్థాయిలో బహుళ వ్యవస్థల పరస్పర సహకారాన్ని బలపరుస్తూ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో గొప్పగా ప్రకటించాడు. అందుకు పూర్తి భిన్నంగా క్యూబాపై ఆంక్షలను


epaper.prajasakti.com

కఠినతరం చేశారు. కొత్త ఆంక్షలను విధించారు. క్యూబాను అస్థిరపరిచేందుకు నూతన పథకాల అమలు ప్రారంభమైంది. ఈ దుశ్చర్యలన్నీ అమెరికా 'సున్నితమైన కుట్ర పథకాని'కి అనుగుణంగా సాగుతున్నాయి.

గత 62 సంవత్సరాలుగా సాగుతున్న దుష్ట విధానాన్ని అమెరికా మార్చుకుంటుందని మనం ఎదురు చూస్తూ కూర్చోలేదు. సరుకుల భారీ కొరతలను మనం ఎదుర్కొంటున్నాము. ఆ కష్టాలతో మన ప్రజల ప్రతిఘటనా శక్తి సన్నగిల్లుతుందని, మనం వారి పాదాక్రాంతులం అవుతామన్న భ్రమలలో శత్రువు ఉన్నాడు. అందుకే దిగ్బంధనాన్ని కఠినతరం చేసేందుకు కొత్త దాడులకు పాల్పడుతున్నది. క్యూబా లాంటి సోషలిస్టు వ్యవస్థలపై హింసాత్మక సైనిక చర్యలు, దురాక్రమణలు, దండయాత్రలను కొట్టి పారేయలేం. కానీ మనం ధైర్యం కోల్పోతాం లేదా లొంగిపోతామని వారు ఆశిస్తున్నారు. అందుకే కమ్యూనిజంపై ద్వేషంతో సోషలిస్టు వ్యతిరేక ప్రచారం, ప్రతి ఆర్థిక అంశాన్ని చిదిమేయటం వారి లక్ష్యంగా మారాయి. సూటిగా చెప్పాలంటే దిగ్బంధాన్ని కొనసాగించి క్యూబాను నష్టపర్చటం, మన ప్రజలకు తమ బలంపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీయటమే వారి లక్ష్యం. ప్రస్తుత అమెరికా పాలకులు తమ విధానాలను సవరించుకుంటున్నట్లు ప్రకటనలు గుప్పిస్తున్నారు. గత ఎన్నికల్లో చేసిన మోసపూరిత ప్రకటనలు బైడెన్‌ను అధికారపీఠం ఎక్కించాయి. ప్రజలు ఆ మాటలను ఇంకెంత మాత్రమూ నమ్మబోరు. క్యూబా ప్రజలకు మద్దతునివ్వటమే తమ ఉద్దేశమంటూ వంచనాపూర్వక సమర్థనలతో విజ్ఞప్తులు చేయటాలు ఇంకేమాత్రం చెల్లవు.

> “ క్యూబాలాంటి సోషలిస్టు వ్యవస్థలపై హింసాత్మక సైనిక చర్యలు, దురాక్రమణలు, దండయాత్రలను కొట్టిపారేయలేం. కానీ మనం ధైర్యం కోల్పోతాం లేదా లొంగిపోతామని వారు ఆశిస్తున్నారు. అందుకే కమ్యూనిజంపై ద్వేషంతో సోషలిస్టు వ్యతిరేక ప్రచారం, ప్రతి ఆర్థిక అంశాన్ని చిదిమేయటం వారి లక్ష్యంగా మారాయి. సూటిగా చెప్పాలంటే దిగ్బంధాన్ని కొనసాగించి క్యూబాను నష్టపర్చటం, మన ప్రజలకు తమ బలంపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీయటమే వారి లక్ష్యం. ”

క్యూబాను ఆర్థిక ఇబ్బందులపాలు చేయటం, మన ప్రజలను శిక్షించటం, జీవన ప్రమాణాలను కుదించివేయటం, ఆదాయ వనరులపై ఆంక్షలు విధించటం, కుటుంబ సంక్షేమానికి, ప్రాథమిక అవసరాలకు అత్యధికంగా ఆధారభూతమైన సామాజిక సేవలను విచ్ఛిన్నం చేయటం అమెరికన్ పాలకుల లక్ష్యం. ఆ దాడులను తీవ్రం చేశారు. అంతిమంగా తమ జాతి నిర్మూలనా (జినోసైడల్) విధానాలు, ఆధిపత్య కుట్రలతో 'తాకట్టు పెట్టబడిన ప్రజల స్థాయి'కి క్యూబా ప్రజలను కుదించాలన్నది అమెరికా పాలకవర్గాల లక్ష్యంగా మారింది.

అందుకే కరోనాపై పోరులో క్యూబా క్యూబా విజయం సాధించటం పట్ల వాషింగ్టన్ ఆందోళన చెందుతున్నది. ముఖ్యంగా స్వయంకృషి, స్థానిక వనరులు, నైపుణ్యాలతో అభివృద్ధి చేసిన మన వ్యాక్సినేషన్ పథకం సాధించిన అద్భుత ఫలితాలను వారు జీర్ణించుకోలేకపోతున్నారు. మన ప్రజారోగ్య వ్యవస్థను చులకన చేసేందుకు నిర్ణయించుకున్నారు. మనం సాధించిన అసాధారణ విజయాలను గుర్తించ నిరాకరిస్తున్నారు. ఈ విధమైన మోసపూరిత చిత్రీకరణలతో మన వాస్తవపరిస్థితిని వక్రీకరించి చూపాలని నిర్ణయించుకున్నట్లు అర్థమౌతున్నది. మనం అభివృద్ధి చేసి అందిస్తున్న ప్రతి వ్యాక్సినూ స్వదేశీ పరిజ్ఞానంతో తయారైనదే. ప్రతిదీ అంటువ్యాధుల నిరోధకమైనదే. వ్యాధి విస్తరణను అరికట్టేవే. ప్రతి ప్రాణ రక్షణ ఔషధమూ మనజాతి ప్రతిష్ఠను పెంచే విజయాలే. మన దేశానికి వ్యతిరేకంగా సామ్రాజ్యవాదులు సాగిస్తున్న దాడులన్నీ వారి ఓటమికి చిహ్నాలే. కోవిడ్ మహమ్మారిని మన ప్రజలకు వ్యతిరేకంగా వినియోగించటం వాస్తవాలను వెల్లడిస్తున్నది.

క్యూబా కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటి గత ప్లీనం సమావేశాల ముగింపులో నేనీవిధంగా చెప్పాను: “వర్తమాన పరిస్థితుల్లో క్యూబాను రాజకీయంగా నాశనం చేసేందుకు మన దేశంలోని అమెరికా రాయబార కార్యాలయం కుట్రలను వేగవంతం చేస్తున్నది. అందుకు భిన్నంగా వాషింగ్టన్‌లోని మన రాయబార కార్యాలయం అమెరికా రాజకీయ, న్యాయ, రాజ్యాంగ పునాదులకు, వ్యవస్థకు హాని కల్గించే ఎలాంటి చర్యలకూ పాల్పడలేదు. ఉభయ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించేందుకు, ఆర్థిక ఆంక్షలను ఎత్తేసేందుకు, క్యూబాకు – విప్లవానికి వ్యతిరేకంగా జరుగుతున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టేందుకు అక్కడి మన రాయబార కార్యాలయం కృషి చేస్తున్నది”.

అమెరికా రాజకీయ వ్యవస్థ పట్ల మనకు కొన్ని ఆందోళనలు, అభిప్రాయాలున్నాయి. అయినప్పటికీ, ఐక్యరాజ్యసమితిలో మన దౌత్య విధానం మచ్చలేకుండా వుంది. మన దేశంలోని తన రాయబార కార్యాలయం ద్వారా అందే సౌకర్యాలను అమెరికా ప్రభుత్వం నిస్సిగ్గుగా వినియోగించుకుంటున్నది. అమెరికా దౌత్య అధికారులు ఇక్కడి విప్లవ విద్రోహ ముఠాలను తరచూ కలుస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. రవాణా సౌకర్యాలు, ఆర్థిక సహకారాన్ని అందించి వారిని ప్రోత్సహిస్తున్నారు. అమెరికా వేదికలపై నుండి ఆ కుట్రదారులు రోజూ రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారు. తద్వారా మన అంతర్గత వ్యవహారాల్లో బహిరంగ జోక్యానికి అమెరికా పాల్పడుతున్నది.

మనం అమెరికా ప్రభుత్వాన్ని ఒక విషయం అడగదలచుకున్నాం. “అధికారయుతంగా గుర్తింపు పొందిన ఏదైనా ఒక దౌత్య కార్యాలయం అమెరికాలోని ఉగ్రవాద సంస్థలను పురికొల్పుతూ, అన్ని విధాలా ప్రోత్సహిస్తుంటే, వారి చర్యలు అమెరికా స్థిరత్వానికి ముప్పుగా పరిణమిస్తే ఏం చేస్తారు? అలాంటి సంస్థలు మీ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలను సహాయ నిరాకరణ, బహిరంగంగా సామూహిక రాజకీయ ప్రదర్శనలకు ప్రేరేపిస్తే అమెరికా ఎలా స్పందిస్తుంది?”

అమెరికా కేంద్రంగా క్యూబాను అస్థిరపరిచే కార్యకలాపాలను తీవ్రం చేయబోతున్నట్లు ఇటీవలి రెచ్చగొట్టుడు చర్యలు స్పష్టం చేస్తున్నాయి. క్యూబాను ఒక 'విఫల దేశం'గా చిత్రించేందుకు కోట్లాది డాలర్లు వెదజల్లుతున్నారు. తమ పథకంలో పలు దేశాలను భాగస్వాములను చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్వయంగా అమెరికాయే భారీస్థాయిలో మరిన్ని కక్షపూరిత చర్యలకు పూనుకోవాలని ఆ పథకం వత్తిడి చేస్తున్నది.

ఆ దుష్ట పథకాలను కప్పిపెట్టేందుకు ఎంత శక్తివంతమైన సాధనాలను వినియోగించినా సత్యం దాగదు. కోవిడ్ 19 వైరస్ అంత వేగంగా అబద్ధాలు విస్తరించవచ్చు. కొందరిని గందరగోళ పరిచేశక్తి వాటికి



epaper.prajasakti.com

> "అంతర్జాతీయ సమాజంతోను, ప్రత్యేకంగా మన మిత్ర దేశాలతోను సజీవ సంబంధాలు నెలకొల్పుకునే అవకాశం మనకు లభించింది. మనదేశం నుండి 40 దేశాలకు 57 వైద్య బృందాలు తరలి వెళ్లాయి. కోవిడ్ మహమ్మారితో పోరాడుతూనే మన డాక్టర్ల బృందాలు అక్కడి ప్రజలకు వైద్య సేవలు అందించాయి. ఈ సేవా కార్యక్రమాలకు ప్రపంచ వ్యాపితంగా మంచి గుర్తింపు లభించింది. అక్కడి ప్రజల్లో మన వైద్యసేవల పట్ల కృతజ్ఞతాభావం వెల్లివిరిసింది."

వుండవచ్చు. కానీ అవేవీ కాల పరీక్షలో కాకలుతీరిన క్యూబా వీరోచిత ప్రజల ధృడ సంకల్పాన్ని సడలింప చేయలేవు. మన వ్యూహాలకు, ఆర్థికాభివృద్ధికి ప్రధానమైన ఆటంకంగా మారుతున్న సామ్రాజ్యవాద కుట్రలను ఓడిస్తున్నాం. కరోనా మహమ్మారిపై విజయం సాధిస్తున్నాం.

'మన అభివృద్ధి, ప్రజల సంక్షేమం' మనం చేసే కృషిపై ఆధారపడి వుంటుంది. క్యూబా గతిని నియంత్రించేందుకు అమెరికా కుట్రలు సాగినంత కాలం దాని క్రూరత్వంపై యుద్ధాన్ని కొనసాగిస్తాం. కేవలం ప్రతిఘటనను అణచేందుకు మాత్రమే కాక మన అభివృద్ధికి మూలమైన సోషలిజాన్ని తుదముట్టించటమే దిగ్బంధనం కీలక లక్ష్యం. మన సమస్యలకు సోషలిజాన్ని నిందించరాదు. నరహంతక అమెరికా ముట్టడిని తట్టుకుంటూ, అభివృద్ధి సాధిస్తున్నాం. అవాంఛనీయమైన ఈ దాడులకు తగు విధంగా స్పందించే బాధ్యత మనపై వుందని గత కేంద్ర కమిటి ప్లీనంలో ఉద్ఘాటించాను. మనల్ని లొంగదీయాలని వారు చేస్తున్న కుట్రలకు మించిన స్థాయిలో మన ప్రతిఘటన ఉండాలి.

కోవిడ్ 19తో ఉత్పన్నమైన సంక్షోభాన్ని అధిగమించి, ఆర్థిక, సామాజిక స్థితిని మెరుగుపరిచేందుకు మనం వ్యూహాన్ని రూపొందించుకున్నాం. 2030 నాటికి సాధించ తలపెట్టిన మన అభివృద్ధి పథకాలను కొనసాగిస్తాం. పూర్తిగా కొత్తదైన కోవిడ్ మహమ్మారితో తలెత్తిన సంక్లిష్ట పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాన్ని సర్దుబాటు చేసుకునే శక్తి మనకు ఉన్నది. పరిమితులను దృష్టిలో వుంచుకుని, మన బలానికి అనుగుణంగా స్పందిస్తున్నాం.

శాస్త్ర విజ్ఞానం, పరిశోధనల ఆధారంగా ప్రభుత్వ నిర్వహణా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నాం. ముందుకొచ్చిన సమస్యలపై సముచిత నిర్ణయాలు చేయటంలో ప్రత్యేక సలహాలను ఇచ్చేందుకు 'జాతీయ ఆవిష్కరణ'ల కౌన్సిల్‌ను ఏర్పరచుకున్నాం. ఆ కౌన్సిల్ సహకారంతో ఆహార ఉత్పత్తి, పంపిణీని సక్రమంగా చేస్తున్నాం. దానితోపాటు ప్రభుత్వరంగ సంస్థల సామర్థ్యాన్ని, చిన్న, మధ్యతరగతి సంస్థల పని విధానాన్ని మెరుగు పరచుకున్నాం. ఉత్పత్తి క్రమంలోని ఆటంకాలు తొలగించేందుకు, ఉత్పత్తి గొలుసులను సృష్టించేందుకు 60కి పైగా అదనపు చట్టాలను ఆమోదించాం. పలు దేశాలతో సంబంధాల ఏర్పాటుకు, పరస్పర చర్చలకు, సహకారానికి గత సంవత్సర కాలంలో మన ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేసింది. అందుకు ప్రత్యక్షంగా, ఆన్‌లైన్ సమావేశాల ద్వారా ప్రయత్నించాం. తద్వారా అంతర్జాతీయ సమాజంతోను, ప్రత్యేకంగా మన మిత్ర దేశాలతోను సజీవ సంబంధాలు నెలకొల్పుకునే అవకాశం మనకు లభించింది. మనదేశం నుండి 40 దేశాలకు 57 వైద్య బృందాలు తరలి వెళ్లాయి. కోవిడ్ మహమ్మారితో పోరాడుతూనే మన డాక్టర్ల బృందాలు అక్కడి ప్రజలకు వైద్య సేవలు అందించాయి. ఈ సేవా కార్యక్రమాలకు ప్రపంచ వ్యాపితంగా మంచి గుర్తింపు లభించింది. అక్కడి ప్రజల్లో మన వైద్యసేవల పట్ల కృతజ్ఞతాభావం వెల్లివిరిసింది.

### సోషలిస్టు రాజ్యాంగం - పార్లమెంటరీ వ్యవస్థ

మన సంస్థాగత అభివృద్ధికి తోడ్పడే చట్టసభ పనిని పరిశీలిద్దాం. అంగీకృత షెడ్యూళ్లతో జరిగిన ఈ కాలపు సమావేశాల్లో నాలుగు చట్టాలను అమోదించాం. అవి మన దేశపు న్యాయ, చట్టపరమైన సంస్కరణలకు గుర్తుగా నిలుస్తాయి. ఇవి క్యూబా రాజ్యాంగపు సారాంశాన్ని పటిష్టం చేస్తాయి. పౌర హక్కులను బలపరచిన సమాజంలోనే సామరస్యం నెలకొంటుంది. ఒక విశాలమైన, సృజనాత్మకమైన, భాగస్వామ్య ప్రక్రియ ప్రాతిపదికన ఇవి నడిచాయి. ఈ కృషికి ప్రజలతో పాటు డాక్టర్లు, న్యాయస్థానాల డైరెక్టర్లు, నిపుణులు, అటార్నీ జనరల్ కార్యాలయం, విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, సామూహిక న్యాయ బృందాలు తోడ్పాటును అందించారు.

ఆయా సమస్యలతో సంబంధమున్న ప్రజలతో తగిన సమయంలో సంప్రదింపులు జరుపుతున్న ఫలితంగానే ప్రతి చట్టమూ సభలో ఆమోదించబడుతున్నది. ముసాయిదాలు తయారు చేయటంలో కూడా ఈ పద్ధతిని పరిపూర్ణంగా అభివృద్ధి చేసుకోవాలి. చట్టాలను ఆమోదించటంలో మనం అవలంభిస్తున్న పద్ధతులు, అభివృద్ధి చెందిన శాసనవ్యవస్థల్లో మన దేశాన్ని ముందు పీఠిన నిల్పుతున్నాయి. అందరికీ న్యాయం అందుబాటులో వుంచేందుకు పునరుద్ధరణ, పునశ్చరణల స్ఫూర్తిని కొనసాగిస్తున్నాం. 'మాగ్నకార్టా'లోని ఆర్టికల్ ఎ1కి అనుగుణంగా చట్టబద్ధమైన సోషలిస్టు రాజ్యం, సామాజిక న్యాయం భావనలను ధృడపరచేందుకు ఈ ప్రక్రియ తోడ్పడుతున్నది. 'న్యాయస్థానాల చట్టం' దేశంలోని న్యాయవ్యవస్థల పనిని శక్తివంతం చేస్తున్నది. సమాజంలో న్యాయవ్యవస్థ, న్యాయమూర్తుల స్వతంత్రతను కాపాడుతున్నది. వర్తమాన అవసరాలకు అనుగుణంగా తన నిర్మాణాన్ని, పని విధానాన్ని సర్దుబాటు చేసుకుంటున్నది. రాజ్యాంగపు ఔన్నత్యం, నిష్పాక్షికత, సమానత్వం, సులభ న్యాయం అందుబాటు, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలను అది గుర్తిస్తున్నది.

ప్రభుత్వం తమ హక్కులను ఉల్లంఘిస్తున్నదని ప్రజలు అభిప్రాయపడినపుడు న్యాయస్థానంలో ఫిర్యాదు చేసుకోవటానికి 'చట్టం' హామీనిస్తున్నది. పౌర, వాణిజ్యం, కుటుంబం, శ్రమ, సాఫిక భద్రత వంటి అంశాల్లో 'నిబంధనల పక్రియ' (కోడ్ ఆఫ్ ప్రాసెసన్)ను అమలు చేస్తున్నది. అతి దుర్బలమైన పరిస్థితుల్లోని ప్రజలకు రక్షణ కల్పిస్తున్నది. వారికి సంబంధించిన న్యాయపరమైన నిర్ణయాల అమలుకు ఏర్పాట్లు చేస్తున్నది.

ఆమోదించబడిన 'నాలుగు చట్టాలు', న్యాయవ్యవస్థకు బాధ్యత వహిస్తున్న వారికి సవాలుగా మారాయి. వారికి శిక్షణ ఇవ్వటం, సకాలంలో సరైన న్యాయాన్ని అందించి అమలు చేయటంలో అవసరమైన హామీని ఇవ్వటంలో ఆ సవాలు ఎదురౌతున్నది. సోషలిస్టు రాజ్యాంగాన్ని అభివృద్ధి చేసేందుకు, పార్లమెంట్ ఆమోదించిన శాసనకర్తల కాల నియమాన్ని పాటించేందుకు మన కృతనిశ్చయాన్ని పునరుద్ఘాటిస్తున్నాం.

### ఆర్థిక సామాజికాభివృద్ధి

మన పార్టీ 8వ మహాసభలో విలువైన చర్చలు జరిగాయి. కర్తవ్యాన్ని బోధించే చోదకశక్తిగాను, సమాచార దర్శినిగా


epaper.prajasakti.com

ఉపకరించేందుకు కొన్ని ప్రాథమిక దిశానిర్దేశాలను ఆ మహాసభ రూపొందించింది. మన వాస్తవ గమనంలో అనేక సవాళ్లు ఎదురౌతున్నాయి. వాటిలో రెండు ముఖ్యమైన సమస్యలు ముందుకు వచ్చాయి. ఒకటి. కరోనా మహమ్మారి కాలపు బ్లాకేడ్స్‌తో క్యూబా ప్రజల నిత్యజీవితాలపై ప్రభావం. రెండు. సంస్కరణల అమలు రాజకీయ ప్రభావం.

మన సంస్థల సమర్ధతను పెంచేందుకు ఉద్దేశించిన ఈ సంస్కరణలను కష్టకాలంలో అమలు చేయవలసివచ్చింది. దానితో ద్రవ్యోల్బణం తీవ్రమై క్యూబా ప్రజల జీవితాలపై అవాంఛిత ప్రభావం కల్గించింది. దాని ప్రభావాన్ని తగ్గించేందుకు, దుర్బల ప్రజానీకాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్నది. ఆ సంస్కరణలలో జరిగిన అనేక లోపాలను ప్రజాభిప్రాయానికి అనుగుణంగా సరిచేశాం. ఈ సమస్య ఒక్క కలం పోటుతో సరిచేయబడుతుందని మనం అబద్ధాలు చెప్పలేం. విప్లవం ప్రజల ప్రయోజనాలకు, వారి అకాంక్షలకు వ్యతిరేకంగా ఏ పనీ చేయదని స్పష్టంగా చెప్పగలం. అనేక సమస్యలను పరిష్కరించుకున్నట్లే ఈ సవాలును కూడా అధిగమించగలమని నేను విశ్వసిస్తున్నాను.

జాతీయ ఆర్థిక, సామాజిక అభివృద్ధి పథకం అమలుతో 2030 నాటికి క్యూబా ఆర్థికస్థితి ఉన్నత స్థాయికి చేరేందుకు అవసరమైన పునాదులను ఈ పంచవర్ష ప్రణాళిక రూపొందించింది. అందుకు అవసరమైన విధంగా గత మార్గదర్శకాలను మన పార్టీ 8వ మహాసభ తాజా పరచింది. 'ప్రజా సంస్థల వద్ద 'వెలికి తీయని' అద్భుతశక్తి వుంది. ఆ సంస్థల సహకారంతో ప్రభుత్వ పనిని మరింత సమర్ధవంతంగా నిర్వహించగల స్థితిలో మనం వున్నాం. 'ప్రజల శక్తి' విప్లవ క్యూబా రాజకీయ వ్యవస్థకు సిసలైన, సృజనాత్మకమైన వునాది. దాన్ని గుర్తించనివారు, దాన్ని గురించి భయపడేవారు దానిపై దాడి చేస్తున్నారు. సోషలిజాన్ని సంఘటితం చేసేందుకు దాన్ని మరింత శక్తివంతం చేయాలి.

ప్రజల భాగస్వామ్యంతో జరిగే చర్చల్లో విమర్శనాత్మకం, శక్తివంతమైన భావ ధారలు పలు రూపాల్లో ప్రతిబింబిస్తాయి. అన్ని స్థాయిల్లోని ప్రభుత్వ సంస్థల్లో ఈ విధమైన విశ్లేషణలు జరగటం ఎంతో ప్రాధాన్యత గల అంశం. క్యూబాలో విప్లవకర సోషలిస్టు క్రమానికి సృజనాత్మక, బాధ్యతాయుత కార్యాచరణను ప్రోత్సహించాలి.

విభిన్న సంస్థల ప్రతినిధులతోను, సామాజిక తరగతులతోను రంగాలవారీ సమావేశాలు జరపాలి. దానితోపాటు ఇరుగు పొరుగు ప్రాంతాల పర్యటనల్లో ప్రజలతో సంభాషింటం ద్వారా మనం చాలా విషయాలు నేర్చుకుంటాం. పౌరుల సమస్యలు తెలుసుకుంటూ, వారిచ్చే సహకారాన్ని స్వీకరించటం ద్వారా వారి ప్రతి సమస్యనూ సకాలంలో పరిష్కరించగలం. ప్రజల విజ్ఞానాన్ని, బలాబలాలను, చొరవను సదవకాశంగా భావించి గౌరవప్రదమైన పద్ధతిలో, జరూరుగా స్వీకరించాలి. సోషలిస్టు ప్రజాస్వామ్యం ఆవిష్కరణ, ఆచరణ, ప్రజలు పాల్గొనటం వంటి ప్రక్రియలలో శాశ్వతమైన మార్పును కోరుతున్నది.

2019 రాజ్యాంగంతో పాటు, వర్తమాన 'జాతీయ ప్రజల శక్తి అసెంబ్లీ' (నేషనల్ అసెంబ్లీ ఆఫ్ పీపుల్స్ పవర్) మన చర్యలను సమర్ధిస్తున్నది. దేశంలోని చట్టబద్ధ వ్యవస్థతోపాటు మనం కూడా ఎదిగేందుకు ప్రయత్నాలను కొనసాగిద్దాం. ఉద్దీపనలు అందించటం, పదోన్నతులు కల్పించటం, ప్రజల భాగస్మామ్యాన్ని పటిష్టపరచటం వంటి అంశాలు రక్షణాత్మకమైనవి. సోషలిజం నిర్మాణానికి ప్రాధాన్యతగలవి. స్థానిక ప్రభుత్వ విభాగాల్లో లాంఛనప్రాయపు కార్యక్రమాలు పితృస్వామ్యమంతటి ప్రమాదకరమైనవి. ఉదా : సామాజిక భాగస్వామ్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా సరుకులు, వనరులను పంపిణి చేయటం.

సోషలిజం సారం, రక్షణ కవచం ప్రజల భాగస్వామ్యం. ప్రజల భాగస్వామ్యం లేకపోవటం అంటే క్యూబాలో పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించటం అన్న విప్లవ ప్రతీఘాత శక్తుల లక్ష్యాన్ని నేరవేర్చటం అవుతుంది. చర్చలు, విమర్శ ఆత్మవిమర్శకు ప్రజలకు స్వేచ్ఛనివ్వాలి. అభివృద్ధి కొనసాగింపు కోసం వారితో చర్చించాలి. వారి ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రాంతీయ, జాతీయ ప్రాయోజిత అంశాలపై మన ప్రజలతో చర్చలు నిర్వహించాలి. వార్షిక బడ్జెట్ల నిర్ణయంలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి. ప్రభుత్వ నిధులను ఎపుడు, ఎంత ఖర్చు పెట్టామన్న అంశాన్ని ప్రజలకు తెలియజేయాలి.

ఈ మహమ్మారి కమ్మేసిన నెలల్లో పని ప్రదేశాలు, నివాస ప్రాంతాలు, సామాజిక సంస్థల్లో అంటువ్యాధులను, మరణాలను అరికట్టేందుకు ప్రభుత్వం పట్టుదలగా కృషి చేసింది. అందుకు శాస్త్రవేత్తలు, డాక్టర్లు, ఇతర ఆరోగ్య సిబ్బంది, విద్యావంతులు, కార్మికులు, సైనికులు, యువత, విద్యార్థుల మద్దతును ప్రభుత్వం కూడగట్టింది. ఈ కృషిలో పౌరుల భాగస్వామ్యమే ప్రాణాలను కాపాడింది. ఈ ప్రక్రియకంతటికీ కథానాయకులు – పవిత్రమైన మన ఐక్యతా నిర్మాతలైన, మన గౌరవ పరిరక్షకులైన మన ప్రజలే. పిల్లలు, యువతపై ప్రత్యేక శ్రద్ధతో సామూహిక వ్యాక్సినేషన్ ప్రక్రియ ముందుకెళ్లేకొద్దీ హక్కుల సమగ్ర పరిరక్షణకు క్యూబా నూతన తరం అంకితమై ఉందని నిరూపించుకోగల్గాం. అలాంటి కృషి అరుదైన అంశంగా కాక నిత్యజీవిత కార్యక్రమంగా మారింది.

కుటుంబాల సమిష్టితత్వం, భిన్నత్వం, సమానత్వం, వివక్షారహితమైన నియమాలను గుర్తించి, అభివృద్ధి చేసేందుకు మనం కట్టుబడి ఉన్నాం. ఆ ఉద్దేశ్యంతోనే మనమిపుడు 'కుటుంబాల నియమావళి' ప్రాథమిక ముసాయిదా పత్రాన్ని రూపొందించాం. మానవ హక్కులు, బాధ్యతలను అందులో పొందుపరిచాం. ప్రభుత్వం దానిని చిత్తశుద్ధితో అమలుచేస్తుంది. ప్రత్యేక చర్చల ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ, జాతీయ పార్లమెంట్‌లో సంప్రదింపుల ద్వారా ఈ ముసాయిదా చట్టరూపం దాలుస్తుంది. తద్వారా ప్రపంచంలో బాగా అభివృద్ధి చెందిన దేశాల సరసన క్యూబాను నిలబెట్టగలం. 'మహిళాభివృద్ధికి జాతీయ ప్రణాళిక'; 'జాత్యహంకారం, జాతి

“ సోషలిజం సారం, రక్షణ కవచం ప్రజల భాగస్వామ్యం. ప్రజల భాగస్వామ్యం లేకపోవటం అంటే క్యూబాలో పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించటం అన్న విప్లవ ప్రతీఘాత శక్తుల లక్ష్యాన్ని నేరవేర్చటం అవుతుంది. చర్చలు, విమర్శ ఆత్మవిమర్శకు ప్రజలకు స్వేచ్ఛనివ్వాలి. అభివృద్ధి కొనసాగింపు కోసం వారితో చర్చించాలి. వారి ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రాంతీయ, జాతీయ ప్రాయోజిత అంశాలపై మన ప్రజలతో చర్చలు నిర్వహించాలి. ”


epaper.prajasakti.com

> **“ ప్రపంచంలో బాగా అభివృద్ధి చెందిన దేశాల సరసన క్యూబాను నిలబెట్టగలం. 'మహిళాభివృద్ధికి జాతీయ ప్రణాళిక'; 'జాత్యహంకారం, జాతి వివక్ష వ్యతిరేక జాతీయ ప్రణాళిక', 'శ్రామిక మహిళలు మరియు ప్రసూతి చట్టం' వంటి అనేక చట్టాలు మనదేశంలో అమలౌతున్నాయి. ఇవి కేవలం కొన్ని ఉదాహరణలు మాత్రమే. అంటే విప్లవం సమానత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తుందని, వాటి అమలుకు హామీగా నిలుస్తుందని ఇవి స్పష్టం చేస్తున్నాయి. ”**

వివక్ష వ్యతిరేక జాతీయ ప్రణాళిక', 'శ్రామిక మహిళలు మరియు ప్రసూతి చట్టం' వంటి అనేక చట్టాలు మనదేశంలో అమలౌతున్నాయి. ఇవి కేవలం కొన్ని ఉదాహరణలు మాత్రమే. అంటే విప్లవం సమానత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తుందని, వాటి అమలుకు హామీగా నిలుస్తుందని ఇవి స్పష్టం చేస్తున్నాయి.

మన అంతర్గత విషయాల్లో అమెరికా అనుచిత జోక్యం చేసుకుంటున్నది. మనకు అంగీకారం కాని శక్తులను ప్రోత్సహిస్తున్నది. దాని వైఖరిని ఖండిస్తూ 2019లో మన జాతీయ పార్లమెంట్ తీర్మానం చేసింది. విప్లవ వ్యతిరేక కార్యక్రమాలను ఆ తీర్మానం తిరస్కరించింది. 'హక్కుల పత్రం' (మాగ్నాకార్టా) 56వ అధికరణం ప్రకారం చట్టబద్ధ హక్కుల సాధనకు ప్రజలు శాంతియుతంగా ఒక చోటచేరి చర్చించుకునే హక్కును రాజ్యాంగం గుర్తించింది. హక్కుల సాధన అంటే-బాధ్యతలను నిర్వర్తించటం, రాజ్యాంగం ఆదేశించిన క్రమశిక్షణను గౌరవించటం, ప్రజాస్వామ్యాన్ని అమలు చేయటం. 'చట్టం' గురించి ఎవరికి నచ్చిన విధంగా వారు వ్యాఖ్యానించటం సరికాదు. ఆర్టికల్ 7లో పేర్కొన్నట్లు రాజ్యాంగం అత్యున్నతమైనది. అందరూ రాజ్యాంగబద్ధులై వుండాలి. అన్ని సంస్థల డైరెక్టర్లు, ఉద్యోగులతో పాటు ఆయా సంస్థలూ రాజ్యాంగ నిబంధనలను పాటించాలి. మన రాజ్యాంగంలో పేర్కొన్న ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాల అమలులో ఇతర దేశాల ప్రత్యక్ష, పరోక్ష జోక్యాన్ని నిరాకరిస్తుంది. విదేశీ సాయుధ జోక్యాన్ని, ఆర్థిక, రాజకీయ వత్తిడిని అనుమతించదు. అంతర్జాతీయ చట్ట ఉల్లంఘనలను, రాజ్యపు సమగ్ర తను రూపుమాపే యత్నాలను అవి విదేశీయమైనా, స్వదేశీయమైనా రాజ్యాంగం అనుమతించదు. రాజ్యం సమగ్రతను కాపాడుకోవటానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

పౌరహక్కులు, సమిష్టి భద్రత, ప్రజలందరి సంక్షేమం మున్నగు అంశాలు రాజ్యాంగంలో చేర్చాం. గత 60 సంవత్సరాలుగా కొన్ని విదేశీ ప్రభుత్వాలు మనపై ఆర్థిక యుద్ధం చేస్తున్నాయి. అటువంటి శక్తులచే ప్రేరేపించబడి రాజ్యాంగానికి, సోషలిజానికి వ్యతిరేకంగా చేసే కొన్ని కార్యక్రమాలు నిరోధించబడతాయి.

ఈ కాలంలో ఆర్థిక, సామాజిక రంగాల్లో సమస్యలను ఎదుర్కొనే సాధనాలను సమకూర్చిన 'శాస్త్ర విజ్ఞాన రంగాల'ను ఏకీకృతం చేస్తున్నాం. ఫిడెల్ కాస్ట్రో ఎంతో ముందు చూపుతో రూపొందించిన విధానాలతో శాస్త్రీయ విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందింది. రాహుల్ కాస్ట్రో ఆ విధానాలను కొనసాగించటంలో చూపిన ప్రతిభ, అంకితభావం వల్ల వివిధ తరాల క్యూబా శాస్త్రవేత్తలకు తర్ఫీదు ఇవ్వబడింది. అందువల్లనే ఈ మహమ్మారి కాలంలో లాటిన్ అమెరికా, మూడవ ప్రపంచ దేశాలు అందించలేని ఆరోగ్య భద్రతను మన ప్రజలకు అందించగల్గాం. అందువలననే ఆరోగ్య నిపుణులు, సృజనాత్మక శాస్త్రవేత్తలు, విద్యావేత్తల గురించే మొదట మాట్లాడవసి వస్తుంది.

ప్రమాదకరమైన పరిస్థితులు వుత్పన్నమైనపుడు నిర్ణయాత్మక మద్దతును సమకూర్చగల మన సాయుధ సంస్థలు, విప్లవ సాయుధ దళాలు, అంతర్గత మంత్రిత్వ శాఖల గురించి కూడా మనం మాట్లాడుకోవాలి. అత్యంత క్లిష్ట సమయంలో ఆక్సిజన్ ఉత్పత్తి, రవాణా, దేశంలోని అన్ని వైద్యశాలలకు సరఫరాచేసే సంక్లిష్టమైన కర్తవ్యాన్ని పూర్తి చేసినందుకు కూడా పై సంస్థలను అభినందిస్తాము. జాతీయ ఆర్థిక వ్యవస్థకు అమూల్యమైన సహకారాన్ని సమకూర్చుతూ, అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక వనరులను అందిస్తున్న విప్లవ సాయుధ దళాల సేవలను కూడా మనం గుర్తిస్తున్నాం.

ఉమ్మడి లక్ష్యసాధన కోసం సంఘటితమైన సమైక్య నాయకత్వం గల దేశం మాత్రమే సంక్లిష్ట సమయాల్లో అత్యున్నత లక్ష్యాలను నిర్దేశించుకుని తన దేశాన్ని కాపాడుకోగల్గుతుంది. మన దేశం, అనేక ఆంక్షల నడుమ ఆర్థిక వనరుల కొరతతో వుంది. ముంచుకొస్తున్న కరోనా మహమ్మారి ప్రమాదం నుండి ప్రజలను కాపాడుకోలేని స్థితిలో ఉన్నామని గమనించాం. అందుకే ఆ వ్యాధి విస్తరణను అరికట్టే స్వదేశీ వైద్య విజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని మన 'శాస్త్రీయ పరిశోధనా సంస్థల'ను కోరాం.

మూడు వ్యాక్సిన్‌లను ఉత్పత్తిచేస్తూ, మరో రెండు వ్యాక్సిన్‌లను అభివృద్ధి చేసుకుంటున్న దశలో మనం ఉన్నాం. ఈ కృషిలో లాటిన్ అమెరికా దేశాలన్నింటి కంటే మనదేశం అగ్రభాగాన వుంది. 2-18 సంవత్సరాల మధ్య వయసు పిల్లలకు వ్యాక్సిన్‌లు వేయటంలో ప్రపంచంలోనే మనం ముందున్నాం. కొత్త వైరస్‌లు వ్యాపిస్తున్నాయి. ఆక్సిజన్ కొరత, ఇతర సమస్యల వలన రోగులతో ఆసుపత్రులు నిండిపోతున్నాయి. ఇటువంటి పరిస్థితులలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు విఫలమవటం వలన వుద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఔషధాలు, ఆహారం పరిమితంగా అందుబాటులో వుండటం వలన సంక్షోభ కాలంలో ఎదురు దెబ్బలుతిన్నాం. క్యూబాకు అంతిమ క్షణాలు సమీపించాయని మన వ్యతిరేకులు సంబర పడుతున్నారు. “క్యూబాలో మానవత్వం పేరుతో క్యూబాలో జోక్యం చేసుకోవటం లేదా కనీసం సైనిక దాడి చేయటం ద్వారా మన గొంతులు కోయాలని” ఆ గ్రూపులు గావు కేకలు వేస్తున్నాయి. ఈ శతాబ్దంలో నాటో సైనిక దళాలు లేదా యాంకీలు స్వతంత్ర రాజ్యాలపై సాగించిన దురాక్రమణల చరిత్రను పరిశీలించేందుకు కూడా వారు విముఖంగా వున్నారు. కానీ క్యూబా ప్రజానీకానికి, ప్రపంచంలోని విజ్ఞులందరికీ ఆ చరిత్ర తెలుసు. ఈ చైతన్యంతోనే ప్రపంచవ్యాపితంగా 'క్యూబా సంఘీభావ నిధి' సేకరిస్తున్నారు. ఆ మొత్తాలు క్యూబాకు చేరుతున్నాయి.

గత కొద్ది వారాలుగా మన దేశంలో అంటువ్యాధుల వ్యాప్తి, మరణాల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టింది. పాఠశాలలకు తిరిగి వెళ్లేందుకు విద్యార్థులు సిద్ధమౌతున్నారు. ఆర్థికవ్యవస్థను బలపర్చుకుని సరిహద్దులను తెరిచేందుకు దేశం తయారౌతున్నది. మన పిల్లలు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు, మన ప్రజలు ఫిడెల్ కాస్ట్రోను స్మరించుకుంటూ పండుగలా జరుపుకోవాలని


epaper.prajasakti.com

ఈ తరుణాన్ని భావిస్తున్నాం. మానవాళి పాత్రపట్ల ఆయనకున్న అపారమైన విశ్వాసం పదేపదే పునరావృతమౌతున్నది. ఆర్థిక మాంద్యం మూలంగా ఉత్పన్నమైన సంక్షోభం నేపధ్యంలో, ప్రపంచం నలు చెరగులా మహమ్మారి విస్తరించింది. ప్రపంచ వాస్తవ పరిస్థితిని గమనంలో ఉంచుకుని మన విజయాలను దీర్ఘకాలం కొనసాగించటానికి కృషిచేద్దాం.

దేశ రాజధాని హవానా 502వ వార్షికోత్సవాల కోసం ఎదురు చూస్తుంటుంది. కరోనా మూలంగా గత రెండు సంవత్సరాలుగా ఆ వుత్సవాలను నిర్వహించలేక పోయాం. అత్యంత ఆనందదాయకంగా జాతీయ జీవనం పునఃప్రారంభం కాబోతున్నది. మన వీధులలో శాంతి, సామరస్యాల వెలుగులు తిరిగి విరజిమ్మనున్నాయి. మన పార్టీని ఎవ్వరూ చెరపలేరు. కోవిడ్ 19ని నిరోధిస్తూ, భయాన్ని అధిగమిస్తూ నిరంతరం మనం టీకాలు వేయించుకుంటున్నాము. మనకొక మాతృభూమి వుంది! మన జీవితాలను కాపాడుకుంటాం! మనం విజయం సాధిస్తాం!

> **“ మూడు వ్యాక్సిన్‌లను ఉత్పత్తిచేస్తూ, మరో రెండు వ్యాక్సిన్‌లను అభివృద్ధి చేసుకుంటున్న దశలో మనం ఉన్నాం. ఈ కృషిలో లాటిన్ అమెరికా దేశాలన్నింటి కంటే మనదేశం అగ్రభాగాన వుంది. 2-18 సంవత్సరాల మధ్య వయసు పిల్లలకు వ్యాక్సిన్‌లు వేయటంలో ప్రపంచంలోనే మనం ముందున్నాం. కొత్త వైరస్‌లు వ్యాప్తిస్తున్నాయి. ఆక్సిజన్ కొరత, ఇతర సమస్యల వలన రోగులతో ఆసుపత్రులు నిండిపోతున్నాయి. ”**

అనువాదం: వై సిద్ధయ్య

# ఎల్.ఐ.సి ఐ.పి.ఓ

**(19వ పేజీ తరువాయి)**

మనం ఒక అగ్రగామి బీమా కంపెనీ గురించి మాట్లాడుతున్నాం కాబట్టి ప్రపంచంలోని ఇతర వాటిలా కాకుండా ప్రత్యేకంగా రూపొందించబడినది కనుక, తర్వాత అయినా మార్కెట్‌ను సంప్రదించాల్సిన ఔచిత్యం ప్రభుత్వానికి లేదా? ఈ ప్రక్రియ మొత్తం చూడబోతే బందిపోటుల వంటి పెట్టుబడిదారుల గుంపు మధ్య మోడీ ప్రభుత్వం తనను తానుగా ఇరుక్కున్నట్లు ఉంది.

పాలసీదారులు ఐపిఒలో వాటాలకు అర్హులు అనే వాదన కూడా తెలివైనది కాదు, ఇది చాలా వికృతంగా ఉంది. మొదటిది, వ్యక్తిగత పాలసీదారులే కాకుండా పాలసీ దారులందరూ ఒక తరగతిగా సామూహికంగా మోసం చేయబడుతున్నారనడంలో సందేహం లేదు. రెండవది, లక్షలాది మంది పాలసీదారులు, ముఖ్యంగా చిన్నసైజు పాలసీలు కలిగి ఉన్నవారు స్టాక్ మార్కెట్‌లోకి ప్రవేశించే స్థితిలో లేకపోవచ్చు లేదా అలా చేయాలనే కోరిక కూడా కలిగి ఉండకపోవచ్చు. వీరిని ఐపిఒ అని పిలువబడే లాటరీలో పాల్గొనడానికి అధికారికంగా “అనుమతించడం” జరిగినంత మాత్రాన వారంతా ఒక తరగతిగా కోల్పోయారనే వాస్తవం సరిచేయలేనిది.

మూడవది, పాలసీదారులకు ఐపిఒలో కొంత భాగాన్ని రిజర్వ్ చేయాలనే ఆలోచన గురించి మీడియాలో ఒక్క స్వరం కూడా వినిపించ లేదు. ఇప్పుడు ప్రభుత్వం పాలసీదారులను ఐపిఒ యొక్క “కస్టమర్లు”గా ఎలాంటి యాజమాన్య హక్కులు లేకుండా పరిగణిస్తోంది.

భారతీయ మూలధన మార్కెట్ల చరిత్రలో ఒక కంపెనీ తన “కస్టమర్లకు” షేర్లు ఇచ్చిన పబ్లిక్ ఇష్యూ మరేదైనా ఉందా? ఆలోచించండి. పేటిమ్ తన కస్టమర్లకు తగ్గింపు ధరలకు తన షేర్లను విక్రయించడం హాస్యాస్పదంగా ఉంటుంది. చాలా వరకు ఎల్ఐసి కి కూడా ఇదే వర్తిస్తుంది.

ఇలా జరగడానికి గల ఏకైక కారణం ఏమిటి? పెద్ద సహకార సంస్థగా నిర్మితమై ఉన్న ఎల్ఐసీలోని లక్షలాది మంది పాలసీదారులే “యజమానులు”, వారు ఈ హోదాను కోల్పోయే ప్రమాదంలో ఉన్నారు. ఇది ఆ లక్షలాది మంది పాలసీదారుల వ్యతిరేకతను మట్టుబెట్టే వ్యూహాత్మక ఎత్తుగడ. ఈ సహకార సంస్థకి ప్రభుత్వం పూర్తి యజమాని కాదు, ట్రస్టీగా వ్యవహరిస్తుంది. ఈ ట్రస్టీ మోసగాడు అయ్యాడనేందుకు పబ్లిక్ ఆఫరింగ్ ఇష్యూ (ఐపిఒ) చేయటమే రుజువు.

**ఎల్ఐసి కూల్చివేతలో ఐపిఓ మొదటి దశ**

ఎల్ఐసి ఐపిఒకి దీర్ఘకాలిక పరిణామాలు ఉంటాయని బెదిరిస్తోంది. మార్కెట్ రెగ్యులేటర్ యొక్క నిబంధనలు ఏమిటంటే ఎల్ఐసి ఐదేళ్లలో కనీసం 10 నుండి 25 శాతం పబ్లిక్ హోల్డింగ్‌ను కలిగి ఉండటానికి, రెండు సంవత్సరాలలోపు మళ్లీ మార్కెట్‌లోకి వెళ్ళవలసి ఉంటుంది. మరొకసారి మార్కెట్ లోకి వెళ్ళినప్పుడు ఈ ఐపిఒలో అందించబడిన అతి తక్కువ తగ్గింపు ప్రభుత్వ వాటా ధర కంటే తక్కువ ధర చేయ వలసిన అవసరం రావచ్చు.

అమ్మకానికి లిస్ట్ అయిన వెంటనే వచ్చే షేర్ ధరలోని “ఆకస్మిక పెరుగుదల” నుండి “ఫీల్ గుడ్” ఎఫెక్ట్‌ను వెలికితీసేందుకు ప్రభుత్వం చూస్తున్నట్టుగా ఉంది. 2019లో ఐఆర్‌సిటిసి ఐపిఒతో ఏమి జరిగిందో గుర్తుందా? అప్పుడు షేర్ ఇష్యూ ధర రూ. ఒక్కో షేరుకు 315-320, కానీ లిస్టింగ్ రోజున రూ. 644 గా ఉంది. ఎల్ఐసిని అమ్మకానికి లిస్ట్ చేసినప్పుడు వచ్చే “ఆకస్మిక పెరుగుదల” వల్ల ప్రభుత్వం కానీ, కోట్లాది ఎల్ఐసి పాలసీదారులు కానీ పైసా పొందలేరు. బదులుగా కేవలం ఆ చతురులైన పెట్టుబడిదారులు మాత్రమే విపరీతంగా లాభపడతారు .

బహుశా మోడీ ప్రభుత్వం లాభాలకోసం చూసే షార్కుల యొక్క భారీ ఆదాయాల మీద ఆశలు పెట్టుకున్నట్టుంది. వీరు ప్రభుత్వం మరియు కోట్లాది పాలసీదారులకు నష్టాల నుండి నేరుగా వచ్చే ప్రీమియం తీసుకున్న తర్వాత నిష్క్రమిస్తారు. ఎప్పటికీ ఫీల్ గుడ్ మోడ్‌లో ఉండే ప్రభుత్వానికి ఇది బాగానే తెలుసు. కానీమే 4న తయారు చేయబడిన ఐపిఒ భారతదేశంలోని అత్యంత ప్రజాదరణ పొందిన సంస్థలలో ఒకదానిని కూల్చివేయడానికి నాంది పలికింది.

అనువాదం: కె పుష్పవలి




epaper.prajasakti.com

# బిజెపిని ఒంటరిపాటు చేసి ఓడించాలి

## సందేహాలు సమాధానాలు

బి.వి.రాఘవులు



**బెంగాల్‌లో గతంలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న మన పార్టీకి సీట్లు తగ్గాయి. ఇందుకు కారణాలను వివరించగలరు.**

**రాబోయే కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో ఇతర పార్టీలతో ఎన్నికల పొత్తులు ఉంటాయా? ఉంటే అవి ఎన్నికల వరకే పరిమితమా? రాజకీయంగా కూడా ఉంటాయా?**

**పి.రామకృష్ణ, పశ్చిమ గోదావరి జిల్లా**

రాబోయే కాలంలో దేశంలో రాష్ట్ర శాసనసభలకు, పార్లమెంటుకు ఎన్నికలు జరిగినప్పుడు ఎటువంటి వైఖరి తీసుకోవాలన్న అంశాన్ని పార్టీ విధానాన్ని కేరళ రాష్ట్రంలోని కన్నూర్ పట్టణంలో పార్టీ జరిగిన 23వ మహాసభలో రూపొందించడం జరిగింది. ఈ మహాసభ ఆమోదించిన రాజకీయ తీర్మానం మనం అనుసరించాల్సిన రాజకీయ విధానాన్ని, అందులో భాగంగా ఎన్నికల విధానాన్ని వివరించింది.

ఇందులో బిజెపిని ఒంటరిపాటు జెయ్యడం, ఓడించడం ప్రధాన రాజకీయ కర్తవ్యంగా పేర్కొన్నది. బి.జె.పిని, సంఘపరివార్ శక్తులను ఎన్నికలలోనే కాక అన్ని రంగాలలోనూ బలహీన జెయ్యాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. ఎన్నికలలో బి.జె.పిని ఓడించేందుకు మనశక్తి మేరకు బి.జె.పి వ్యతిరేక ఓట్లు చీలకుండా ఒక చోటకు సమీకరించేందుకు వీలుగా మనం ఎత్తుగడలను అనుసరించాలని స్పష్టంజేసింది.

ఎన్నికలొచ్చినప్పుడు ఆయా రాష్ట్రాలలో పార్టీలను, పరిస్థితుల అంచనాను బట్టి నిర్ణయాలు తీసుకోవాలని భావించింది.

పై విధానానికి తగట్టు రాబోయే కాలంలో మన ఎన్నికల ఎత్తుగలుంటాయి.

ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎన్నికల ఎత్తుగడల పై విధానానికి అనుగుణంగా వుంటాయి. మన రాష్ట్రంలో చాపక్రింద నీరులాగా సంఘపరివార్ శక్తులు మత విద్వేషాలను, హిందుత్వ మతోన్మాద భావాలను వ్యాపింపజేస్తున్న ప్రమాదాన్ని గమనిస్తూ ఈ ప్రమాదం పట్ల రాష్ట్రంలో వై.ఎస్.ఆర్.సి.పి, టి.డి.పి, జనసేన ఎలా వ్యవహరిస్తున్నాయన్న అంశాన్ని గమనంలో వుంచుకుని మన వైఖరిని రూపొందించుకోవాలి. ప్రస్తుతం ఈ మూడు పార్టీలు ప్రత్యక్షంగా, పరోక్షంగా బి.జె.పి పట్ల సానుకూలంగానో, మెతకగానో వ్యవహరిస్తున్నాయి. వై.ఎస్.ఆర్. పార్టీ రాష్ట్రంలో అధికారంలో వుండి ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నది. మనపార్టీ ఈ విధానాలపై పోరాడుతున్నది. పరిస్థితులిలాగే కొనసాగితే పొత్తుల గురించి, సర్దుబాట్ల గురించి చర్చించడానికి రాజకీయంగా అవకాశం వుండదు.

పశ్చిమ బెంగాల్‌లో మొదట పార్లమెంటు ఎన్నికల్లో, ఆ తర్వాత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పార్టీ సర్దుబాటు జేసుకున్నది. ఆ సందర్భాలలో పార్టీ వైపు నుండి రాజకీయ లోపాల గురించి గతంలో పార్టీ విడుదల జేసిన తీర్మానాలలో వివరించింది. వాటిని చదివితే వివరాలు తెలుసుకోవచ్చు.

అయితే ఈ ఎన్నికల్లో పార్టీ ఓట్లు తగ్గడానికి ఎన్నికల ఎత్తుగడలలో లోపాలే కారణం కాదు. మన పార్టీ 2007 నుండి క్రమేణా ప్రజాపునాది కోల్పోతూ వచ్చింది. దానికి రాజకీయ, నిర్మాణ, ఉద్యమ, పరిపాలనా అంశాలు, పాలకవర్గాల కుట్రలు, దాడులు కారణం అని పార్టీ ఇంతకు ముందే ఆత్మ విమర్శనా పూర్వకంగా విశ్లేషించింది. ఈ అంశాలు కూడా పార్టీ తీర్మానాలలో వున్నాయి. ఉద్యమాలను, పోరాటాలను ఉధృతం జేయడం, నిర్మాణాన్ని పటిష్టం జేసుకోవడం ద్వారా పార్టీ వున్న ప్రజాపునాదిని నిలబెట్టుకుంటూ విస్తరించేందుకు ఈ మధ్య కాలంలో కృషిపెంచింది. ఇప్పుడిప్పుడే సానుకూల మార్పు కన్పిస్తున్నది.

**భారత దేశంలో మన పార్టీ కార్యక్రమం “జనతా ప్రజాతంత్ర విప్లవాన్ని పూర్తి చేయడం”, అంటే దేశంలో బడా పెట్టుబడిదారీ వర్గం నాయకత్వానగల బూర్జువా, భూస్వామ్య పాలకవర్గాలకు వ్యతిరేకంగా మన వర్గాల ప్రజలను (కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, చేతివృత్తుల వారు తదితరులు) ఏకం చేసి ప్రజా పోరాటాల ద్వారా మన లక్ష్యాన్ని సాధించుకోవాలి అని చెప్పారు.**

**మన దేశంలో ఈ రోజుకీ మెజారిటీ ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారు. కాబట్టి వర్గ పోరాటానికి రైతాంగం నాయకత్వం వహించాలి కదా! కాని కార్మికవర్గం నాయకత్వం వహిస్తుందని చెబుతున్నారు. మన దేశంలో తీసుకురావాల్సింది వ్యవసాయక విప్లవం కదా! వ్యవసాయక విప్లవానికి కార్మికవర్గం ఎందుకు నాయకత్వం వహించాలి?**

**– పి. రామ్మోహన్, విజయనగరం**

మన పాలకవర్గాలను (బాడాబూర్జువా నాయకత్వాన సామ్రాజ్యవాదంతో స్నేహం నెరిపే బూర్జువా, భూస్వామ్య శక్తులు). ఓడించి “జనతా ప్రజాతంత్ర విప్లవాన్ని సాధించేందుకు మనం” జనతా ప్రజాతంత్ర సంఘటనను నిర్మించాలి. కార్మికవర్గం ఈ సంఘటనకు నాయకత్వం వహించాలి. ఈ సంఘటనకు కార్మిక – కర్షక మైత్రి పునాదిగా వుంటుంది. మన పార్టీ కార్యక్రమం ఈ అంశాన్ని స్పష్టంగా పేర్కొన్నది జనతా ప్రజాసంఘటనలోని వివిధ వర్గాలు నిర్వహించే పాత్ర గురించి సవివరంగా కార్యక్రమం చెప్పింది. దాన్ని చదివితే ఇంకా వివరాలు తెలుస్తాయి. విప్లవంలో వివిధ వర్గాలు నిర్వహించే పాత్ర గురించి అర్థం జేసుకోవడానికి మనం రెండు స్థాయిల్లో పరిశీలించాలి.

మొదటిది, మార్క్సిజం లెనినిజం ప్రకారం సామాజిక పరిణామంలో వివిధ వర్గాలు



epaper.prajasakti.com

నిర్వహించే పాత్ర గురించిన సైద్ధాంతిక అవగాహన. దీని ప్రకారం ఆధునిక సమాజంలో అన్నిటి కన్నా కార్మికవర్గం స్వభావం రీత్యా విప్లవకరమైనది. దాని స్వభావం దాని సంఖ్యా బలంమీద ఆధారపడదు. ఉత్పత్తి ప్రక్రియలో అది నిర్వహించే పాత్రపై ఆధారపడుతుంది. అందువలన అది పారిశ్రామిక సమాజమైనా, వ్యవసాయక సమాజమైనా, సంఖ్యాపరంగా ఎక్కువగావున్నా, తక్కువగావున్నా వర్గస్వభావం రీత్యా విప్లవానికి నాయకత్వం వహించగల ఆలోచనా శక్తి కార్మికవర్గానికి మాత్రమే వుంటుంది. అందుకే మనదేశంలో కూడా వ్యవసాయవర్గాలతో పోల్చుకున్నప్పుడు సంఖ్యాపరంగా కార్మికవర్గం చిన్నదైనప్పటికి, అదే నాయకత్వ పాత్ర వహిస్తుంది అని చెబుతున్నాం.

అయితే పూర్తిగా పారిశ్రామికీకరణ జరిగిన సమాజాలకు భిన్నంగా మనదేశం ఇంకా వ్యవసాయ దేశంగా వుంది. ఇప్పటికీ 60 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నారు. భూస్వామిక వ్యవస్థ అవశేషాలు, భూకేంద్రీకరణ బలంగానే కొనసాగుతున్నాయి. ఈ భూకేంద్రీకరణను బద్దలు కొట్టకుండా అత్యధికంగా వున్న వ్యవసాయ జనాభా సమస్యలు పరిష్కారంకావు. బడా పెట్టుబడిదారీ వర్గం ఈ భూస్వామ్య శక్తులను ఇంకా కాపాడుతున్న నేపథ్యంలో పెట్టుబడిదారీ వర్గాన్ని కూలదోయాలన్నా వ్యవసాయ సంబంధాల్ని ప్రజాస్వామికరించే పోరాటాన్ని చెయ్యాల్సివుంది. ఆ రకంగా విప్లవానికి నాయకత్వం వహించే కార్మిక వర్గం వ్యవసాయక సమస్యపై కేంద్రీకరించాల్సి వుంది. అందుకే ప్రస్తుత భారతదేశ పరిస్థితుల్లో విప్లవానికి వ్యవసాయక విప్లవం ఇరుసు లాంటిదని పార్టీ కార్యక్రమం చెబుతుంది. ఈ పోరాటాని చేపట్టడం ద్వారానే కార్మిక, కర్షకమైత్రి బలపడుతుంది. జనతా ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం అవుతుంది. పాలక వర్గాలను కూలదోసే జనతా ప్రజాతంత్ర విప్లవం కొనసాగింపుగా సోషలిస్టు విప్లవం సాధ్యం అవుతుంది.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యమైనా, అధ్యక్షతరహా పాలనైనా, నియంతలపాలనైనా, రాచరిక పాలనైనా, రాజ్యాంగ యంత్రం ఎప్పుడూ పాలకవర్గాల చేతుల్లోనే వుంటుంది. అయితే ఉదారవాద బూర్జువా ప్రజాస్వామ్యం అమలులో వున్న చోట్ల ఎన్నికల్లో పాలకవర్గాలకు వ్యతిరేకంగా వుండే శక్తులకు కూడా ఎన్నికల్లో గెలిచేందుకు కొన్ని సందర్భాలలో అవకాశాలు వస్తాయి. తమ వ్యవస్థకు ప్రమాదం లేదనుకున్నంత వరకు ఇటువంటి సందర్భాలను పాలకవర్గాలు సహించవచ్చు. ప్రమాదం అనుకున్నప్పుడు కుట్రలు, తిరుగుబాట్లు, హింస ద్వారా వాటిని అణచివేయవచ్చు. ఉదాహరణకు చిలీలో అలెండీని హత్యజేసి ప్రభుత్వానికి కూల్చివేశారు.

విప్లవాన్ని సాధించుకోవడాన్ని బూర్జువా ప్రజాస్వామ్య ఎన్నికలను సాధనంగా వినియోగించుకోడానికి పాలకవర్గాలు అనుమతించవు అని విప్లవకారులు తెలిసినంత మాత్రానా ఎన్నికల్లో పాల్గొనకుండా వుండడం తప్పవుతుంది. ప్రజలు పాల్గొంటున్నప్పుడు, బూర్జువా ప్రజాస్వామిక పద్ధతులపై ప్రజలకు భ్రమలు కొనసాగుతున్నపుడు ఎన్నికలలో పాల్గొనపోవటం అంటే ప్రజలకు దూరంగా పోవడం అవుతుంది. అందుకే ప్రజల చైతన్య స్థాయిని బట్టి ఎన్నికల పట్ల కమ్యూనిస్టులు తమ కార్యాచరణను నిర్ణయించుకోవాలని మార్క్సిజం, లెనినిజం చెబుతుంది.

ఈ అవగాహననుసరించే మనదేశంలో కమ్యూనిస్టు పార్టీలు ఎన్నికలలో పాల్గొంటున్నాయి. అయితే బూర్జువా ప్రజాస్వామ్యంలో జరిగే ఎన్నికల ద్వారా విజయాలు సాధించి, రాజ్యాంగ యంత్రాంగాన్ని సమూలంగా మార్చాల్సిన అవసరం లేకుండా సోషలిజం సాధించవచ్చనే భావన సరైంది కాదు. కమ్యూనిస్టు పార్టీలు ఇటువంటి భావన కమ్యూనిస్టు పార్టీలో ఒక భాగంలో బలపడినప్పుడు, దాన్నుండి తెగతెంపులు జేసుకుని సి.పి.ఐ(ఎం), ఏర్పడింది. ఎన్నికల్లో విజయం సాధించి మూడు (కేరళ, బెంగాల్, త్రిపుర) రాష్ట్రాలలో సి.పి.ఐ(ఎం) నాయకత్వాన ప్రభుత్వాలు ఏర్పడినప్పటికి వాటిని విప్లవాలుగా భావించలేదు. పెట్టుబడిదారీ వ్యవస్థలోనే కొన్ని ప్రత్యామ్నాయ విధానాలను అనుసరించి సామాన్య ప్రజల పోరాటాలకు తోడ్పడే ప్రభుత్వాలుగా భావించి నిర్వహించింది.

మారిన పరిస్థితుల్లో పాలక వర్గాలు ఈ ప్రభుత్వాలను సహించలేని పరిస్థితి ఏర్పడింది. అందుకే కుట్రలు, నిర్బంధాలు, ధనబలంతో వామపక్ష శక్తులు పార్లమెంటరీ ఎన్నికల్లో బలపడకుండా దెబ్బ తీయడానికి పూనుకున్నాయి.

సరళీకరణ విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత ఎన్నికలు ఒక వ్యాపారంగా మారి డబ్బు మయం అయిపోయింది. ఎన్నికల నిర్వహణ స్వతంత్రతను కోల్పోయింది. కార్పొరేట్ మీడియా, మేనేజ్‌మెంటు పద్ధతులు ఎన్నికలను పాలకవర్గాల ఆటస్థలంగా మార్చివేసినాయి. ఈ సంస్థలు కమ్యూనిస్టులు విజయం సాధించగల అవకాశాలను కఠినం జేశాయి. అయినా ప్రజలు ఎన్నికల్లో పాల్గొంటున్నప్పుడు, ప్రస్తుత ఎన్నికల కార్పొరేటు అనుకూల స్వభావాన్ని అర్థం జేసుకోగల చైతన్యం ఇంకా ప్రజలలో రానపుడు ఎన్నికలలో విజయాలు సాధించలేమని దూరంగా వుండడం పలాయన వాదం అవుతుంది. ఈ పార్లమెంటరీ రంగాన్ని కూడా ప్రజలను చైతన్యంజేసే ఒక పోరాట రంగంగా భావించి పాల్గొనాలి. ఎన్నికల బయట జరిగే పోరాటాలను ఉధృతం జేయడం ద్వారా ప్రజల చైతన్యం పెంపొందించి, ఎన్నికల్లో కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా ప్రజలు నిలబడేట్టు జేయాలి. ఇది ఓపికతో జేయాల్సిన కృషి. ఇందుకు దగ్గర దారి లేదు.

**సామ్రాజ్యవాద దేశానికి, సోషలిస్టు దేశానికి మధ్య యుద్ధం వస్తే పార్టీ ఏ వైఖరి తీసుకుంటుంది? యుద్ధాన్ని సమర్థిస్తుందా? వ్యతిరేకిస్తుందా?**

**ఎన్. సురేష్‌కుమార్, కాకినాడ**

సామ్రాజ్యవాద దేశానికి, సోషలిస్టు దేశానికి మధ్య యుద్దం వస్తే మనం అంతర్జాతీయ వాదానికి అనుగుణంగా వ్యవహరిస్తాం. సాధారణంగా సోషలిస్టు దేశాలు ఆత్మరక్షణకు తప్ప, దురాక్రమణ కోసం, ఆధిపత్యం కోసం యుద్ధాలు జేయవు. అందుకే పార్టీ సాధారణంగా సోషలిస్టు దేశాలకు సానుకూలంగా స్పందిస్తుంది. అయితే నిర్దిష్ట సందర్భంలో పరిస్థితిని కూలంకషంగా పరిశీలించే తన వైఖరిని ప్రకటిస్తుంది.

ఉక్రెయిన్‌కి, రష్యాకి మధ్య జరుగుతున్న సైనిక ఘర్షణ వాస్తవంగా అమెరికా నాయకత్వాన వున్న నాటో కూటమికి రష్యాకి జరుగుతున్న యుద్ధం. ఘర్షణ ఉక్రెయిన్‌కి, రష్యాకి మధ్య అయితే అది కొద్ది దినాలలోనే ముగిసి వుండేది. చర్చలు జరిగేవి. ఒడంబడికలు


epaper.prajasakti.com

జరిగివుండేవి. అమెరికా, నాటో కూటమి రష్యా సరిహద్దులో తమకు బలమైన స్థావరంగా ఉక్రెయిన్ వుండాలని భావిస్తున్నాయి. గత దశాబ్దం నుండి అందుకు సన్నాహాలు జేస్తున్నాయి. సైనికంగా ఉక్రెయిన్‌ను సిద్ధం చేసి, మద్దతునిచ్చాయి. అందుకే అమెరికా అంగీకారం లేకుండా ఒడంబడికకు సిద్ధంకావడం లేదు. ఈ కారణంగానే కొద్ది రోజులలో ముగుస్తుందనుకున్న ఘర్షణ యుద్ధంగా మారి ఎంతకాలం సాగుతుందో చెప్పలేని స్థితికి చేరుకుంది. తనకు వక్కలో బల్లెంలాగా ఉక్రెయిన్‌ను సిద్ధంజేస్తుంటే రష్యాకు తన సరిహద్దు రక్షణ విషయంలో ఇది చావు బ్రతుకుల సమస్యగా మారింది. అది తనరక్షణకు గ్యారంటీ లేకుండా యుద్ధం నుండి వెనక్కు తగ్గే పరిస్థితి లేకుండా పోయింది.

రష్యా పాలకవర్గాలు, అత్యధిక ప్రజలు పుతిన్ నిర్ణయానికి సానుకూలంగా ఉండడానికి కారణం అమెరికా నాటో కూటమి ఉక్రెయిన్ అడ్డం పెట్టుకుని రష్యా రక్షణకు ప్రమాదం తెస్తున్నాయని భావించడమే. రష్యాలో కూడా అల్పసంఖ్యాకులైనా ఒక తరగతి ప్రజలు యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నారు. రష్యాలో ప్రజలు ఒకప్పుడు సోషలిస్టు వ్యవస్థలో బ్రతికిన మాట నిజం. కాని అనేక కారణాల మూలంగా వారి చైతన్యం బలహీనపడింది. సోషలిస్టు వ్యవస్థను గోర్బచెవ్, తదనంతర నాయకులు కూలదోస్తున్నా ప్రేక్షక పాత్ర వహించారు. సోషలిస్టు చైతన్యం లేనప్పుడు యుద్ధానికి సానుకూలంగా స్పందించడంలో ఆశ్చర్యమేముంది.

ప్రపంచ దేశాలలో ఒక పెద్ద భాగం అనూహ్యంగా అమెరికాకు సానుకూలంగా వ్యవహరించడానికి సిద్ధపడినప్పటికీ గతంలో అమెరికాకు గట్టిగా మిత్రులుగా ఉన్నదేశాలు కూడా, మనదేశంలో సహ తటస్థంగా వుండడానికి నిర్ణయించుకున్నాయి. ఇరుపక్షాలు యుద్ధాన్ని ఆపాలని, చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని చెబుతున్నాయి.

**కేరళ ప్రభుత్వం నూతన పెన్షన్ పథకం అమలు చేస్తోంది. కార్మికవర్గం డిమాండ్ చేస్తున్న పాత పెన్షన్ పథకం అమలుకు ముందుకు రావడం లేదు. రాజస్థాన్ ప్రభుత్వం ఏప్రిల్ 2022 నుండి పాత పెన్షన్ పథకం అమలు చేస్తున్నట్లు ప్రకటన చేసింది. కేరళలోని సిపిఎం ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని ఎప్పుడు అమలు చేస్తుంది?**

**వి. చంద్రశేఖర్, తిరుపతి**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ స్కీమ్‌ను దేశవ్యాపితంగా అత్యధిక రాష్ట్ర ప్రభుత్వాలు అమలు జేస్తున్నాయి. ఉద్యోగులు, వారి సంఘాలు పాతపెన్షన్ స్కీం కావాలని ఆందోళన జేస్తున్నాయి. అనేక పార్టీలు పాతపెన్షన్ స్కీంను అమలుజేస్తామని ఎన్నికల సందర్భంలో వాగ్ధానం జేశాయి. కేరళలో యు.డి.ఎస్. అధికారంలో వున్నపుడు కొత్త పెన్షన్ స్కీంను అమలుజేసింది. ఎల్.డి.ఎస్ పాత పెన్షన్ స్కీంని సమర్ధించింది. అధికారానికి వచ్చిన తర్వాత అధ్యయనానికి ఒక కమిటీని వేసింది. కేరళ రాష్ట్రంలో రిటైరమెంటు వయస్సు 56గా ఉండటం, సర్వీసు కండీషన్లు, ఇతర అంశాలు భిన్నంగా ఉండటం వల్ల ఈ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేస్తూ, అమలుకుసన్నాహాలు చేస్తున్నది.

# దాడులను తీవ్రం చేసిన సంఘ్‌పరివార్

(16వ పేజీ తరువాయి)

చేసుకోవటానికి, అవసరమైనపుడు రుణాలు పొందటానికి అనువుగా ఉన్న ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరిస్తున్నారు. ప్రభుత్వరంగంలోని బ్యాంకులు ప్రజల డబ్బుకు భద్రత కల్పించటంతో బాటు రైతులు, కార్మికులు, వృత్తులు, వ్యాపారాలు చేసుకుంటున్న సామాన్యప్రజలకు తక్కువ వడ్డీకి రుణాలందిస్తున్నాయి. ప్రజల ఆదాయాలకు, భవిష్యత్‌కు భద్రత కల్పిస్తున్న బ్యాంకులు, జీవిత బీమా సంస్థను ప్రైవేటీకరణ పేరుతో తన అనుయాయులైన బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టటానికి బిజెపి ప్రభుత్వం తొందరపడుతున్నది. గతంలో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించే పేరుతో నామ మాత్రమైన ధరలకైనా అమ్మేవారు. ఇపుడు జాతీయ ద్రవ్య పథకం (నేషనల్ మానెటైజేషన్ పైప్‌లైన్) పేరుతో కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలకు 35 సంవత్సరాలు లీజు అంటూ ఉచితంగా కట్టబెడుతున్నారు. ఫలితంగా మౌలిక సదుపాయాలన్నీ కార్పొరేట్ల చేతుల్లోకి పోవటంతో ప్రజలపై భారాలు మరింతగా పెరుగుతాయి. దీని కోసం ప్రభుత్వం చేస్తున్న వాదన హాస్యాస్పదంగా ఉన్నది. జాతీయ ద్రవ్యీకరణ పథకం ద్వారా నాలుగు సంవత్సరాల కాలంలో ఆరు లక్షల కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని, దేశవ్యాపితంగా మౌలిక సదుపాయాలు కల్పించటం కోసం ఆ ఆదాయాన్ని వినియోగిస్తామని చెబుతున్నారు. పూర్తయిన మౌలిక సదుపాయాలను ప్రైవేటు వారికిస్తూ, తిరిగి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఖర్చు చేస్తున్నదంటే అర్థమేముంది? తిరిగి కల్పించే మౌలిక సదుపాయాలు కూడా ప్రైవేటు వారికే అప్పగిస్తారు కదా! అంటే ప్రైవేటు వారు మాత్రం మౌలిక సదుపాయాలు కల్పించటం కోసం డబ్బు ఖర్చుచేయరు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వమే మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి, ప్రైవేటు వారికి అప్పగిస్తే వారు లాభాలు దండుకుంటారన్న మాట. రోడ్లు, రైల్వేలు, విద్యుత్ రంగం, టెలికాం, గనులు, వైమానిక రంగం, ఓడరేవులు, సహజవాయువు, పెట్రోలియం ఉత్పత్తులను రవాణా చేసే పైప్‌లైన్లు, వేర్‌హౌస్‌లు, స్టేడియంలు తదితరాలు ఈ జాబితాలో ఉన్నాయి. వీటిని తమ స్వాధీనంలోకి తెచ్చుకున్న తర్వాత కార్పొరేట్ సంస్థలకు లాభాలు ఆకాశం నుండి ఊడిపడవు. తమ లాభాల కోసం వినియోగదారులైన ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతారు. జాతీయ ద్రవ్యీకరణ పథకం పేరుతో ప్రజలను కొల్లగొట్టటానికి కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలకు ప్రభుత్వం అవకాశం ఇస్తున్నది.

పీడిత ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై కార్మికవర్గం, వ్యవసాయ కార్మికులు, రైతులు జరిపిన ఈ సమ్మె దేశప్రజల సహకారంతో గొప్పగా విజయవంతమైంది. సమ్మెను జయప్రదం చేయటంలో వ్యక్తమైన ఈ ఐక్యతే ప్రజా ఉద్యమాల పురోగమనానికి బాటలు వేసి, బిజెపి ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిలువరించటానికి, వాటిని తిప్పికొట్టటానికి దారితీయాలి. అపుడే స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాలను ముందుకు తీసుకుపోవటం, ప్రజల ప్రయోజనాలను కాపాడటం సాధ్యమౌతుంది.



epaper.prajasakti.com

వ్యాసం

# తెనాలి సదస్సు

(2వ పేజీ తరువాయి)

మార్చుకోకపోతే, ఎస్.ఏ.డాంగే, అతని మద్దతుదారుల విధానమైన సంస్కరణవాదం, ముఠాతత్వం, విప్లవ సంప్రదాయాలను పరిత్యజించే పద్ధతులకి వ్యతిరేకంగా జరిగే పార్టీ ఏడవ మహాసభను నిర్వహించేందుకు పార్టీ సభ్యులంతా తమతో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. (డాంగే గ్రూప్) వారి కార్యకలాపాలను సమీక్షించటానికి రెండు నెలలలోగా పార్టీ సభ్యుల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి, భవిష్యత్ కార్యాచరణను రూపొందించాలని నిర్ణయించామని కూడా ప్రకటించారు.

ఆ విజ్ఞప్తి ప్రాతిపదికగా జరిగిన తీవ్రమైన చర్చలలో దేశవ్యాప్తంగా ఉన్న పార్టీ సభ్యులు, కమిటీలు భాగస్వాములయారు. పార్టీలోని వివిధ స్థాయిలలో ఐక్యంగా ఉండాలనే కోరిక ఉన్నప్పటికీ, మెజారిటీ సభ్యులు డాంగే, అతని అనుయాయులు అనుసరిస్తున్న సంస్కరణవాద పంథాకు, వారి విచ్ఛిన్నకర విధానాలకు వ్యతిరేకంగా ఉన్నారు. పార్టీ యంత్రాంగం అంతా రివిజనిస్టుల అధీనంలో ఉన్నమాట వాస్తవమే అయినా, పార్టీ సభ్యులలో అత్యధికులు 32 మంది చేసిన విజ్ఞప్తికి అండగా ఉన్నారు.

రివిజనిస్టు నాయకత్వం, 'ఐక్యతను కోరుకుంటున్నామని, చర్చలకు సిద్ధమని' చెపుతూనే, పార్టీ సభ్యులలో గందరగోళాన్ని సృష్టించే ప్రయత్నాలు చేసింది. కానీ డాంగే గ్రూపు, 32 మంది సభ్యుల మధ్య జరిగిన చర్చలలో 32 మంది సభ్యులు చేసిన ప్రతిపాదనలలో ఏ ఒక్కదానినైనా అంగీకరించేందుకు గాని, పార్టీ మొత్తం ప్రజాస్వామ్యబద్ధంగా చేసిన నిర్ణయాలను అమలుపరిచేందుకు గాని డాంగే గ్రూపు సిద్ధంగా లేదన్న విషయం తేటతెల్లమైంది.

నిజానికి వారు పార్టీని చీల్చే ప్రయత్నంలో ఉన్నారు. వారు లోక్‌సభలోని కమ్యూనిస్టు గ్రూపును, కొన్ని రాష్ట్రాలలోని శాసనసభ గ్రూపులను కూడా చీల్చారు. ఆ తరువాతి కాలంలో డాంగే గ్రూపు జాతీయ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన రాజకీయ తీర్మానం తాము కాంగ్రెస్‌తో అంటకాగే విధానాలను కొనసాగించాలనుకున్నట్టు తెలియచేస్తున్నది. ఈ నేపథ్యంలో 1964 జులై 7-11 తేదీలలో తెనాలి సదస్సు జరిగింది. 32 మంది జాతీయ కౌన్సిల్ సభ్యులు కౌన్సిల్‌ను బహిష్కరించి బయటికి వచ్చిన తరువాతి పరిస్థితులు, వారు చేసిన విజ్ఞప్తికి వచ్చిన స్పందన, తదనంతరం తీసుకోవలసిన చర్యలు, పార్టీలో నెలకొన్న తీవ్రమైన అంతర్గత విభేదాలు మొదలైన అంశాలను చర్చించడానికి 1,00,000 మంది పార్టీ సభ్యులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 146 మంది ప్రతినిధులు తెనాలి సదస్సుకు హాజరయ్యారు.

కామ్రేడ్ ముజఫర్ అహ్మద్ పార్టీ జండాని ఆవిష్కరించి, నిజమైన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. కామ్రేడ్ ఏ.కె.గోపాలన్, జ్యోతిబసు, శివవర్మ అధ్యక్షవర్గంగా వ్యవహరించి సదస్సు కార్యక్రమాలను నిర్వహించారు. ఆహ్వానసంఘం తరపున కామ్రేడ్ పి.సుందరయ్య ప్రతినిధులకు ఆహ్వానం పలికారు.

నేషనల్ కౌన్సిల్‌ను బహిష్కరించి బయటికి వచ్చిన 32 మంది ప్రతినిధులు డాంగే గ్రూపుతో జరిపిన 'ఐక్యతా చర్చల' వివరాలను సదస్సు ప్రారంభంలోనే ప్రతినిధుల ముందుపెట్టారు. ఆ తర్వాత వివిధ రాష్ట్రాల ప్రతినిధులు తమ రాష్ట్రాల్లో పార్టీ అంతర్గత పరిస్థితులపైనా,అధికారిక గ్రూపు పాల్పడుతున్న విచ్ఛిన్నకర విధానాలపైనా సమగ్రమైన నివేదికలను సమర్పించారు. వివిధ రాష్ట్రాలలో అత్యధిక సంఖ్యలో పార్టీ సభ్యులు డాంగే నాయకత్వాన్ని వ్యతిరేకించారని, 32 మంది చేసిన విజ్ఞప్తిని అంగీకరించారని ఈ నివేదికలు తెలియచేశాయి.

ఆ తరువాత సైద్ధాంతిక సమస్యల పై పత్రం, 'సైద్ధాంతిక సమస్యలపై చర్చకు సహకారం', పై చర్చలు ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ఉన్న సైద్ధాంతిక విభేదాలను గురించి నివేదికను ప్రవేశపెట్టారు; అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో 'మన పార్టీ ఒక స్వతంత్ర, సార్వభౌమ యూనిట్‌గా సైద్ధాంతిక సమస్యలపై పూర్తిస్థాయిలో ప్రజాతంత్ర యుతంగా, కూలంకషంగా చర్చించి, స్వతంత్రంగా మన నిర్ణయాలను తీసుకుంటాము.'' అని ప్రతిపాదించడం జరిగింది. తక్షణ రాజకీయ, సైద్ధాంతిక సమస్యలపై అంటే మార్పులకు గురయ్యే విధానాలు, శాంతియుత సహజీవనం వగైరా విషయాలు చర్చించి, ముసాయిదా కార్యక్రమంతో పాటుగా తుది నిర్ణయం తీసుకోవాలనే ప్రతిపాదనను అంగీకరించింది.

సదస్సు ముసాయిదా కార్యక్రమాన్ని, కామ్రేడ్ ఇ.ఎం.ఎస్.నోట్‌ను చర్చించింది. డాంగే నాయకత్వంలోని జాతీయ కౌన్సిల్‌లో, డాంగే, భూపేష్ గుప్తా, పి.సి.జోషిలు తయారు చేసిన నివేదికలు కూడా చర్చ కోసం ప్రతినిధులకు అందజేశారు. రెండురోజుల చర్చల అనంతరం కార్యక్రమ ముసాయిదాతో పాటు కామ్రేడ్ ఇ.ఎం.ఎస్ విమర్శను కూడా చర్చకోసం పార్టీ మొత్తానికి అందజేయాలని, ఏడవ మహాసభలో తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు.

రాజకీయ, సైద్ధాంతిక సమస్యలపై నిర్ణయాలు తీసుకున్న తర్వాత పార్టీ ఏడవ మహాసభపై చర్చించి తీసుకున్న తీర్మానాన్ని సదస్సు ఆమోదించింది. ఈ తీర్మానంలో ఇలా విజ్ఞప్తి చేయబడింది; "ఈ చర్య పర్యవసానాలను గురించి ఆందోళన పడుతున్న కామ్రేడ్లకు, మిత్రులకు ఈ చర్యలు మేము ఆనందంతో తీసుకోడంలేదని, తప్పనిసరి పరిస్థితులలో మేమీ నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలియజేస్తున్నాము. దీనిని నివారించాలని మేమెంతో ప్రయత్నం చేశాం. అందువలననే ఐక్యతా ప్రతిపాదనలను అందుకున్న ప్రతిసారి మేము అనుకూలంగా స్పందించాము. కానీ మా ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి; ఏ విధంగానైనా పదవులలో కొనసాగాలను కున్నవారు మా ప్రతిపాదనలను తీవ్రంగా ప్రతిఘటించారు." పార్టీ మహాసభ ఎజెండా కూడా సదస్సులో చేసిన తీర్మానంలో ఆమోదించారు.

పార్టీ మహాసభకు సన్నద్ధం చేసేందుకు, రాష్ట్ర మహాసభలు నిర్వహించేందుకు, కార్మిక సంఘాలు, కిసాన్‌సభ, పార్లమెంటరీ, ఇతర ప్రజా సంఘాలకు దిశానిర్దేశం చేసేందుకు 41 మంది సభ్యులతో ఒక సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ, సెక్రటేరియట్‌ను ఎన్నుకుంది. కామ్రేడ్ ఎం.బసవపున్నయ్య ఈ సెక్రటేరియట్‌కి కన్వీనర్‌గా ఎన్నుకోబడ్డారు.

అనువాదం : కె ఉషారాణి


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్: 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**




epaper.prajasakti.com

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month. మార్క్సిస్టు
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume2: 16, issue : 12 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# ఆశ్రిత పెట్టుబడిదారి విధానం అదానికి అందలం

ప్రపంచంలోని శతకోట్వీరులలో ఒకడైన వారెన్ బఫెట్‌ను అధిగమించి పారిశ్రామికవేత్త గౌతం అదాని ప్రపంచ శతకోటీశ్వరులలో ఐదవ స్థానానికి చేరాడు. ఫోర్బ్స్ అందించిన వివరాల ప్రకారం ఏప్రిల్ 22వ తేదీన గౌతం అదాని సంపద 123.7 బిలియన్ డాలర్లకు చేరటంతో వారెన్ బఫెట్‌ను అధిగమించాడు. 121.7 బిలియన్ డాలర్లతో బఫెట్ ఆరవ స్థానానికి దిగజారాడు.

అదాని భారతదేశంలో అత్యంత సంపన్నునిగా మారగా, 104.7 బిలియన్ డాలర్లతో ముఖేశ్ అంబాని రెండవ స్థానానికి దిగజారాడు.

ప్రస్తుతం అదాని కన్నా ప్రపంచంలో నలుగురే సంపన్నులు ఉన్నారు. మొదటి స్థానంలో ఉన్న ఎలన్ మస్క్‌కు 269.7 బిలియన్ డాలర్లు ఉండగా రెండవ స్థానంలో ఉన్న జెఫ్ బెజోస్‌కు, 170.2 బిలియన్ డాలర్లు, మూడవ స్థానంలో ఉన్న బెమార్డ్ ఆర్నాల్ట్‌కు 167.9 బిలియన్ డాలర్లు, నాలుగవ స్థానంలో ఉన్న బిల్‌గేట్స్‌కు 130.2 బిలియన్ డాలర్ల సంపద ఉన్నది.

2014లో మోడి అధికారంలోకి వచ్చే నాటికి అదాని 7.1 బిలియన్ డాలర్లతో దేశంలోని పెట్టుబడిదారులలో 11వ స్థానంలో ఉన్నాడు. గత ఎనిమిది సంవత్సరాలలో మోడి అండతో దేశసంపదను కబ్జా చేస్తూ, దేశంలోని పెట్టుబడిదారులందరినీ తలదన్ని, 116.6 బిలియన్ డాలర్లు సంపాదించాడు. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి అసలైన ఉదాహరణగా అదాని ఉన్నాడు.

మోడి పాలన ప్రారంభమైన గత ఎనిమిది సంవత్సరాల కాలంలో లక్షమందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కోవిడ్ ప్రారంభమైన తర్వాత 23 కోట్ల మంది భారతీయులు దారిద్ర్యరేఖ దిగువకు జారిపోయారు. ఈ కాలంలో అదాని రోజుకు 1000 కోట్ల రూపాయలకు పైగా సంపాదించాడు.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ. 15,** సంవత్సర చందా:**రూ. 150,** పోస్టు ద్వారా **రూ. 180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు.....................................................

వీధి.....................................................

గ్రామం.....................................................

మండలం లేదా పట్టణం.....................................................

జిల్లా.....................................................

email: marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao,



epaper.prajasakti.com